# సుగంధవనం

నవల

- శ్రీకళ అబ్బరాజు




శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 178

జనవరి 2016 నుంచి ఏప్రిల్ 2017 వరకు

కౌముది మాసపత్రికలో

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

"ఆటో ఇక్కడ ఆపు.. భయ్యా!"

ఆటో పక్కనే స్కూటీ మీద వస్తున్న వసుధ అంది. అప్పటికే, ఆ ఇంటిముందు సామానుల లారీ ఆగివుంది.

ప్రొద్దున, ఆరుగంటలు కూడా కాలేదప్పటికి. సూర్యకిరణాలు చల్లదనాన్ని పూర్తిగా తొలగించలేకపోతున్నాయి. మార్నింగ్ వాక్‌కి వెళ్ళే జనాలు, పాలపాకెట్లు, పేపర్‌లు వేసే వాళ్ళు తప్ప పెద్దగా జనసంచారం లేదు.

ఆటోవాలాకి డబ్బులిచ్చి, బాగ్స్ అందుకుని, దిగింది రచిత. ఆ వెనకాలే అనసూయమ్మ.

లారీతోపాటు వచ్చిన కుర్రవాళ్ళు ఇద్దరు సామాన్లు ఒక్కొక్కటిగా దింపి కాంపౌండు లోపలికి చేరవేస్తున్నారు.

"ఇల్లు పెద్దదిగానే ఉందే.!" అనసూయమ్మ కళ్ళజోడు సరిచేసుకుంటూ అంది.

"ఇది గేటెడ్ కమ్యూనిటీ. అందరూ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిసే. సెక్యూరిటీపరంగా ఏ ప్రోబ్లం లేదు."

వసుధ చెబుతూ ఉంటే రచిత ఆసక్తిగా చుట్టూ చూసింది.

ఇంటిముందు చక్కటి గార్డెన్, అటూ ఇటూ ఖాళీస్థలం. మధ్యలో అందంగా భవంతి.

"నిజంగా నీ అదృష్టమే అనుకో ఇల్లు సిటీలో చవగ్గా అద్దెకి దొరకడం అంటే మాటలు కాదు. ఇంటి ఓనర్స్ మా అన్నయ్య ఫ్రెండ్స్. అమెరికాకి ఆన్‌సైట్ మీద వెళ్ళారు. అద్దె కంటే, ఇంటిని బాగా చూసుకోవడమే ముఖ్యం వాళ్ళకి. మీరు ఇద్దరే ఉంటారని చెబితే ఠకీమని ఒప్పుకున్నారు. " తాళం తీసి ఒక్కొక్క బాగ్గే లోపలకి తెస్తూ చెప్పుకొచ్చింది వసుధ.

"ఏంటే మాట్లాడవూ... నచ్చిందా?" ఏదో ఆలోచిస్తూ నిలబడ్డ రచితను రెట్టించింది.

"ఏమీలేదు. గార్డెన్ అదీ.. అంటే మెయింటెనెన్స్ ఎలా? అని ఆలోచిస్తున్నాను. "

"ఆ దిగులేమీ అక్కర్లేదు. ఈ లైన్లో నాలుగిళ్ళకీ సత్తెన్న అని, తోటపని చేయడానికి వస్తాడు. అతనే చూసుకుంటాడన్నీ. ఖర్చులు ఓనర్ వే. హాయిగా దుర్గాపురంలో ఉన్నట్టే నువ్వు, అమ్మమ్మ గార్డెన్, గాలీ వెలుతురు హాయిగా ఎంజాయ్ చెయ్యండి."

దుర్గాపురం గుర్తుకురాగానే రచిత మనసు బాధతో మూలిగింది.

"అమ్మలూ పాలు పొంగించద్దుటే?" సామాన్లన్నీ లోపలికి వస్తూనే అనసూయమ్మ అంది.

"నాకు తెలుసు. మామ్మగారు ఇలాగే అంటారని. అందుకనే ఇంటినుంచి వచ్చేటప్పుడే రెండు పాలపాకెట్లు కూడా తెచ్చా. స్టవ్, సిలెండర్ మొన్ననే ఏర్పాటయ్యాయి" అంటూ చేతి సంచిలో నుంచి వసుధ రెండు పాలపాకెట్లు బయటికి తీసింది.

బ్యాగ్ తెరిచి, బట్టలు తీసుకుని స్నానానికి వెళ్ళింది రచిత. బాత్‌రూంలో తెల్లటి టైల్స్, అంతకన్నా తెల్లటి ఫిక్చర్స్‌తో వెన్నెల గూడులా అద్భుతంగా ఉంది.

టబ్‌లోకి దిగి షవర్ ఆన్ చేసింది. గోరువెచ్చని నీళ్ళు ఒంటిమీద జలజలా రాలాయి.

ప్రయాణంలో అలిసిపోయిన శరీరంతోబాటూ, మనసుకీ హాయిగా అనిపించింది.

పల్లెటూరు, టౌను. ఆ తర్వాత సిటీ. ప్రదేశం మారుతున్న కొద్దీ మెరుగుపడుతున్న జీవనసరళి. కానీ ఈ ప్రయాణంలో ప్రతిసారీ ఏదో ఒకటి కోల్పోవడం తీరని అశాంతి.

అందరి జీవితాల్లో బాల్యం మధురమైనది. కానీ తనకి మాత్రం పెరుగుతున్న కొద్దీ, భూతంలా మారి వెంటాడుతున్నా అభద్రతాభావం. వెచ్చటి నిట్టూర్పు ఒకటి వేడినీటి జల్లులో కలిసి ఆవిరైపోయింది. స్నానం ముగించి, తడి ఆరని కురులను టవల్‌తో చుట్టింది. ఎర్రరంగు చీర కట్టుకుని, నుదిటిన కుంకుమ దిద్దుకుంది. పెరటి నిండా రకరకాల పూల చెట్లు విరగబూసి ఉన్నాయి. పూజగదిలో దేవుడి పటాలను సర్ది, మల్లె మందారాలతో అందంగా అలంకరించింది. అప్పటికే అనసూయమ్మ, వసుధ కలిసి వెంట తెచ్చుకున్న సరుకులు, వంటసామాగ్రి వంటింటి అరల్లో సర్ది ఉంచారు.

పాలు పొంగాయి. జీడిపప్పు నేతిలో వేయించి, పొంగలి తయారుచేసింది రచిత.

"అమ్మా! తల్లీ దేవుడికి పొంగలి చేస్తే చేశావుగానీ మాకు కాస్త కాఫీ కలుపు" వసుధ హాల్లోనుంచే అరిచింది.

"క్రింద ఒక బెడ్‌రూం, బాత్రూం ఉన్నాయి. మేడమీద రెండుగదులు మాకు అనవసరం" కిటికీ పక్కన గోడకు చేరబడుతూ అంది అనసూయమ్మ.

"మనం వాడుకోకుండా, వారం రోజులకోసారి శుభ్రం చేయిస్తూ ఉంటేసరి. డూప్లెక్స్ హౌస్, ఇంతగాలీ, వెలుతురు ఉండేది చవగ్గా దొరకడం అదృష్టమే అనుకో" పూజ ముగించి కాఫీ గ్లాసులతో వస్తూ అంది రచిత.

"రేపే నీ ఫస్ట్‌డే ఆఫీసులో. అది గుర్తుంచుకుని సర్దుళ్ళు త్వరగా ముగించు. చెన్నైలోలాగ కాదు. ఇక్కడ వర్క్ కల్చర్ డిఫరెంట్‌గా ఉంటుంది. నేను పొద్దున్నే వస్తాను. ఇద్దరం కలిసే వెళదాం....సరేనా?" కాఫీ గ్లాసు అందుకుంటూ చెప్పింది వసు.

"సరే.. సరే.."

ఒక్క గుక్కలో కాఫీ తాగేసి "రేపు మాత్రం బ్రూ కాఫీ ఇస్తే సరిపోదు. చిక్కటి ఫిల్టర్ కాఫీ కావాలి. త్వరగా ఇంటికెళ్ళి, ఆఫీసుకి వెళ్ళాలి. వస్తాను ఇవిగో తాళాలు" అంటూ ఒక చేతిలో ఇంటితాళాలు, మరో చేతిలో ఖాళీగ్లాసు పెట్టి హడావుడిగా వెళ్ళిపోయింది వసుధ.

సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్ చేసి ఉన్న ఆ బిల్డింగులో, నాలుగో ఫ్లోర్‌లోకి లిఫ్ట్ వచ్చి ఆగింది. లిఫ్ట్ డోర్ తెరుచుకుంటూనే, లోపలనుంచి బ్లాక్ సూట్ వేసుకున్న అందమైన యువకుడు కారిడార్‌లోకి అడుగుపెట్టాడు. అతని నడకలో వేగం, స్టైలు చూస్తుంటే, సమయాన్ని కొలిచే పెద్ద బిజినెస్ మాగ్నెట్ ఏమో అనిపించేలా ఉంది.

ఆఫీస్‌లోకి అడుగుపెడుతూనే, విష్ చేసిన వాళ్ళని మర్యాదగా పలకరిస్తూ అతని  కాబిన్ దగ్గరికి వచ్చాడు.

రచిత తన టేబుల్‌ని ఒక్కసారి పరికించిచూసింది. చాలా పేలవంగా, కార్పొరేట్ రంగంలానే పరమ బోరింగ్‌గా అనిపించింది.

"రేపట్నుంచీ, ఈ టేబుల్ రూపురేఖలు మార్చేయాలి.." అనుకుంటూ బ్యాగ్‌లో నుంచి చిన్న వినాయకుడి బొమ్మని బయటికి తీసింది. సెల్‌ఫోన్‌లో నార్త్‌పాయింట్ చూసి, తూర్పు దిశగా వినాయకుడి బొమ్మపెట్టి, భక్తిగా చేతులు జోడించింది. చుట్టూ ఉన్న కోలాహలం నుంచి ఒక్క క్షణం, తనువూ మనస్సూ విడివడినట్టు ఎంతో ప్రశాంతంగా మారిపోయిందామె వదనం. ప్రార్ధన చేస్తుందన్న గుర్తుగా ఎర్రని పెదవులు సన్నగా విడివడ్డాయి. మూసివున్న కనురెప్పల వంపు ఆమెకళ్ళు ఎంత విశాలంగా, అందంగా ఉంటాయో తెలియచెపుతున్నట్టున్నాయి.

రెండు క్షణాల తర్వాత కళ్ళు తెరిచి, నెత్తిమీద మూడు మొట్టికాయలు వేసుకుంది.

బ్రేకులు వేసినట్టు ఆగిపోయి, రచితవైపే చూస్తున్న అతను చిన్నగా నవ్వుకుంటూ తన కాబిన్‌లోకి వెళ్ళిపోయాడు.

"హలో! ఇది నీ పూజా మందిరం అనుకుంటున్నావా? వదిలేస్తే పార్లు గుంజీలు తీసి, పొర్లుదండాలు కూడా పెట్టేట్టున్నావే!" క్యూబికల్ వాల్ మీద చేతులు పెట్టి ముందుకు వంగుతూ అంది వసుధ.

"నువ్వెప్పుడు వచ్చావు?"

"ఆ.. కాఫీ కప్‌లో ఫిల్ చేసుకుని వస్తుంటే, నీ మొట్టికాయల ఘట్టం చూశా! బైదిబై మన బాస్ నిన్ను చూసి నవ్వాడు తెలుసా?" చిన్న గొంతుకతో అంది.

"నవ్వితే.. నవ్వనీ మూడు నిముషాలు ఏకాగ్రతతో దణ్ణం పెట్టుకుంటే, మా బాస్ నేను ఏది అడిగినా ఇచ్చేస్తాడు. ఎవరు చూస్తే మాత్రం నాకేంటి భయం.." అంది, వినాయకుడి బొమ్మ వైపు చూపించి నవ్వుతూ.

"హాయ్! వసూ..!"

పొడవుగా, చక్కటి ఇస్త్రీ బట్టలతో టక్ చేసి ఉన్న, అతను వచ్చి చనువుగా వసుధ భుజం తట్టాడు.

"న్యూ జాయినింగ్?" రచితని పాయింట్ చేస్తూ, అడిగాడు.

"యా! నా చైల్డ్‌హుడ్ ఫ్రెండ్ రచిత. ఇవ్వాళే ఫస్ట్‌డే ఫ్రెషర్ కాదు చెన్నై నుంచి వచ్చింది. నెట్‌వర్క్ టీం.."

"హాయ్!.. అయామ్ సాత్విక్. ఖర్మ కాలి వసూ టీంలో ఉన్నాను. మిమ్మల్ని మిస్ అయ్యాను .. ప్చ్.." అంటూ కరచాలనం కోసం చెయ్యిముందుకు చాపాడు.

రచిత నవ్వుతూ చేయందించింది.

"అంతా.. అతి వాగుడు.." సాత్విక్ వైపు చూసి ముద్దుగా విసుక్కుంది వసూ.

ఇద్దరు మనుషులు షూస్ చప్పుడు చేసుకుంటూ లాప్‌టాప్‌లు పట్టుకుని హడావిడిగా, ఇందాక సూట్ వేసుకున్న వ్యక్తి వెళ్ళిన క్యూబికల్‌లోకి పరిగెడుతూ వెళ్ళారు.

రచిత కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ ఉంది.

"ఇందాక, నేను బాస్ అని చెప్పానే, అతను మన పి.కె గ్రూప్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరు పి.కె గ్రూప్స్ చైర్మన్ హరిప్రసాద్‌గారి మేనల్లుడు అభినవ్. ఎప్పుడో ఒకసారి, అలా తళుక్కున మెరుపు మెరిసినట్టు వస్తూ ఉంటాడు" వసుధ చెప్పింది.

మహానగరంలో అడుగు స్థలం విలువ వేలు దాటి లక్షలకు దగ్గరగా ఉండే చోట, అత్యంత విశాలమైన ప్రాంగణంలో కట్టిన బిల్డింగ్ అది.

స్విమ్మింగ్‌పూల్ గట్టున ఛైర్‌లో విశ్రాంతిగా వెనక్కివాలి స్నేహితుడు మోహన్‌తో కబుర్లు చెబుతూ కూర్చున్నాడు హరిప్రసాద్.
"హాయ్.. హేరీ..."

హరిప్రసాద్ తలతిప్పి చూశాడు. అతని ముద్దుల భార్య గురుప్రీత్. హేరీ అని పిలిచేది ఆమె ఒక్కతే.

"భాయిజాన్ కూడా ఇక్కడే ఉన్నారా!" మోహన్ వైపు చూసి నవ్వింది. ఒకసారి సెల్‌లో టైం చూసుకుని,

"నేను బైటికి వెళుతున్నాను. ఐ విల్ బి బాక్ బై నైనో క్లాక్" హరిప్రసాద్ వైపు చూసి అంది.

గురుప్రీత్ వస్త్రధారణని ఒకసారి విచిత్రంగా తేరిపారజూశాడు. హరిప్రసాద్.

సాధారణ చేనేత చీరలో సాదాసీదాగా తయారైంది. ఎప్పుడూ దట్టించి ఉండే మేకప్ ఆనవాలు మచ్చుకైనా లేదు. చెవులకి చిన్న స్టడ్స్, మెళ్ళో సన్నని గొలుసు తప్ప మరే ఆభరణాలూ లేవు.

హరిప్రసాద్ బిజినెస్ పనుల మీద ఎక్కువగా తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో ఉండే సమయం చాలా తక్కువ. ఎప్పుడూ ఆధునిక దుస్తుల్లో కనిపించే, గురుప్రీత్ ఇలా తయారవడం ఆయనకి ఆశ్చర్యంగా ఉంది.

"ఏమిటంత ఆశ్చర్యం. నేను వెళుతున్నది ఒక సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌కి ఛీఫ్ గెస్టుగా!" అంది నవ్వుతూ.

"చూడరా! సిస్టర్ ఎంత తెలివైనదో. మనం కార్పొరేట్ రంగంలో దూసుకుపోతుంటే, మన కంపెనీని జనాల్లోకి తీసుకుని వెళుతూ ఉంది" అన్నాడు మోహన్ ప్రశంసాపూర్వకంగా.

"థాంక్యూ మోహన్ భయ్యా!" అని, వెనక్కి తిరిగి గ్లాస్‌డోర్ వద్ద వెయిట్ చేస్తున్న సెక్రటరీకి సైగ చేసి, హడావుడిగా వెళ్ళిపోయింది.

తర్వాత, ఐదునిముషాలకి, అభినవ్ వచ్చాడు.

"హలో అంకుల్" మోహన్ విష్ చేశాడు.

"రారా! నువ్వు వచ్చావంటే, ఏదో బిజినెస్ డిస్కషన్ అయివుంటుంది. అవునా?" అన్నాడాయన.

అభినవ్ చిన్నగా నవ్వాడు.

"నీతో బాటు చైతూ కూడా ఉన్నాడు కదూ!"

ఇక దాచిపెట్టడం వల్ల లాభం లేదని పకపకా నవ్వేశాడు. "అవునంకుల్ నాతోనే ఉన్నాడు. బయట మీ కారుని చూసి, లోపలికి రానన్నాడు."

"నాకు తెలియదా మీ యాక్టింగ్.." అని నవ్వుతూ, తిరిగి వైన్ గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు.

"మామయ్యా! స్టేట్ గవర్నమెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాంట్రాక్ట్ గురించి మినిస్టర్ సెక్రటరీ ఫోన్ చేశాడు" హరిప్రసాద్ పక్కన కూర్చుంటూ చెప్పాడు.

"అది మన సి.ఇ.ఒ రాజారావు చూస్తున్నాడుగా. నీకెందుకు ఫోన్ చేశాడు?" చిరాగ్గా అన్నాడు.

"కానీ, మామయ్యా! దాని గురించి చాలా గొడవలు జరుగుతున్నాయి. న్యూస్‌ఛానెల్స్, పేపర్స్ బాగా టార్గెట్ చేస్తున్నాయి. మనం వదిలేస్తే మంచిదేమో!" స్థిరంగా అన్నాడు.

"దీని గురించి నేను వేరే విధంగా ఆలోచించాను.. అభీ!"

అభినవ్‌కి ఆయన ఉద్దేశ్యం చూచాయగా అర్థమైంది.

"మీకు పొలిటికల్ ఇంటరెస్ట్ ఉంటే.. ఓ.కే కానీ, ఇది మార్గం కాదు. టెక్నాలజీ ఫీల్డ్‌లో మనం మరింత ఫోకస్ పెట్టాలనుకునే సమయంలో ఇలాంటివి తలనొప్పి వ్యవహారంగా మారచ్చు.."

హరిప్రసాద్ మౌనంగా ఉన్నాడు.

"పోనీ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ని మీటింగ్‌కి కాల్ చేద్దామా?" అన్నాడు ఆఖరి ప్రయత్నంగా.

హరిప్రసాద్ కనుబొమలు ముడిపడ్డాయి.

"ఇది సి.ఇ.ఒ డిసైడ్ చేయాల్సిన విషయం. దీనికి బోర్డ్‌మెంబర్స్ దాకా వెళ్ళనవసరం లేదు. ఛైర్మన్‌గా చెబుతున్నాను. లెట్ ద సి.ఇ.ఒ డూ హిజ్ జాబ్" గట్టిగా చెప్పాడు.

అభినవ్‌కి ఒళ్ళు మండిపోయింది. అతని ఆర్గ్యుమెంట్‌ని పూర్తిగా వినకపోవడం అతనికి చాలా బాధ కలిగించింది.

పిడికిలి బిగించి, ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని,

"ఓ.కే. వస్తాను మామయ్యా. బై అంకుల్.." అంటూ వడివడిగా బయటికి నడిచాడు.

"లోపల కండిషన్స్ ఎలా ఉన్నాయేంటి?" కారు విండోలోంచి చూస్తూ చిరాగ్గా మొహం ముడుచుకుని వస్తున్న అభీని అడిగాడు చైతన్య.

"నథింగ్ న్యూ.." ముభావంగా అన్నాడు.

"అంటే, మనవాళ్ళు న్యూగా అలోచించడానికి ఒప్పుకోవట్లేదన్నమాట. బార్‌కి వెళ్ళడానికి పర్‌ఫెక్ట్ సిట్యుయేషన్" అంటూ, అభీ కారులో కూర్చోగానే కారు స్టార్ట్ చేశాడు.

"బార్ కా?..నో!"

"ఇంట్లో తాగితే కరెక్ట్.. బార్‌లో తాగితే తప్పు.. కాదురా నీకు ఇష్టం లేకపోతే తాగకు. బార్‌కెళితే, కాస్త సోషలైజ్ అయినట్టు ఉంటుంది పద.." అంటూ బ్లూ కలర్ బెన్ట్‌లీ కారుని రోడ్డెక్కించాడు.

"అమ్మమ్మా! బయలుదేరదామా?"

ఆకుపచ్చరంగు చీర కట్టుకుని, మెడలో ఒంటిపేట ముత్యాలగొలుసు, జడలో పూలతో అచ్చ తెలుగింటి అమ్మాయిలా తయారైంది రచిత.

"నేనెప్పుడో తయారుగా ఉన్నాను.." అంటూ సోఫాలో నుంచి లేచింది అనసూయమ్మ.

"ఉండు. ఆటో పిలుచుకుని వస్తాను."

"వద్దు అమ్మలు. గుడి ఇక్కడేగా నడిచి వెళ్ళివద్దాం. ఆ మాత్రం అన్నా నడవకపోతే, కాళ్ళు పట్టుకుపోతాయి."

ఇద్దరూ కాలినడకనే, పక్కవీధిలో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడికి బయలుదేరారు.

శనివారం కాకపోవడంతో పెద్దగా జనాలు లేరు.

గజిబిజిగా ఉండే సిటీ వాతావరణానికి భిన్నంగా, ప్రశాంతంగా ఉంది ఆ ప్రదేశం.

గుడి వెనక వైపు స్వామివారి పూజకోసం, వేసిన తులసీవనం.. ఆ పక్కనే అరటి చెట్లు, ఎర్రగన్నేరు పొదలు. కళ్ళకు హాయిగా అనిపించేట్టు కనుచూపు మేర ఆకు పచ్చదనం.

"ఇంటికి దగ్గరలోనే ఉంది. రోజూ నీకు కాలక్షేపంగా ఉంటుంది వస్తే" అనసూయమ్మతో అంది.

అర్చన పూర్తయ్యాక, దొన్నెల్లో పెట్టి పులిహోర ప్రసాదం ఇచ్చారు. మసకబడుతున్న ఆకాశపటంలో ఎత్తుగా గీసినట్టున్న ధ్వజస్థంభాన్ని చూస్తూ మెట్లమీద కూర్చున్నారిద్దరూ.

చల్లటిగాలి... అంతకన్నా మించి, కాస్సేపు వేటి గురించీ పట్టించుకోవక్కర్లేదు అన్న నిశ్చింత తోడై అక్కడ నుంచి కదలబుద్ధి కాలేదు.

"అమ్మలూ! చీకటి పడుతుండే... బయలుదేరదామా?" అనసూయమ్మ మోకాళ్ళ మీద చేతులు వేసి చిన్నగా లేచింది.

**నాలుగడుగులు** వేశారో లేదో ఒకావిడ పలకరించింది.

"అనసూయమ్మగారూ.." అని.

"కొత్తచోట మనకి తెలిసినవాళ్ళెవరబ్బా" అంటూ చూసిందావిడ.

"నేనండి మంగమ్మని" భారీగా ఉన్న కాయంతో, పై వరుస పళ్ళన్నీ కనిపించేలా నవ్విందావిడ.

"దుర్గాపురంలో మీ వీధిలోనే ఉండేవాళ్ళం గుర్తుపట్టారా?"

కాస్త ఆనవాలు దొరికింది అనసూయమ్మకి.

"ఆఁ అవును.. గుర్తొచ్చింది."

"ఎందుకు గుర్తుండదూ అందరి విషయాల్లోనూ అతిగా కల్పించుకుంటుంది" మనసులోనే పళ్ళునూరింది రచిత.

"మన మహాలక్ష్మి కూతురేనా? బాగా మారిపోయింది" రచిత బుగ్గలు పుణుకుతూ అంది మంగమ్మ.

"మీరు కూడా బాగా మారిపోయారు."

బిగుతైన జాకెట్టు, బరువైన పట్టుచీర, ముడుతలు పడ్డ మెడకి టైట్‌గా అంటిపెట్టుకున్న బంగారు నగలూ చూస్తూ వ్యంగ్యంగా అంది.

"మెళ్ళో ఉన్న దండేనా? యింకేదైనా నగానట్రా చేయించావా?" అంది అనసూయమ్మ వైపు చూస్తూ.

"అది ఉద్యోగం చేస్తుంది. దానికి కావలసినవేవో అదే కొనుక్కుంటుంది. మధ్య నేను చేయించేది ఏముందీ?" జవాబిచ్చింది.

"అమ్మాయి పెళ్ళి చేయవా? అన్నట్టు నీ అల్లుడు కూడా యిక్కడే ఉంటాడటకదా! పిల్ల పెళ్ళి గురించి ఏమైనా పట్టించుకుంటాడా లేదా?"

ఆవిడ మాటలకి రచితకి భగ్గున మండిపోయింది. ఉబికి వస్తున్న కోపాన్ని పెదవి అంచున ఒత్తిపట్టి, "ఈ అమ్మమ్మకి అస్సలు బుద్ధిలేదు" విసుక్కుంటూ వెళ్ళి మెట్లమీద కూర్చుంది.

మసకవెలుతురు కూడా క్రమేపీ చిమ్మచీకట్లో కరిగిపోయింది. గుడి ఆవరణలో ఎల్రక్టిక్ దీపాలు వెలిగాయి.

మంగమ్మ కబుర్లు ఎంతకీ తెమల్చకపోవడంతో చెట్టుకింద చతికిలబడి వింటూ వుంది అనసూయమ్మ.

ఆమెతో పెట్టుకుంటే, ఉన్నచోటే పుట్టలు పెట్టేస్తాయని తెలుసేమో, ఆమె మొగుడూ, పిల్లలూ దేవుడికి దణ్ణం పెట్టుకుని ప్రసాదాలు తింటూ కూర్చున్నారు.

రచితకి విసుగొచ్చింది.

"ఇక మేము బయలుదేరతామండీ!" అని మంగమ్మకి చెప్పి, అనసూయమ్మని రెక్కపట్టుకుని పైకి లేపింది.

"ఇక్కడే ఉంటున్నారట కదమ్మాయ్! కాస్త అడ్రసూ, ఫోన్ నెంబరూ యివ్వు" మంగమ్మ అడుగుతుంటే వినబడనట్టే వుంది రచిత.

"అడుగుతుంటే వినబడ్డం లేదేమిటే ఫోన్ నెంబరు యివ్వు."

అనసూయమ్మ రెట్టించడంతో అయిష్టంగానే చెప్పింది. అప్పటికే, బాగా చీకటిపడటంతో, మెయిన్‌రోడ్ మీదుగా యింటివైపుకు నడిచారు.

❦❦❦

"బార్‌కి రారా.. అంటే పెద్ద శీలవంతుడిలా ఫోజు కొట్టావ్. అక్కడ చూశావా? ఎంతమంది అమ్మాయిలు బాయ్‌ఫ్రెండ్స్‌తో వచ్చారో" పకపకా నవ్వుతూ స్టీరింగ్ తిప్పుతున్నాడు చైతూ.

కారు లైట్ల వెలుతురులో ఫుట్‌పాత్‌మీద నడుస్తున్న ఓ అమ్మాయి చైతూ దృష్టిని ఆకర్షించింది.

బారాటి జడ ఆమె నడుము మీద త్రాచుపాములా అటూ యిటూ ఊగుతూ వుంది. "వావ్!" అప్రయత్నంగా అతని నోటినుంచి వచ్చిందామాట.

"ఒరేయ్ జాగ్రత్త! వద్దంటున్నా నాకూ పోయించావ్. పోలీసులు చూశారంటే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద బుక్ చేస్తారు" అభీ అన్నాడు.

"ఇక్కడ పోలీసులు లేరు. అయినా, మనం పడిపోయేంతలా తాగిలేము ఓ.కే.నా!"

కారు ఆ అమ్మాయికి కొద్దిదూరంలోకి వచ్చింది. కారులైట్ల వెలుతురులో మరింత ప్రకాశవంతంగా కనిపించిందామె శరీరం.

"బ్యూటిఫుల్."

ఆల్కహాల్ ప్రభావం. మత్తులో ఉన్న చైతన్యకి, డైరక్షన్‌మీద జడ్జిమెంట్ పూర్తిగా పోయింది.

రెప్పపాటులో ఫుట్‌పాత్ మీదకి ఎక్కింది కారు.

జరగబోయే ప్రమాదం పసిగట్టాడు అభినవ్.

"స్టాప్!" అని పెద్దగా అరుస్తూ, ఒక్క ఉదుటున సీట్‌బెల్ట్ తీసి, స్టీరింగ్ వీల్‌ని పక్కకి తిప్పాడు.

వెనక్కి తిరిగి చూసి, రచిత కెవ్వుమని అరిచింది.

చైతూ సకాలంలో బ్రేక్ వేయగలగడంతో ఒక్క సెకనులో జరగబోయిన ప్రమాదం కాస్తా తప్పిపోయింది.

వెనకాలగా వస్తున్న వాహనాలు కారుని తప్పించుకుని వెళ్ళే ప్రయత్నంలో హారన్స్ రొదగా వినిపిస్తున్నాయి.

"ఇడియట్ కళ్ళు నెత్తిన పెట్టుకున్నావా?" కోపంగా అరిచింది ఆమె.

"అయామ్ సారీ" చైతూ కారుదిగి చెప్పాడు.

రచితని చూస్తూ "యింతకుముందు ఎక్కడో చూశానే.." గుర్తుతెచ్చుకునే ప్రయత్నం చేశాడు అభీ. కానీ, ఆ పరిస్థితిలో అతని మెదడు సహకరించలేదు.

"సారీ అంటే సరిపోదు. మనుషుల లైఫ్. కాస్త కేర్‌ఫుల్‌గా వుండు" రచిత అరుస్తూనే వుంది.

"సారీ అన్నాను కదా మేడమ్!" దాదాపుగా మీదకి వచ్చాడు. రచిత చురుగ్గా చూసి, 'పద అమ్మమ్మా' అంటూ అనసూయమ్మ చేయి పట్టుకుని ముందుకు నడిచింది.

"సారీ అన్నాను కదా.. మాట్లాడరేం?" వెంబడిస్తూ అన్నాడు.

"స్టాప్ దట్ బ్లడీ హెల్ చైతూ.. పద టాక్సీలో వెళదాం" వెనకనుంచి చైతన్యని పట్టుకుని ఆపాడు అభినవ్.

"తాగుబోతుతో మాటలేంటి? త్వరగా పద" అనసూయమ్మ తొందర చేసింది.

గబగబా మలుపు తిరిగి వెళ్ళారు. యిద్దరూ కాలనీ గేటు దాటి, వాళ్ళు యింట్లోకి వెళ్ళడం చూశాక, వెనక్కి తిరిగాడు చైతన్య.

రెండురోజుల్లోనే రచిత తన క్యూబికల్ రూపురేఖలన్నీ మార్చివేసింది.

సాంప్రదాయపు డిజైన్లతో తయారైన టెర్రకోట పెన్ స్టాండ్‌లు, ఫ్లవర్‌వేజ్‌లు టేబుల్ మీదకి వచ్చాయి.

వాటికి సరిపోయే డిజైన్లతో చిన్న హాంగింగ్ షెల్ఫ్, క్యూబికల్ గ్లాస్‌కి వేలాడదీయబడింది. అందులో వినాయకుడి బొమ్మ, దానిచుట్టూ తెల్లని పూసల దండతో చేసిన గొలుసు తోరణంలా అమర్చబడి వుంది.

కాళ్ళకింద పూల డిజైన్ ఉన్న మ్యాట్.. చిన్న చిన్న వస్తువులు పెట్టుకోవడానికి అందమైన షెల్ఫ్. దాని వెనుక రచిత, అనసూయమ్మల ఫోటో అందంగా ఫ్రేమ్ చేయబడి వుంది. ఆ ఫోటోకి కుడివైపుగా చివరన, "అయామ్ ద ఒన్" అన్న స్టిక్కర్.

అటువైపుగా వెళ్ళే ప్రతి ఒక్కరూ, ఆగి విచిత్రంగా రచిత వైపు, ఆమె క్యూబికల్ వైపు చూసి, వెళ్ళసాగారు.

మొత్తం ఆకుపచ్చగా ఉన్న లాన్‌లో, పూసిన ఒకే ఒక్క గడ్డిపువ్వులా, తెల్లటి మల్లెల మధ్యలో ఎర్రటి కనకాంబరంలా ప్రత్యేకంగా వుంది.

సాయంకాలం ఐదుగంటలవుతూనే, వసుధ రచిత క్యూబికల్ దగ్గరకి వచ్చింది.

"ఇప్పుడైతే ఇది అచ్చం నీ డ్రాయింగ్ రూములానే ఉంది" అంది వసుధ నవ్వుతూ.

"నాకు నచ్చని పరిసరాల్లో నేను క్షణం కూడా ఉండలేను. అందుకే యిలా మార్చేశా."

"డ్రాయింగ్ రూంలా వుందని యిక్కడే వుండిపోయేవు పద వెళదాం" చెయిర్‌లో నుంచి లేచి హాండ్‌బ్యాగ్ తగిలించుకుని ముందుకు వచ్చింది. రెండడుగులు వేసి, ఒక అద్భుతాన్ని చూసినట్టు ఆగిపోయారిద్దరూ. అణువణువూ శ్రద్ధగా తీర్చిదిద్ది, పాలిష్ పెట్టిన పాలరాతి శిల్పంలా వున్న ముద్దుగుమ్మ సడన్‌గా ఎంట్రీ యిచ్చింది.

మోకాళ్ళకి కాస్తపైకి ఉన్న స్కర్టు, స్ట్రెయిట్‌గా, సిల్కీగా భుజాలదాకా వదిలేసిన జుట్టు, నాజూకైన చేతివేళ్ళు, ఎత్తైన హీల్స్. టాప్ టు బాటమ్ అత్యంత ఆధునికంగా తయారైవుంది. కాలిగోళ్ళ దగ్గర్నుంచీ పలువరుసదాకా శ్రద్ధగా పోషణ చేయడంవల్ల మిలమిలలాడుతూ వున్నాయి. ఆమె హైహీల్స్ టకటకలాడించుకుంటూ నేరుగా అభీ రూములోకి వెళ్ళింది.

"అబ్బా.. ఆమె కాళ్ళు చూడు ఎంతందంగా వున్నాయో! నా మోకాళ్ళ నిండా నల్లటి మచ్చలు. చిన్నప్పుడు ఆటల్లో పడి దెబ్బలు తగిలించుకున్నాను. అదికూడా నీవల్లే" అంది వసుధ మూతివిరుస్తూ.

"నీ మొహం.. బ్యూటీపార్లర్‌లకీ, కాస్మొటిక్ సెంటర్లకీ డబ్బుపోస్తే, నీ మోకాళ్ళేం ఖర్మ అరికాళ్ళు కూడా బంగారు రంగులోకి మార్చేస్తారు. కాని, కోట్లు యిస్తే మాత్రం ఇలా మచ్చల వెనుక ఉండే జ్ఞాపకాలు తేగలుగుతారా ఏంటి?"

"పోవే నీదంతా మెట్టవేదాంతం."

"అవును. మనకు నచ్చిన ప్రపంచం మనం ఏర్పాటు చేసుకోవాలి. లేదా మనకున్నదాన్నే ప్రేమించాలి."

"ఒక్క నిముషం రెస్ట్‌రూంకి వెళ్ళొస్తాను."

లాప్‌టాప్ బ్యాగ్ రచిత చేతికిచ్చి టాయిలెట్స్ వైపుకి నడిచింది.

"పావుగంట పైనే చేశావ్. త్వరగా రా!" బయటకి వస్తున్న వసుధతో అంది.

"ఇప్పుడు యింటికి వెళ్ళి మాత్రం మనం మొగుడికి వండిపెట్టాలా? పిల్లలకు హోంవర్కులు చేయించాలా? ఎందుకంత కంగారు?"

ఇద్దరూ లిఫ్ట్‌దాకా వచ్చారు.

బటన్ నొక్కి రెండు నిముషాలు దాటినా లిఫ్ట్ రాలేదు.

"మెట్లు దిగి వెళదాం" రచిత అంది.

"అమ్మో! నాలుగు ఫ్లోర్‌లు"

"మరీ ముసలమ్మలా మాట్లాడకు. నన్నడిగితే రోజూ లిఫ్ట్ బాన్ చేస్తే, ఫిగర్‌కూడా కంట్రోల్‌లో వుంటుంది."

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మెట్లు దిగుతున్నారు.

రెండో ఫ్లోరు మిడ్‌లాండింగ్ దగ్గర అనుకోని దృశ్యం ఒకటివారి కంటబడింది.

అభినవ్ ఇందాక చూసిన అమ్మాయి అతి దగ్గరగా వున్నారు. ఆ అమ్మాయి అతని భుజాల మీద చేయివేసి పూర్తిగా వాలిపోయి వుంది. ఇద్దరి పెదవులూ దగ్గరయ్యాయి. ముద్దుని ఆస్వాదిస్తున్న గుర్తుగా ఆమె కళ్ళు అరమోడ్పులయ్యాయి. వాళ్ళు పరిసరాల్ని పరికించే స్థితిలో లేరు.

అది చూసి ముందుగా, రచిత నవ్వుకుంది. ఆ తర్వాత సిగ్గుపడింది. చప్పున తలదించుకుని వాళ్ళ ఉనికినే గమనించనట్టు వచ్చేశారు యిద్దరూ.

"ఆ అమ్మాయి సియానా, అభినవ్ మరదలు, గర్ల్‌ఫ్రెండ్ అండ్ ఫియాన్సీ కూడా. మన పి.కె గ్రూప్స్ ఛైర్మన్ హరిప్రసాద్ కూతురు" వసుధ చెప్పింది.

"అదేమిటి సియానా. నార్త్ యిండియన్ పేరు?"

"వాళ్ళ మదర్ పంజాబీలే"

"ఓ.. పెద్ద పెద్ద బంగ్లాలు, కార్లు ఉండగా, స్టెయిర్ కేస్ మధ్యలో శృంగారం ఏమిటో?"

"ముద్దుపెట్టుకోవాలంటే మూడ్ ఉంటే చాలనుకున్నారేమో"

ఇద్దరూ పకపకా నవ్వారు.

వెనకా పకపకా నవ్వారు. వెనకాల నుంచి అడుగుల చప్పుడు వినబడడంతో, ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు.

వసుధ పక్కకి తప్పుకుని అభినవ్, సియానాలకి దారి యిచ్చింది.

"ఆ హైహీల్సుతో ఒకసారి అతని కాళ్ళని తొక్కితే, ఏమవుతాడో కదా!" రచిత అంది.

మళ్ళీ పకపకా నవ్వుకున్నారు.

"అభీ.. ఇలారా!" లాప్‌టాప్‌లో నుంచి తలపైకెత్తుతూ పిలిచాడు హరిప్రసాద్.

సియానా, అభీవైపు ఒకసారి చూసి, చిన్నగా నవ్వుకుంటూ మేడమీదకి వెళ్ళిపోయింది.

హరిప్రసాద్ మొహం చాలా సీరియస్‌గా వుంది.

"ముఖ్యమైన విషయమే అయివుంటుంది" అనుకున్నాడు అభీ.

"రాజారావ్ ప్రపోజల్స్‌ని నువ్వు ఒప్పుకోలేదట. నిజమేనా?"

"అవును" స్థిరంగా జవాబిచ్చాడు.

"చూడు అభీ.. మనం ప్రతి చిన్న విషయాల్లో వేలుబెట్టి చూసుకునే పరిస్థితిలో లేము. అట్లా, ప్రతీదీ నేనే కలిగించుకుని చేయాలంటే యిన్ని కంపెనీలను ఎలా మేనేజ్ చేయగలిగేవాడిని అనుకుంటున్నావు? రాజారావ్ నిజాయితీపరుడు. మనకి ప్రాఫిట్స్ వచ్చేలా చేయడమే అతనిపని. అది జరగనప్పుడు, అతన్నీ జాబ్‌లో నుంచి పీకేసి ఇంకో సమర్ధుణ్ణి పెట్టుకుంటాం. ప్రతిదానిలో నువ్వు అనవసరంగా కలుగజేసుకోకు"

"పోనీ, ఆ రాజారావ్ జాబ్ నాకివ్వండి. ఆ డెసిషన్స్ ఏవో నేనే తీసుకుంటాను" చిరాకు నిండిన స్వరంతో అన్నాడు. హరిప్రసాద్ చురుగ్గా చూశాడు.

"నిన్ను అంతకన్నా ఎత్తులోనే కూర్చోబెట్టాలనుకుంటున్నాను అభీ!" కోపంగా అన్నాడాయన.

"నాలో చాలా ఎనర్జీ వుంది మామయ్యా! నా తెలివితేటల్ని ఉపయోగించాలనుకుంటున్నాను. కంపెనీ బోర్డు మీటింగుల్లో ఓటింగ్‌కి, ప్రాఫిట్స్ లెక్కబెట్టుకోవడానికి మాత్రమే పరిమితమవ్వాలనుకోవడం లేదు. నాకు నా అయిడియాలతో, నా డెసిషన్స్‌తో ఏదైనా సాధించాలని ఉంది."

"ప్లీజ్ అభీ! ఇక డిస్కషన్ పెంచకు.. ఈసారికి నేను చెప్పినట్టు విను"

"మీకు రాజారావ్ మీద ఉన్న నమ్మకం నామీద లేదని మీరు చెప్పకపోయినా నేను అర్థం చేసుకోగలను.."

గుర్‌ప్రీత్ అక్కడే నిలబడి వీరి సంభాషణ అంతా వింటూవుంది. వాగ్వాదం ముదరకుండా, మధ్యలో కల్పించుకుని. "డిన్నర్ టైం అయ్యింది చలో!" అంటూ హరిప్రసాద్ చేయిపట్టుకుని చనువుగా పైకి లేపింది.

"కమాన్.. అభీ" అంటూ డైనింగ్ హాల్ వైపుకి దారితీసింది. అభినవ్ మాట్లాడకుండా ఆమెని అనుసరించాడు.

ఓక్ ఉడ్‌తో చేసిన పొడవాటి, ఖరీదైన డైనింగ్ టేబుల్ మీద, ఎంబ్రాయిడరీ చేసి ఉన్న తెల్లని టేబుల్ క్లాత్ పరిచివుంది.

ఖరీదైన సిల్వర్ డైనింగ్ సెట్‌లో వండిన పదార్థాలు, యిద్దరు సర్వెంట్స్ వడ్డన చేస్తున్నారు.

వాళ్ళకి తెల్లని యూనిఫామ్స్, తలమీద తెల్లని టోపీలు ఉన్నాయి. వాటిమీద ఒక్క మరక కనిపించినా, సిల్వర్ సెట్ తళతళలాడకపోయినా గుర్‌ప్రీత్ వూరుకోదు.

సియానా ఫ్రెష్ అయి వచ్చి అభీకి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

అభినవ్‌కి మనసంతా చికాకుగా వుంది. ఆకలి వేయలేదు.

పదిహేడవ ఏట ఈ యింట్లో అడుగుపెట్టాడు అభినవ్. మధ్యలో MBA చేయడానికి లండన్ వెళ్ళినప్పుడు వారం, పదిరోజులు ఎటైనా వెళ్ళినా తల్లిని చూసిరావడానికి తప్పిస్తే, ఈ యింట్లోనే వున్నాడు.

"వయసూ, మనసూ ఎదగనంతకాలం ఏమీ తెలియదు. కానీ, ఒక్కసారి రెక్కలు వచ్చాయనిపిస్తే స్వేచ్ఛ కావాలనిపిస్తుంది. బందీగా ఉన్నామని అర్థమైతే, బయటపడి పారిపోవాలనిపిస్తుంది." అభీ మనసులో ఆలోచనలు పరిపరివిధాలుగా సాగుతున్నాయి.

సర్వ్ చేసే అతను వచ్చి రెండు పుల్కాలు ప్లేటులో వడ్డించాడు. అవి తింటుండగా అతనికి సడన్‌గా అనిపించింది.

రోజూ వడ్డించినవే తింటున్నానని. తనకు కావలసినవి యిప్పటివరకూ ఈ యింట్లో అడిగి వండించుకోలేదని.

"చేతినిండా డబ్బు వుంటుంది, కావలసిన సౌకర్యాలేవైనా క్షణంలో అమరిపోతాయి. కానీ. ఈ యింట్లో ఒకరకమైన బానిసమనస్తత్వానికి అలవాటుపడిపోయానా?" ఆలోచించాడు.

"అభీ! సరిగ్గా తిను" గుర్‌ప్రీత్ కావాలనే పలకరించింది.

అభినవ్ పరధ్యానంగా వుండడానికి కారణం తనకి మాత్రమే తెలుసుననుకుని సియానా చిలిపిగా నవ్వింది.

"గణేశ్ చతుర్థికి అమ్మని యిక్కడికే తీసుకురా.. అభీ! ఆప్.. భీ బోలియేనా..." అంటూ హరిప్రసాద్ వైపు తిరిగి అంది. సీరియస్‌గా తింటూ ఉన్న హరిప్రసాద్, గుర్‌ప్రీత్ డైలాగ్‌లో ఆంతర్యం అర్థమైనట్టుగా తలవూపాడు.

"మోహన్ అంకుల్ వాళ్ళని కూడా పండక్కి యిక్కడికే రమ్మన్నాను. నువ్వు కూడా అమ్మని తీసుకుని రా" చెప్పాడు.

ఇదంతా మామూలుగా చేయడానికి ప్రయత్నం అని అర్థమైంది అభీకి.

"అమ్మని అడిగి చెబుతాను, మామయ్యా" ఏ భావమూ బయటపడకుండా అన్నాడు.

గుర్‌ప్రీత్ సంతృప్తిగా తలాడించింది.

**"అభీ! అంటూ** చొరవగా డోర్ తీసుకుని లోపలికి వచ్చింది సియానా. టైం రాత్రి పదిన్నర గంటలు దాటింది.

అభీ రూంలో ఏ.సి ఆపేసి వుంది. కిటికీ తలుపులు తెరిచివున్నాయి. లాప్‌టాప్ ఒడిలో పెట్టుకుని, రాకింగ్ చెయిర్‌లో కూర్చుని వున్నాడు. చూపు స్క్రీన్‌మీదే వున్నా, మనసు మాత్రం అక్కడ లేదు.

"నాకు తెలుసు. నీకు నిద్రపట్టదని.." మూతిని సున్నాలా చుడుతూ అతని దగ్గరకు వచ్చి నిలబడింది.

వైట్ కలర్ నైట్‌గౌన్‌లో విరబూసిన మల్లెపూవులా వుందామె. కాబోయే భర్త, ఎవరూ లేని ఏకాంతం. సందెవేళలో పెట్టుకున్న గాఢమైన ముద్దు గుర్తొచ్చి తమకంగా, అతని చేయిపట్టి లాగింది. "ప్లీజ్ సియా! నన్ను కాసేపు ఒంటరిగా వదిలెయ్!" ఆమె చేతిపట్టుని విడిపించుకుంటూ అన్నాడు.

"అభీ.. ఆర్యూ ఓ.కే!" ఎర్రగా ఉన్న అతని కళ్ళను చూసి ఆందోళనగా అడిగింది.

"అయాం సారీ.. నువ్వెళ్ళి పడుకో" నెమ్మదిగా అన్నాడు.

సియానా మౌనంగా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

విజయవాడ నగరం. తెల్లవారుఝామున నాలుగుగంటలకి, బ్లాక్ కలర్ బెంజికారు వచ్చి ఓ భవంతి ముందు ఆగింది.

కారు చప్పుడుకి కునికిపాట్లు పడుతున్న వాచ్‌మెన్ గబుక్కున స్టూలు మీద నుంచి లేచి నిల్చున్నాడు.

కారులో ఉన్న అభినవ్‌ని చూసి "చిన్నయ్యగారూ.." అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి తలుపు తీశాడు.

కారు నేరుగా పోర్టికో ముందు ఆగింది.

కాలింగ్ బెల్ నొక్కకుండా నెమ్మదిగా తలుపుతట్టాడు. ఆ ఇంట్లోనే ముప్పై సంవత్సరాలకు పైగా నమ్మకంగా పనిచేస్తున్న నౌకరు, పెంచలయ్య తలుపు తీశాడు.

"చిన్నయ్య వచ్చారు.. అమ్మగారిని పిలవవే.." పక్కనున్న భార్యతో అన్నాడు.

"వద్దు.. రమణమ్మ.. కాసిని కాఫీ యివ్వు చాలు."

రమణమ్మ వంటగదిలోకి వెళ్ళింది.

షూస్, సాక్సు తీసేసి సోఫాలో కూర్చున్నాడు.

కాఫీ తాగి, అక్కడే పడుకుని నిద్రపోయాడు.

ప్రొద్దుటే నిద్రలేచి, హాల్లోకి వచ్చిన శకుంతలాదేవి సోఫాలో పడుకుని వున్న అభీని చూసి ఆశ్చర్యపోయింది.

రాత్రి అంతా డ్రైవ్ చేసి, అలసటగా నిద్రపోతున్నట్టుంది అతని ముఖం. కొడుక్కి నిద్రాభంగం కాకుండా, నిశ్శబ్దంగా పనులు ముగించుకుని అభీకి ఎదురుగ్గా ఉన్న సోఫాలో కూర్చుంది.

"చెప్పాపెట్టకుండా ఎందుకు వచ్చాడో?"

హఠాత్తుగా, ఫోన్ చేయకుండా రావడం అభీకి యిది మొదటిసారేం కాదు. మేనమామ యింటికి, సిటీకి పంపించిన కొత్తలో గుబులు పుట్టుకొచ్చినప్పుడల్లా, యిలాగే చెప్పాపెట్టకుండా వస్తూ వుండేవాడు. ఎప్పుడైనా మనసు బాగా లేదంటేనే యిలా చేస్తాడు. "అమ్మా! ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?"

కళ్ళు తెరుస్తూనే, ఎదురుగా సోఫాలో కూర్చుని కనిపించిన శకుంతలతో అన్నాడు.

"ఏం లేదు నువ్వు లేచి మొహం కడుక్కో. టిఫిన్ తిందువుగాని."

"అమ్మా!"

సోఫాలో నుంచి లేవబోయినదల్లా ఒక్క క్షణం ఆగింది.

"ఇవాళ నాకు యిడ్లీలు తినాలని వుంది"

"వీడేంటి, యివాళ కొత్తగా మాట్లాడుతున్నాడు?" అనుకుని శకుంతల ఆశ్చర్యపోయింది.

అభీ ఫ్రెష్ అయ్యి వచ్చేసరికి డైనింగ్‌టేబుల్ దగ్గర కూర్చుని వుంది.

మామూలుగా అతను ఎప్పుడు వచ్చినా రెండు రోజులకంటే వుండడు. అందుకనే, యింట్లో ఎంతమంది పనివాళ్ళున్నా తనే స్వయంగా వడ్డిస్తుంది. వెండి కంచంలో వేడిగా యిడ్లీలు, కొబ్బరిపచ్చడి వేసి అభీ ముందు పెట్టింది.

అభి ఒక్క క్షణం యిడ్లీప్లేటు వైపు, శకుంతలవైపు మార్చి చూశాడు.

"అమ్మా! నువ్వూ సిటీకి వచ్చెయ్యకూడదూ?"

"వినాయక చవితికి రమ్మని నిన్ననే మామయ్య ఫోన్ చేసి చెప్పాడు. ఈసారి వచ్చినప్పుడు పదిరోజులు వుంటాను సరేనా!"

అభినవ్ మాట్లాడకుండా యిడ్లీలు తినసాగాడు.

కాస్సేపాగి "అలాకాదు హైదరాబాదులో మనమే ఒక యిల్లు తీసుకుని ఎందుకు వుండకూడదు?"

"నేనక్కడికి వస్తే యిక్కడ పొలాలు, తోటలూ ఎవరు చూసుకుంటారు?"

అభి నవ్వాడు.

."పి.కె గ్రూప్‌కి చాలా కంపెనీలు వున్నాయి. అవన్నీ మేనేజ్ చేసుకుంటుండగా లేనిది, పొలాలూ, తోటలు చూసుకోలేమా అమ్మా.."

శకుంతల మాట్లాడలేదు.

తినడం, ముగించి వాష్‌బేసిన్ దగ్గరికి వెళ్ళాడు అభి.

"ఒక్కటడుగుతాను చెప్పు. ఇన్నాళ్ళూ అంటే సరే ఎలాగో గడిచిపోయింది. ఇకమీదైనా మన వ్యవహారాలు మనమే చూసుకుంటే బావుంటుందనుకుంటున్నాను." చేతులు తుడుచుకుంటూ అన్నాడు.

"ఏమిటి నువ్వనేది?"

"పి.కె గ్రూప్‌లో మనవాటా షేర్స్ ఉన్నాయిగా. మనం కూడా వేరే మెంబర్స్‌లాగా యిండివిడ్యువల్‌గా ఉందాం అంటున్నాను. మామయ్యకి చెంచాగిరి చేయవలసిన అవసరం మనకు లేదు. మనల్ని వాడుకుని ఆయన ఛైర్మన్ పదవి దక్కించుకుంటున్నాడు. డెసిషన్స్ అన్నీ ఆయనవే."

"అందులో తప్పేముందీ?"

"అవన్నీ నీకెలా అర్థం అవుతాయి? నువ్వే నా పైన స్వతంత్రంగా వ్యవహరిస్తే కదా తెలిసేది? నువ్వే సమర్ధవంతంగా అన్నీ చూసుకుని వుండగలిగితే యిప్పుడీ సమస్య వచ్చేదేకాదు. ఇప్పటికైనా నీ పేరుతో ఉన్న షేర్స్ నాకు ట్రాన్స్‌ఫర్ చెయ్యి. లేదా బోర్డుమెంబర్స్ మీటింగ్స్‌కి అటెండయ్యి విషయాలు తెలుసుకో" చిరాకుపడుతూ అన్నాడు.

"అభీ స్వతంత్రంగా ఎదగాలనుకుంటున్నాడు." ఆ విషయం శకుంతలకి అర్థం అయ్యింది. షేర్స్ ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఆమెకి ఎటువంటి అభ్యంతరాలూ లేవు. ఉంటున్న భవంతి, తోటలూ చాలు. ఆమె జీవితం సుఖంగా గడిచిపోవడానికి.

కానీ, యిప్పుడీ పని చేస్తే హరిప్రసాద్‌కి ఖచ్చితంగా కోపం వస్తుంది. ఆయనకి ఇష్టం లేని పని శకుంతల చేయలేదు.

ప్రస్తుతం అదే ఆమెను కలవరపెడుతున్న విషయం.

బాగా ఆలోచించి, "ఏ విషయం మామయ్యతో చర్చించాక నిర్ణయించుకుందాం" చెప్పింది.

"మామయ్య.. మామయ్యా.. ప్రతిదానికీ ఆయనేనా? ఆయన లేకుండా ఏ పనులు జరగవా? నిర్ణయాలు తీసుకోరా?" కోపంగా అరిచాడు.

అభీ గొంతు పెంచి మాట్లాడటంతో శకుంతల వెంటనే పెంచలయ్యవైపు చూసింది.

విషయం అర్ధమైందన్నట్టుగా పెంచలయ్య మిగతా నౌకర్లందరినీ బయటికి పంపి, తలుపు దగ్గరగా వేసి కాపలాగా నిలబడ్డాడు.

అప్పుడు, శకుంతలాదేవి గొంతు విప్పింది "అభీ.. నాన్న చనిపోయాక ఎంతమంది మన వాటా షేర్సే అమ్మమని వత్తిడి తెచ్చారో తెలుసా? మామయ్య మనకి అండగా నిలబడడం వల్లే నేను ధైర్యంగా వున్నాను. పదిహేను సంవత్సరాల క్రితం పి.కె గ్రూప్స్ ఎలా ఉండేదో యిప్పుడు ఎంతగా ఎదిగిపోయిందో చూశావా? ఆ రోజే మనం బయటికి వచ్చి వుంటే, యివాళ పి.కె గ్రూప్స్ ఓనర్స్ అని గర్వంగా చెప్పుకోగలిగేవాళ్ళమ్మా?"

"ఇవేమీ నేను కాదనడం లేదు. కానీ, ఈ ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్ చాలా సఫకేటింగ్ వుంటుంది. ఆ స్లేవరీ నావల్ల కాదు. నేను అంత మంచివాడిని కాదు. " అనేసి కోపంగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

శకుంతలాదేవి విచారంలో మునిగిపోయింది. ఎటూ తేల్చుకోవడానికి ఆమెకు ధైర్యం చాలలేదు.

మధ్యాహ్నం యిద్దరూ భోజనాలు చేయలేదు.

మూడు గంటల ప్రాంతంలో అభి వచ్చి టిఫెన్ తిని, శకుంతలతో మామూలుగా మాట్లాడేవరకు ఆమె మనసు మనసులో లేదు.

సాయంకాలం అభి తిరిగి హైదరాబాదు బయలుదేరాడు.

"ఉడుకు రక్తం, మాట తేడాకి మనసు కష్టపడి వుంటుంది. తొందరలోనే అన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి" అనుకుంది శకుంతల.

అలాగే జరగాలని కోరుకుంది కూడా.

"ఇంకెన్ని వినాయకుళ్ళని చూడాలి? ప్రతిచోట గుంజీలు తీసి నాకు కాళ్ళు పట్టుకునిపోతున్నాయి."

"ష్.. ఇది ఏడవది. ఇంకో రెండు వినాయకుళ్ళని చూసి వెళ్ళిపోదాం" కళ్ళు మూసుకుని దండం పెట్టుకుంటూ అంది.

"అమ్మా.. రచితా.."

మగ గొంతుక పిలుపు వినబడడంతో వెనక్కి తిరిగి చూసింది. సాల్ట్ అండ్ పెప్పర్ స్టైల్లో క్రాఫు, పాంటులోకి టక్ చేసిన షర్టు ... యాభైయ్యేళ్ళు పై ఉంటుందతని వయసు.

అతని చేతిని పట్టుకున్న ఏడేళ్ళ పాపపై పడింది రచిత దృష్టి.

వెంటనే మొహం చిట్లించుకుని, వెనక్కు తిరిగింది.

"పదవే, వెళదాం..." ప్రసాదం క్యూలో నిలబడ్డ వసుధని హడావుడిగా లాక్కొచ్చింది.

"ఇంకా యిద్దరు వినాయకుళ్ళని చూడాలన్నావుగా ఆ మూల తిరిగితే మూడు పందిళ్ళు వున్నాయి." చెబుతున్నా వినిపించుకోకుండా బరబరా లాక్కెళ్ళి స్కూటీ స్టార్ట్ చేసింది.

వసుధకి జవాబు చెప్పలేదు.

"ఎవరు నాన్నా ఆ ఆంటీ..?" చేతిని లాగుతూ అడిగిందా పాప, ఆయన్ని.

అతనూ జవాబివ్వలేదు.

"సార్.. మీ కోసం బెంగుళూరు నుంచి 'షెరోనా టెక్' వాళ్ళు వచ్చారు. మాట్లాడాలట. పంపించమంటారా?"

అభినవ్ పియ్యే వచ్చి చెప్పాడు.

"ఓ.. యా.. ష్యూర్... పంపించండి"

ఇద్దరు సాఫ్ట్‌వేర్ యింజనీర్లు లోపలికి వచ్చారు. వాళ్ళు లోగడ ఒకసారి అభినవ్‌ని కలిశారు కూడా. కొత్తగా డెవలప్ చేస్తున్న టెక్నాలజీకి వారికి డబ్బుసాయం కావాలి.

ఒక విధంగా చెప్పాలంటే "షెరోనా" స్టార్టప్ కంపెనీకి ఫైనాన్షియల్‌గా పి.కె గ్రూప్స్ అండదండలు కావాలి. దానికి బదులుగా వాళ్ళు "షెరోనా" డెవలప్ చేసిన టెక్నాలజీని అమ్మినప్పుడు లాభాలు షేర్ చేసుకుంటారు. లేదా, తిరిగి పి.కె గ్రూప్స్‌లోనే మెర్జ్ చేసి, తమకి రావలసిన వాటా తీసుకుంటారు.

ఇందువల్ల యిరువర్గాలకీ లాభమే.

అభీకి కూడా ఈ ప్రపోజల్ నచ్చింది. వాళ్ళు యిచ్చిన ప్రజెంటేషన్‌ని మార్కెట్ ఎక్స్‌పర్ట్స్‌కి చూపించి, నిర్ణయం తీసుకున్నాడు కూడా. ఇక, చివరగా మిగిలింది హరిప్రసాద్‌తో మాట్లాడడమే.

"మీకు ఏ విషయం టూ డేస్‌లో యిన్‌ఫర్మ్ చేస్తాము. అన్నీ. ఓ.కే. అయ్యాక టర్మ్స్ అండ్ కండిషన్స్ రాసుకోవచ్చు." చెప్పాడు అభి. వచ్చినవాళ్ళిదరూ షేక్‌హ్యాండ్ యిచ్చి వెళ్ళిపోయారు.

"మన సాఫ్ట్‌వేర్ కంపెనీలోనే యిటువంటి టెక్నాలజీని డెవలప్ చెయ్యొచ్చుగా, మనం యిన్వెస్ట్ చేసి, మళ్ళా మనమే కొని వాళ్ళకి లాభాలు చేకూర్చడం దేనికి?" హరిప్రసాద్ అన్నాడు.

"దీనికి చాలా పెద్ద మార్కెట్ వస్తుంది, మామయ్యా. ఇంత మంచి అయిడియా వుంటే, వాళ్ళు మన దగ్గర జీతానికి ఎందుకు పని చేస్తారు. వాళ్ళ దగ్గర అయిడియా వుంది, స్కిల్ వుంది. వానికి తగ్గట్టుగా లాభాలు ఆశిస్తారు. విన్ - విన్ సిట్యుయేషన్. పాతపద్ధతులు ఈ కాలంతో వర్కవుట్ కావు.."

హరిప్రసాద్ ఈ మాటకి ఒప్పుకోలేదు.

"మన సాఫ్ట్‌వేర్ రిసెర్చి వింగ్ వుంది కదా. ఇలాంటి ప్రయోగాలు మనకి అవసరం లేదు" ఖరాఖండిగా చెప్పాడు. ఊహించిన పరిణామమే కావడంతో అభీ పెద్దగా డిసప్పాయింట్ కాలేదు. కానీ, ఈసారి ఎలాగైనా తన మాట నెగ్గించుకోవాలనే పంతం బయలుదేరింది అతనితో.

అందుకే ఈసారి హరిప్రసాద్‌కి చెప్పకుండా ఒకపని చేయాలని నిర్ణయించుకున్నాడు.

"ఏవండీ.. కాఫీ తీసుకుంటారాండీ..?"

లోపలికి అడుగుపెడుతూనే, వినిపించిన కొత్తపలకరింపుకి ఆశ్చర్యపోయాడు అభి.

చీరకట్టుతో నడవడానికి యిబ్బంది పడుతూ, కష్టం మీద బాలెన్స్ చేసుకుంటూ వుంది సియూనా.

అభీ అయోమయంగా చూడడంతో, రెండు చేతులూ నోటికి అడ్డం పెట్టుకుని పకపకా నవ్వేసింది.

లూజుగా వేసిన హెయిర్ బ్యాండ్ జారిపోయి, జుట్టు అందంగా భుజాల చుట్టూ పరుచుకుంది.

చికాకులన్నీ మర్చిపోయి, హాయిగా నవ్వేశాడు అభి.

"ఏమిటీ వేషం?"

"అత్తయ్య అడిగింది చీరకట్టుకోమని. అందుకే కట్టుకున్నాను. జస్ట్ నీకు చూపించి ఛేంజ్ చేసుకుందామని వెయిట్ చేస్తున్నాను. హౌ ఈజ్ యిట్?"

సమాధానంగా అతను నవ్వాడు.

ఆ నవ్వుతో అర్థం తెలిసినట్టుగా, మూతి విరిచి, చీరపైకి ఎత్తిపట్టుకుని గెంతుతూ తన రూంలోకి వెళ్ళింది.

★★★

"త్వరగా వీళ్ళిద్దరికీ పెళ్ళి చేసేయాలి" అభినవ్ విజయవాడ వచ్చినప్పుడు మాట్లాడిన మాటలు గుర్తొచ్చి కలవరపడింది శకుంతల.

రాత్రి పడుకోబోయే ముందు అభి గదిలోకి వచ్చింది శకుంతల. అతను యింకా పనిచేసుకుంటూ ఉన్నాడు.

"అభీ.. మామయ్యతో మీ పెళ్ళి గురించి మాట్లాడాలనుకుంటున్నాను" కొడుక్కి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అంది.

అభినవ్ విననట్టే మౌనంగా పనిచేసుకోసాగాడు.

"ఏమ్రా మాట్లాడవు?" శకుంతల రెట్టించింది.

"నాలుగు నెలల క్రిందట అడిగావుగా అప్పుడేమన్నాడు?" చిరాగ్గా అన్నాడు.

"అప్పుడంటే సియా చిన్నపిల్ల, తొందరేముందీ అనుకుని వుండవచ్చు"

"ఇప్పుడడిగినా వాళ్ళు అలాగే అంటారు. ఎందుకంటే వాళ్ళ అల్లుడు బానిసలాగా యింట్లోనే పడివుంటాడుగా. వాళ్ళకి యిష్టమైనప్పుడు "ఊ" అంటే పెళ్ళి చేసుకుంటాడు."

"అభీ.." బాధ నిండిన స్వరంతో అంది.

"నువ్వేమనుకున్నా యిది నిజం. వాళ్ళకి చెప్పిన మాట విని పడుండే అల్లుడు కావాలి. మనం ఉట్టి ఎమోషనల్ ఫూల్స్‌లా కనిపిస్తున్నాం, కాబట్టే మనల్ని ఆడిస్తున్నారు. మామయ్యకి కొడుకులేని లోటు తీర్చే అల్లుడు కావాలి. కానీ, కొడుకులా పెత్తనం చేయకూడదు. అత్తయ్యకి మామయ్య తర్వాత కంపెనీలో ప్లేస్ కావాలి. అందుకని నేను ఎదగకూడదు. ఇద్దరికీ అల్లుడుగా మాత్రం నేనే కావాలి.. ఎందుకంటే, మనం మంచివాళ్ళం. వాళ్ళ సాయాన్ని గుర్తించి జీవితకాలం నెత్తిన పెట్టుకుంటాం అని తెలుసు యిద్దరికీ. అసలు ఏ దద్దమ్మనో తెచ్చి అల్లుణ్ణి చేసుకుంటే సరిపోతుంది. కానీ, భయం తెలివితేటలు లేకపోతే కంపెనీని ఎక్కడ ముంచేస్తాడో అని. నా ప్రతి నిర్ణయాన్ని తిప్పికొట్టి, నా కాన్ఫిడెన్స్ మీద దెబ్బతీస్తుంటేణ యింకా వాళ్ళమీదే ఆధారపడాల్సిన అవసరం నాకు లేదు. మా నాన్న పెట్టుబడి వుంది యిక్కడ. వాళ్ళ ఇన్‌సెక్యూరిటీస్‌కి నేనేం చేయలేను." ఆవేశంగా మాట్లాడాడు.

**శకుంతలాదేవికి** నోటమాట రాలేదు. పరిస్థితి చాలాదూరమే పోయేట్టుందని ఆమెకి అర్థం అయ్యింది.

తండ్రి ఆస్తిలో తన హక్కు గురించి మాట్లాడాడు. పరోక్షంగా ఈ పరిస్థితికి నేనే కారణం అని అనుకుంటున్నాడు కూడా. ." పోనీ, అభీని వారసుడిగా ప్రకటిస్తూ కాగితాల మీద సంతకాలు చేసేస్తే.." శకుంతలాదేవి ఆలోచించింది.

"ఆవేశంతో వున్నాడు. దానికి అధికారం తోడైతే మేనమామకి వ్యతిరేకంగా ఏ గొడవలు తెస్తాడో..!?"

భయం ఆమె ఆలోచనల్ని చంపేసింది.

అభి లేచి వెళ్ళి కిటికీ దగ్గర నిల్చున్నాడు.

శకుంతల కూడా కాస్సేపు ఏమీ మాట్లాడలేదు.

"అయితే, సియానాతో నీ పెళ్ళి గురించి ఏమాలోచించావు?" బయటకి వెళ్ళబోతూ గుమ్మం దగ్గర ఆగి, అడిగింది.

"సియానా అంటే నాకు యిష్టమే. కానీ, ఆమెను పెళ్ళిచేసుకుని ఈ యింటికి అల్లుడిని కాలేను. పెళ్ళి విషయం యింకోసారి ఆలోచిస్తే బావుంటుంది." ఆ మాట అంటున్నప్పుడు అతని గొంతువణికింది.

"నాకు చెప్పకుండా బోర్డు మీటింగ్‌కి కాల్ ఎందుకు చేశావు?" కోపంగా ప్రశ్నించాడు హరిప్రసాద్.

"ప్లీజ్.. మామయ్య. కొంచెం కూల్‌గా ఆలోచించండి. ఈ విషయంలో అందరి ఒపీనియన్ తీసుకుంటే తప్పులేదని అనిపించింది. మీరూ కాస్త ఓపెన్ మైండ్‌తో ఆలోచించండి."

"బ్లడీ...డామ్..! యూ డోన్ట్ నీడ్ టు వర్రీ! ఆల్రెడీ మీటింగ్ కాన్సిల్ అయినట్టు అందరికి మెసేజ్‌లు పంపమన్నాను." నిరసనగా చూస్తూ అన్నాడు.

అభీకి ఒళ్ళుమండిపోయింది.

అతను బరస్ట్ అయ్యేట్టున్నాడని గ్రహించిన, ఆఫీస్ సెక్రటరీ అక్కణ్ణుంచి బయటకు వెళ్ళాడు.

"హౌ కుడ్ యు డు దిస్..? త్రీ మంత్స్ మార్కెట్ రిసెర్చ్ చేసి, డెసిషన్ తీసుకున్నాను. ఒక్క వాక్యంతో నా శ్రమంతా కొట్టిపారేశారు...ఛ" ఆవేశంగా ఛాంబర్ డోర్ తీసుకుని బయటికి వచ్చాడు.

ఇంకా, అతనిలో మంట చల్లబడలేదు. "బ్లడీ.. షిట్.." కోపంగా చేతిలో ఉన్న పేపర్స్ విసిరికొట్టాడు. ఆ రోజే, పి.కె.గ్రూప్స్ సివిల్ వింగ్ కొత్త ప్రాజెక్ట్‌ని ఓపెన్ చేస్తూ ప్రెస్‌మీట్‌కి పిలిచారు. న్యూస్ కవరేజ్ కోసం వచ్చిన, విలేఖరులు, టి.వి.ఛానెల్సు వాళ్ళు లాబీలో వెయిట్ చేస్తూ ఉన్నారు. అభీ ఆవేశంగా బయటికి రావడం పేపర్లు విసిరికొట్టి అరుస్తూ వెళ్ళడం ఒక బ్రేకింగ్ న్యూస్‌గా మారింది.

రాత్రి ఏడుగంటల సమయం. రచిత నెయిల్స్ షేప్ చేసుకుంటూ, సోఫాలో కూర్చుని టి.వి ఆన్ చేసింది.

బ్రేకింగ్ న్యూస్‌లో చూస్తున్న విషయం ఆమె నమ్మలేకపోయింది.

"పి.కె గ్రూప్స్ ఛైర్మన్ హరిప్రసాద్ ఒక నియంత. ఆయన తీసుకునే నిర్ణయాలన్నీ స్వలాభం కోసమే."

ఫ్రస్టేషన్‌తో విలేఖరుల ముందు ఆవేశంగా అరుస్తున్నాడు పి.కె గ్రూప్స్‌లో కీలకవ్యక్తిగా పరిగణింపబడే అభినవ్.

"మీ ఉద్దేశ్యం గుర్‌ప్రీత్‌గారి రాజకీయ రంగప్రవేశం కోసం, పి.కె గ్రూప్‌ని వాడుకుంటున్నారనా?" ఒక రిపోర్టర్ ప్రశ్నించాడు.

"నియంత అని అనడానికి వెనుకగల కారణం చెప్పగలరా?"

ఇంకో ప్రశ్న వచ్చింది గుంపులో నుంచి.

వేటికీ సమాధానాలు చెప్పకుండా గబగబా వెళ్ళి కారులో కూర్చుని డోర్ వేసేశాడు అభి.

"పి.కె గ్రూప్స్ ఛైర్మన్ హరిప్రసాద్ ఒక నియంత" ఆఫీస్ లాబీ నుంచి బయటికి వచ్చి కోపంగా అరుస్తున్న అరుస్తున్న అభీ మొహాన్ని... ఆ వాక్యాన్ని పదే పదే చూపిస్తున్నారు.

"పి.కె గ్రూప్స్‌లో లుకలుకలు" అన్న టైటిల్‌తో చర్చాకార్యక్రమం. రచిత ఆశ్చర్యపోతూ ఛానెల్ మార్చింది.

అన్నింటిలోనూ యిదే దుమారం.

"అతను పి.కె గ్రూప్స్ బోర్డ్ మెంబర్ కాదు. హి ఈజ్ జస్ట్ ఎన్ ఎంప్లాయి. అతని తల్లి శకుంతలాదేవి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరు. కేవలం వారసుడిగా పి.కె గ్రూప్స్‌లో అతను పెత్తనం చేస్తున్నాడు. అతనికి కంపెనీ వ్యవహారాలతో ఏ విధమైన సంబంధం లేదు."

యాభై ఏళ్ళ పైబడ్డ వయసున్న ఒకాయన ప్రెస్‌తో అంటున్నాడు.

వెంటనే "ఇది కుటుంబ పరమైన సమస్యా?" అంటూ టి.విలో, అదే క్లిప్పింగ్ మళ్ళీ ప్రసారం చేశారు.

"ఏమిటే, అంత యిదిగా చూస్తున్నావూ.." అనసూయమ్మ అడిగింది.

"మేం పనిచేసే కంపెనీ ఛైర్మన్ ఆయన.." అంటూ టి.వీలో హరిప్రసాద్‌ని చూపిస్తూ.

"అతని మేనల్లుడు మీడియా ముందు అతన్ని దుమ్మెత్తి పోస్తున్నాడు.." చెప్పింది.

రచిత పనిచేసే కంపెనీ అనగానే, అనసూయమ్మ కూడా ఆసక్తిగా టి.వి ముందు కూర్చుంది.

"చక్కగా దొరబాబులా వున్నాడు.." అభినవ్‌ని చూస్తూ అంది.

"దొరబాబులా కాదు. దొరబాబే."

రచిత, వాట్స్‌ప్‌లో బీప్, బీప్‌మంటూ చాలా మెసేజ్‌లు వచ్చాయి.

"శకుంతలా దేవి ఎవరి పక్షం తీసుకుంటుంది?"

"మన జాబ్స్‌కేమీ ప్రమాదం లేదు కదా!"

"ఇదంతా పబ్లిసిటీ స్టంట్స్" ఇలా రకరకాలుగా మెసేజ్‌లు వచ్చాయి. ఎనిమిదిన్నర కాగానే టి.వి కట్టేశారు.

అనసూయమ్మ పొద్దుట, రాత్రి రెండుపూటలా బి.పి టాబ్లెట్స్ వేసుకుంటుంది. ఎట్టి పరిస్థితులలోనూ పెందలాడే భోజనం చేసి రాత్రి ఎనిమిదిన్నరకల్లా నిద్రపోవాల్సిందే అనసూయమ్మ ఆరోగ్యం విషయంలో ఏమాత్రం అశ్రద్ధ చేయదు రచిత.

"ఒకసారి గడియలన్నీ సరిగ్గా వేశానో, లేదో చూడు.. అమ్మలూ!" మంచం మీద వాలుతూ అంది అనసూయమ్మ.

రచిత ముందుగది తలుపు, వంటింటి తలుపు, స్టవ్‌లు అన్నీ చెక్ చేసి, లైటు ఆపేసి వచ్చి పడుకుంది. పగలంతా పనిచేసి అలసిన కొద్దిసేపట్లోనే, గాఢనిద్రలోకి జారుకుంది.

ఠక్...ఠక్.. లీలగా ఏదో శబ్దం.

కలలో వినిపించినట్టుగా..

మళ్ళా ఠక్... ఠక్..

"ఎవరూ..? " నిద్రలోనే మాట్లాడింది.

ఈసారి యింకాస్త గట్టిగా వినిపించింది. భయంతో గబుక్కున లేచి కూర్చుంది.

కొంపదీసి... ఏ దొంగలో, రౌడీవెధవలో కాదుకదా! ఈ యింట్లోకి వచ్చి ఆర్నెల్లపైనే అయ్యింది. ఇప్పటివరకూ యిలాంటివేమీ జరగలేదు. భయపడుతూనే.. వెళ్ళి హాల్లో లైటు వేసింది.

టైం. యింకా తొమ్మిదిన్నరే.

ఎవరో మాములుగానే వచ్చారేమో!

"తెలిసినవాళ్ళయితే ముందుగా ఫోన్ చేసి వచ్చేవాళ్ళుగా!" అంతలోనే అనుమానం.

ఠక్.. ఠక్...ఠక్..

మళ్ళా చప్పుడు.

ఎందుకైనా మంచిదని పెప్పర్ స్ప్రేని చేతిలోకి తీసుకుంది.

శబ్దం మెయిన్ డోర్ దగ్గరనుంచి వస్తోంది.

నెమ్మదిగా వెళ్ళి పీప్‌హోల్ నుంచి తొంగి చూసింది.

వరండాలో నిలుచున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోవడం, అనుమానపడడం వెంట వెంటనే జరిగిపోయాయి.

"సరిగ్గానే గుర్తుపట్టానా?" అని ఒక్క నిముషం ఆలోచించుకుని, మళ్ళా చూసింది.

సందేహం లేదు. అతడు అభినవ్.

రచిత యింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. "పొరపాటున, యిక్కడ ఎవరింటికైనా వెళ్ళబోయి రాంగ్ అడ్రస్‌కి వచ్చాడేమో" అనుకుంటూ తలుపు తీసింది.

ఆమెని చూస్తూనే ఒక మాదిరిగా నవ్వాడు.

"మై ఐ కమిన్?" అని అడిగి, జవాబు కోసం ఎదురు చూడకుండా ఒక్క అంగలో లోపలికి దుకాడు.

ఆమెకంతా అయోమయంగా తోచి చటుక్కున డోర్ వేసేసింది. ఎప్పట్నుంచో పరిచయం ఉన్నవాడిలా, నేరుగా వచ్చి కోటు విప్పి సోఫా మీద పడేసి, "హాయ్ రచితా!" అన్నాడు అదోరకంగా.

అతని వాలకం చుసి రచితకి అనుమానం వచ్చింది.

"కెన్ ఐ గెట్, ఒన్ గ్లాసాఫ్ వాత్రర్ర్.. జస్ట్ ఒన్... ఓన్లీ ఒన్ గ్లాస్ ప్లీజ్.."

సోఫాలో కాళ్ళు బారగా చాపి కూర్చున్నాడు.

"ఓ.. సోనీ టి.వి, రిమోట్ కూడా సోనీదే

మరి సోనీ పేరెందుకు పెట్టుకోలేదు?

వై ఆర్ యు నాట్ సోని.. టెల్ మీ..

వై ఆర్ యు...?"

తాగి వచ్చాడని అర్థమైంది రచితకి

"ఏయ్.. ముందులే యిక్కడ్నుంచి.." గట్టిగా అరుస్తుండగానే పెద్ద సౌండుతో టి.వి ఆన్ చేశాడు.

ఆమె కోపంగా వెళ్ళి సిచ్చాఫ్ చేసింది.

"అరె.." రిమోట్‌ని తిప్పి మళ్ళా ఆన్ చేయడానికి ప్రయత్నించాడు.

"పి.కె గ్రూప్స్ పెద్దమనిషి యింటర్వ్యూ చూడాలే....రావట్లేదు. మీకు తెలుసా.. మిష్టర్ హరిప్రసాద్ దిగ్రేట్ హరిప్రసాద్‌కి భలే అయిడియాలు వచ్చేస్తుంటాయ్...వాడొట్టి....సా..ల్...కదా!

మీరు చూశారా ఆయన్ని..

యు షుడ్ మీట్ హిమ్.." అని సోఫాలో నుంచి లేచి రచిత రెండు చేతులూ పట్టుకుని వూపాడు.

"ఎవరది?"

అనసూయమ్మ టి.వీలో అభీని చూసింది కాబట్టి ఆనవాలు పట్టింది. "తాగొచ్చి, న్యూసెన్సు చేస్తున్నాడని, పోలీసులకి ఫోన్ చేస్తాను." అంటూ సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుంది, రచిత.

"అమ్మలూ.. నువ్వు కాస్త ఆగు..!" అంటూ, అనసూయమ్మ రచిత చేతిలో నుంచి సెల్‌ఫోన్ లాగేసుకుంది.

"జరిగిన గొడవంతా నువ్వు టి.విలో చూశావు కదా!"

"పాపం.. బిడ్డ మనసు చెదిరిపోయి మందు పుచ్చుకున్నట్టున్నాడు. ఇంకా నయం, ఏ అఘాయిత్యమూ చేసుకోలేదు. ఇప్పుడుగానీ, నువ్వు పోలీసుల్ని పిలిచి ఇంకా అల్లరిపాలు చేశావనుకో.. రేపు ఖచ్చితంగా జరగబోయేది అదే.! అప్పుడు యింత పాపం, మూటగట్టుకున్నామని ఏడ్చినా దిక్కుండదు."

రచిత ఆలోచనతో పడింది.

"మన సేఫ్టీ గురించి కూడా ఆలోచించు.. అమ్మమ్మా."

"పిల్లాడు మంచివాడులా వున్నాడు. మొహం చూస్తేనే తెలుస్తుంది. ఇందాక, నా కాళ్ళకి దణ్ణం కూడా పెట్టాడు. మనకేం భయంలేదులేవే! "

"అయ్యో!" నుదురు మీద అరచేత్తో కొట్టుకుంది రచిత.

ఇంతలో, అభి సోఫా మీద నిలబడి టి.వి విలేఖరులకి యింటర్వ్యూ యిస్తున్నట్టు మాట్లాడుతున్నాడు.

అప్పుడే, రచితకి ఒక చిలిపి ఆలోచన వచ్చింది. సెల్‌ఫోన్‌లో జరుగుతున్న సన్నివేశాన్నంతా వీడియో తీసింది.

"అందువల్ల, నేను చెప్పేదేమంటే, ...హ్భా...హ్వా" ఎక్కిళ్ళు మొదలయ్యాయి.

"ఒన్ గ్లాస్ ఆఫ్ వార్‌ర్..ర్" గట్టిగా కేకపెట్టాడు.

రచిత కొరకొరా చూసింది అతనివైపు.

"పోన్లేవే.. తెచ్చివ్వు... గొప్పింటిబిడ్డ..పో" అనసూయమ్మ పురమాయించింది.

మంచినీళ్ళు గటగటా తాగగానే సోఫా (ఆర్మ్‌రెస్ట్) చేతి మీదకి ఎక్కాడు.

"డియర్ ఫ్రెండ్స్ మనది పి.కె.గ్రూప్స్. అంటే, పీకిపారేయాల్సిన గ్రూప్స్... అందుకే ఆ లోగోలు, బోర్డులు ఎక్కడ కనిపించినా పీకిపారేయండి."

అటూ, యిటూ వూగుతూ మాట్లాడడంతో కాలు బాలెన్సు తప్పి, రచిత కంగారుగా పరుగెత్తి పట్టుకోబోయేలోపే దభీమని సోఫాలో పడ్డాడు.

వెంటనే లేచి తిరిగి మాట్లాడేందుకు గొంతు సవరించుకుని ఉన్నట్టుండి ఫ్లోర్ మీద భళ్ళున వాంతి చేసుకున్నాడు.

"నాయనా!" అనసూయమ్మ నెత్తి కొట్టుకుంది.

"నువ్వు కంగారు పడకు అమ్మమ్మా.." అంటూ, చిన్నగా అతని చేతిని భుజం మీదకి లాక్కుని, రెండవ చేతిని నడుం చుట్టూ వేసి చిన్నగా వాష్‌రూం వైపుకు నడిచింది, రచిత.

అతని బరువుకి పూర్తిగా ఒరిగిపోవడం వల్ల నడవడం కష్టంగా వుంది. అతని బట్టల నుంచి స్ప్రేతో బాటు ఆల్కహాల్ వాసన, వాష్ బేసిన్ ముందు అద్దంలో, ఒకరికొకరు పెనవేసుకున్నట్టు యిద్దరి ప్రతిబింబాలు చూసి ఒక్కసారిగా సిగ్గుపడింది.

టాప్ తిప్పి మొహం మీద నీళ్ళు పోస్తుంటే, మీసాలు చేతికి గరుగ్గా తగిలాయి. ఆమె ఒళ్ళు ఝల్లుమంది.

నెమ్మదిగా చొక్కా తీసేసి, నీళ్ళతో మెడ, చేతులు కడిగింది. బనీను మీద మరకలు అంటిన చోట టవల్‌తో తుడిచి, చిన్నగా తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టింది.

అతనిపాటికి అతను ఏదో మాట్లాడుతూనే వున్నాడు.

బక్కెట్‌తో నీళ్ళు తెచ్చి హాలంతా కడిగి శుభ్రం చేసింది.

"ఇదుగో.. కాసిని మజ్జిగ తాగించు.." అనసూయమ్మ గ్లాసు పట్టుకుని వచ్చింది.

ఇద్దరూ కలిసి బలవంతంగా నోరు తెరిపించి, రెండు గుక్కలుపోశారు.

"అమ్మో! చంటిపిల్లాడికి మందు తాగించినట్టుంది.. ఇక చాల్లే!" భారం దించుకున్నట్టుగా అంది అనసూయమ్మ.

షూస్, సాక్స్ లాగేసి సోఫాలో నెమ్మదిగా పడుకోబెట్టారు. టైం పదకొండు గంటలు దాటింది.

"నేను పడుకుంటాను అమ్మలు. యిప్పటికే లేటయ్యింది. నువ్వు ఒకసారి తలుపులు, గడియలు చూసి, లైటాపేసి రా!" అనసూయమ్మ బెడ్రూంలోకి వెళ్ళింది.

కప్‌బోర్డ్‌లో నుంచి దుప్పటి తెచ్చి అభీకి కప్పింది రచిత.

కిటికీ తలుపులు తీసి, లైట్ ఆఫ్ చేయబోతూ ఒకసారి అతని మొహంలోకి చూసింది.

అతను పూర్తిగా నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో ప్రశాంతంగా వుంది అతని ముఖం.

క్రాఫు చెదిరిపోయి నుదుటి మీద పరుచుకుని వుంది. పొడవుగా, దృఢంగా ఉన్న ముక్కు... దానికింద దట్టంగా, నల్లగా వున్న మీసాలు.. గరుకైన మీసాలు కాస్సేపటి క్రితం బుగ్గమీద, మెడవంపులోనూ గుచ్చుకోవడం గుర్తొచ్చి రచిత బుగ్గలు ఎర్రబడ్డాయి.

రచిత క్యూబికల్ అంతా ఒకటే నవ్వులు.

"అయితే రాత్రి చాలా యింట్రస్టింగ్‌గా గడిచిందంటావ్" సెల్‌ఫోన్‌లో వీడియో క్లిప్పింగ్ చూస్తూ అంది వసుధ.

"కోటు వేసుకుని, సీరియస్‌గా, ఫోకస్డ్ పర్సన్‌లా వుంటాడు. మందేస్తే చూడు గురుడు ఎలా వాగుతున్నాడో" ఆగకుండా నవ్వుతూనే అన్నాడు సాత్విక్.

"అవునూ తాగితే సీరియస్‌గా వుండేవాళ్ళు జోవియల్‌గా, ఎప్పుడూ బడబడా మాట్లాడేవాళ్ళు సైలెంట్‌గా అయిపోతారట నిజమేనా? " వసుధ సాత్విక్‌ని చూస్తూ అంది.

సాత్విక్ మొహం సీరియస్‌గా మారింది.

"ఏమిటి నీ డౌట్? నేను డ్రింక్ చేస్తానా? లేదా? అనేనా?" అన్నాడు.

"ఆ మాటెవరు అన్నారు? నా కొశ్చెన్‌కి ఆన్సర్ తెలిస్తే చెప్పు. లేకపోతే లేదు." వసుధ కోపంగా అంది.

"నాకు పనుంది వస్తా! బై రచీ" చల్లగా అక్కణ్ణుంచి జారుకున్నాడు.

"ఆ వీడియో నా వాట్సప్‌కి పంపు..ప్లీజ్" వసు బతిమిలాడింది.

"నో..వే! నువ్వు ఎఫ్.బిలో, వాట్సప్‌లో అందరికీ షేర్ చేస్తావు. నేను పంపను."

"దిగి వచ్చిందండీ. నీతినియమాలకి నిలువెత్తు రూపం. ఇదే యింకెవరన్నా అయ్యుంటేనా అతన్ని నెట్‌లో అల్లరిపాలు చేసుండేవాళ్ళు"

"నేనలాంటిదాన్ని కాదులే"

"తెలుసులే. యింతకీ రాత్రి యిద్దరూ ఒకే యింట్లో. అతనేమో హేండ్సమ్ గై.. నువ్వేమో యంగ్ అండ్ బ్యూటిఫుల్. మనసులో రొమాంటిక్ థాట్స్ రాలేదా?.." చిలిపిగా కన్నుకొడుతూ అడిగింది.

"ఒక థాట్ అయితే వచ్చింది"

"ఏమిటో చెప్పు"

"అతను యింకోసారి వాంతి చేసుకుంటే, కడగలేక నడుం పట్టేస్తుందేమో అని" పకపకా నవ్వింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ.."

కొత్త గొంతు వినిపించడంతో యిద్దరూ తలలు తిప్పి చూశారు.

"రచిత..."

"యస్.. నేనే.." అంది లేచి నిలబడుతూ, "అయామ్ చైతన్య" అన్నాడతను.

"ఇతన్ని ఎక్కడో చూసినట్టుందే" రచిత ఒక్క క్షణం ఆలోచించింది.

"యస్.. అతనే ... ఆరోజు ఫుట్ పాత్ మీద కారెక్కించబోయాడు. కొద్దిలో తప్పిపోయింది."

"ఏం కావాలి?" దురుసుగా అడిగింది.

"ఒక్కసారి మీతో మాట్లాడాలి" వినయంగా అన్నాడతను.

"ఎందుకు? ఈసారి యింకెవరి మీదన్నా కారెక్కించావా? మీరు మహా గొప్పగా డ్రైవింగ్ చేస్తారని నేను వచ్చి సాక్ష్యం చెప్పాలా?"

"అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ ఎబౌట్ దట్ డే"

"ప్షి. బిహేవ్ యువర్ సెల్ఫ్" నడుం మీద గిల్లి, చెవిలో గొణిగింది వసుధ.

"చెప్పండి" పొడిగా అంది చైతన్యవైపు తిరిగి.

"ఇక్కడ కాదు.. అలా బైటికి వెళ్ళి మాట్లాడుకుందామా?"

"ఓకే. మీరు మాట్లాడుకోండి.. నేను వస్తాను. బై" వసుధ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

"మిస్టర్. మీతో మాట్లాడడమే ఎక్కువ. దానికోసం పార్కులకో, రెస్టారెంట్స్‌కి రావడం టూమచ్. కావాలంటే, ఆ ఫోర్త్ క్యూబికల్‌లో గీత వుంది. ఫుడ్ అంటే పిచ్చిదానికి. అది వస్తుందేమో అడగండి" నిర్లక్ష్యంగా అని, లాప్‌టాప్‌లోకి తలకాయ దూర్చింది.

"రచితగారూ.." చిరాకుని అదిమి పట్టినట్లు అతని గొంతులో తెలుస్తుంది.

"మీరు నాతో మాట్లాడనక్కర్లేదు. పార్కులకీ, రెస్టారెంట్స్‌కీ రావక్కర్లేదు. క్రింద మీతో మాట్లాడాలని అభి వెయిట్ చేస్తున్నాడు."

"ప్రొద్దుటే కనిపించకుండా వెళ్ళిపోయాడు. నిన్న జరిగినదానికి క్షమాపణ అడగడానికే వచ్చివుంటాడు" అనుకుని.

"పదండి" అంది చైతన్యవైపు చూస్తూ.

ఇద్దరూ లాబీలోకి వచ్చారు.

లిఫ్ట్ బటన్ నొక్కి, వెయిట్ చేస్తూ పక్కగా నిలబడింది.

లిఫ్ట్‌లోకి ఎక్కగానే ఒకసారి చురుగ్గా చైతన్యవైపు చూసి "ఊ...ఁ" అంది.

అతను వెంటనే పార్కింగ్ లెవల్‌కి వెళ్ళే బటన్ నొక్కాడు. లిఫ్ట్ ఆగగానే డోర్ తీయమన్నట్టు కళ్ళతోనే సైగ చేసింది. అతను ఓపెన్ బటన్ నొక్కాడు.

పార్కింగ్ లాట్‌లోకి రాగానే నడుస్తున్నదల్లా సడన్‌గా ఆగి "టైం ఎంతయ్యింది?" అని అడిగింది.

గబుక్కున పాకెట్‌లో నుంచి సెల్‌ఫోన్ తీసి "టెన్ - థర్టీ" అని చెప్పాడు.

"ఇప్పుడు రెయిన్ వస్తుందా?"

రెండడుగులు బయటకి వేసి, తలపైకెత్తి చూసి "నో ఛాన్స్" చెప్పాడు.

"చూడు మిస్టర్ ఒక అమ్మాయిని అదే పనిగా చూడాలనిపిస్తే తప్పేం లేదుగానీ, ఎంబరాసింగ్‌గా వుండకుండా యిలాంటివన్నీ చెయ్యొచ్చు. ఇక నుంచైనా ప్రాక్టీస్ చేయండి"

చైతన్య ఒక్క క్షణం సైలెంట్ అయిపోయి పకపకా నవ్వేశాడు.

"కూల్.. నో ప్రాబ్లమ్.. మీరూ నాటైపే"

అభినవ్ కారుకి ఆనుకుని కొద్ది దూరంలో నిలబడ్డాడు.

"నువ్వేం కంగారు పడకు అభీ. రచిత ఫుల్‌కూల్.. మన టైపే సో నో ప్రాబ్లెమ్" అభినవ్‌ని సమీపిస్తూ అన్నాడు.

"ఐయామ్ సారీ. నిన్న రాత్రి జరిగినదానికి" మొహమాటంగా అన్నాడు.

"అందుకేనా, పొద్దున నిద్రలేచేలోపే కంటికి కనిపించకుండా వెళ్ళారు?"

"చాలా ఎంబరాసింగ్‌గా అనిపించింది మళ్ళా మీకు కనిపించాలంటే, నేనెలాంటి పరిస్థితిలో ఉన్నానో మీరు అర్థం చేసుకోగలరనుకుంటాను." నెమ్మదిగా అన్నాడు.

"ఐ అండర్‌స్టాండ్"

"ఎక్కడైనా కూర్చుని మాట్లాడుకుందామా?"

"ఆవిడ పార్కులకీ, రెస్టారెంట్స్‌కీ రాదు.." అందించాడు చైతన్య.

"ప్లీజ్... చైతూ నన్ను మాట్లడనీ.." విసుగ్గా అన్నాడు.

"ఓ.కే.. నేను నోరు మూసుకుంటాను." డ్రమాటిగ్గా నోటిమీద వేలువేసుకున్నాడు, చైతన్య.

"ఇక్కడ మాట్లాడాలంటే స్టాఫ్ ఎవరైనా చూస్తే న్యూస్ అవుతుంది."

రచితతో అంటూ, కారు డోర్ తీశాడు.

చైతూ బంక్ సీట్లో, అభినవ్ డ్రైవింగ్ సీట్లో కూర్చునేసరికి, రచిత ముందు సీట్లో కూర్చుంది.

"రచితా.. ప్రస్తుతం నేను చాలా చిక్కుల్లో ఉన్నాను. కొత్తగా ఒక బిజినెస్ ప్లాన్ వర్కవుట్ చేస్తున్నాను. హైదరాబాద్‌లో నాకు యిల్లు లేదు.

ఇప్పుడు మామయ్య దగ్గర ఉండలేను. మామయ్యకి వ్యతిరేకంగా వెళ్ళానని అమ్మకూడా కాస్త కోపంగా వుంది. ఏ నీడ్ ఎకాంబిడేషన్. ఏ హోటల్‌లోనో ఉండవచ్చు కానీ....దట్స్ నాట్ ద ప్లేస్ ఐ వాంట్.. అదే యిప్పటి పరిస్థితుల్లో, మీకు అభ్యంతరం లేకపోతే ఒక వారం రోజులు మీ యింట్లో ఉండవచ్చా?.." సూటిగా అడిగేసరికి రచిత షాక్ తింది.

అతను జోక్ చేస్తున్నాడా? రచితకి అనుమానం వచ్చింది. సీరియస్‌గా రోడ్‌వైపే చూసి డ్రైవ్ చేస్తున్న, అతని మొహం చూస్తే ఆమెకి అలా అనిపించలేదు.

"ఇంత పెద్ద సిటీలో యితనికి స్నేహితులు, బంధువులు ఎవరూ లేరా?" ఇంకో అనుమానం వచ్చింది.

"నాకున్న ఫ్రెండ్స్, చుట్టాలు మామయ్య పరిచయాలో, లేక ఆయనతో పరిచయం కోసం దగ్గరైనవాళ్ళో... ఒక్క చైతూ తప్ప.

చైతూ వాళ్ళింట్లో ఉండమన్నాడు కానీ, నా గురించి మోహన్ అంకుల్‌కి, మామయ్యకి డిఫరెన్స్ రావడం నాకు యిష్టం లేదు.'' ఆమె మనసులో సందేహాన్ని చదివినట్టే చెప్పాడు.

బిగుసుకుపోయి వున్న అతని మొహం చూసి లోలోపలే ఎంతో బాధపడుతున్నాడని గ్రహించింది రచిత.

ప్రతి మనిషి జీవితంలో యిలాంటి సంఘటన ఎప్పుడో అప్పుడు ఎదురవ్వక తప్పదు.

ప్రపంచపు రీతి అలాగే వుంటుంది. జీవితాన్ని ఎంచుకునేటప్పుడు కఠినమైన ఛాయిస్‌లు యిస్తుంది. భావోద్వేగాల మధ్య నలిగిపోతూ చేయవలసిన ప్రయాణం అది.

చిన్నప్పుడే, ఆలోచనలతో యుద్ధం చేయకుండానే, యిటువంటి ఒక కఠినమైన నిర్ణయం తీసుకుంది. ఆ బాధ ఎలా వుంటుందో ఆమెకు తెలుసు.

అభినవ్ పట్ల ఆమెకు సానుభూతి కలిగింది.

''నాకేం, అభ్యంతరం లేదు. కాకపోతే అమ్మమ్మతో ఒకసారి మాట్లాడాలి.''

''ఓహ్! మామ్మగారితోనా ఎప్పుడో మాట్లాడేశాం. ఆవిడకి ఓ.కేనే!'' రచిత ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చైతూ వైపు చూసింది.

''మీ యింటికి వెళ్ళి మామ్మగారితో మాట్లాడి, మావాడికి సౌకర్యంగా ఉంటుందని ఆలోచించాకే, నీతో మాట్లాడింది'' అన్నాడు చైతన్య నవ్వుతూ.

రచిత అర్థం అయినట్టుగా తలాడించింది.

''అభీ.. అయితే, కారుని నేరుగా రచీ, యింటికి పోనిచ్చెయ్..'' హుషారుగా అన్నాడు చైతు.

రచిత కోపంగా అతనివైపు చూసింది.

తప్పు అర్థమైందన్నట్టుగా ''సారీ! రచితగారింటికి పోనీయరా!'' అన్నాడు నవ్వుతూ.

''మా వీధిలో మీకు తెలిసినవాళ్ళు ఉన్నారుగా వాళ్ళు చూస్తే ఏ ప్రాబ్లం ఉండదా?'' రచిత అభినవ్‌ని అడిగింది.

''ఎవరూ.. తెలిసినవాళ్ళు..?''

''మరి నిన్న రాత్రి ఎవరింటికి వెళ్ళబోయి, పొరపాట్న మా యింటికి వచ్చారు?''

''ఎక్కడికో వెళ్ళబోయి కాదు. మీ యింటికి కావాలనే వచ్చాను?'' రచిత కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవి అయ్యాయి.

''గేటెడ్ కమ్యూనిటీ సెక్యూరిటీ యింత మాత్రంగానే ఉందన్నమాట'' మనసులో అనుకోబోయి పైకే అనేసింది.

''ఖరీదైన బట్టలు, కారు.. అందులో అభీ మొహం చూస్తే వాచ్‌మాన్‌కి అనుమానం వస్తుందా?'' తనతో తనే సమాధానం కూడా వెతుక్కుంది.

''ఆరోజు చైతూ యాక్సిడెంట్ చేయబోయినప్పుడు, నేను వాడి పక్కనే వున్నాను. అప్పుడే మీ యిల్లు చూశాను.

నిన్న జరిగిన గొడవకి... డైవర్షన్ కోసం మీ యింటికి దగ్గర్లోని బార్‌కి వచ్చాను.

డ్రింక్ చేసి డ్రైవ్ చేయడం మంచిది కాదు. టాక్సీని పిలిచినా ఎక్కడికెళ్ళాలో తెలియదు.

''తాగి రోడ్లమీద తిరుగుతున్న పి.కె గ్రూప్స్ హరిప్రసాద్ మేనల్లుడు'' అని మళ్ళా న్యూస్‌లోకి ఎక్కడం యిష్టంలేక ధైర్యం చేసి మీ యింటికి వచ్చాను.''

చెప్పేటప్పుడు అతని గొంతులో ఆర్ద్రత రచిత మనసుని తాకింది.

''ఓ.కె... అయితే నావి కొన్ని కండిషన్స్ ఉన్నాయి'' స్థిరంగా అంది.

"ఫస్ట్ అండ్ ఫోర్‌మోస్ట్ డ్రింక్ చేయకూడదు.. అంతేనా?" చైతన్య అన్నాడు.

"అంతేకాదు.. మా యింట్లో ఉన్నన్నాళ్ళు న్యూస్‌లోకి ఎక్కి మమ్మల్ని టీ.వీల కెక్కించకూడదు. ఫ్రెండ్స్, పార్టీలులాంటివి ఉంటే బయటే చూసుకోవాలి"

"డన్! అండ్ థాంక్యూ వెరీమచ్" చెప్పాడు అభి.

సంభాషణ ముగిసేసరికి కారు రచిత యింటి ముందు ఆగింది.

"లాప్‌టాప్ బ్యాగ్, ట్రంక్‌లో నుంచి ఒక సూట్ కేస్ బయటికి తీశాడు అభీ.."

రచిత నోరు తెరుచుకుని చూస్తూ ఉండిపోయింది.

"అంటే.. ముందుగానే ప్రిపేర్ అయిపోయారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏమనుకున్నావు అభీ అంటే, బిజినెస్ పీపుల్ టైం వేస్టు చేయరు. నువ్వు పార్కులకీ, రెస్టారెంట్స్‌కీ రానన్నాను. కానీ, మావాడికి తీసుకెళ్ళే ఉద్దేశ్యం కూడా లేదు. చూడు మీటింగ్ కారులోనే ముగించేశాడు.." అన్నాడు చైతూ కనుబొమలెగరేస్తూ.

"అయితే, యిద్దరూ కలిసి నా ఆఫీస్ అవర్స్ వేస్ట్ చేయించారన్నమాట"

అంది చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ఫర్వాలేదు.. నేను నిన్ను డ్రాప్ చేస్తాను." అంటూ కార్‌డోర్ తెరిచాడు.

"చూశారా.. బార్‌కి దగ్గర్లో యిల్లు ఉండడం వల్ల మాలాంటివాళ్ళు ఎలా సడన్‌గా ఫ్రెండ్సయిపోతారో.." అంటున్న చైతన్య వైపు కోపంగా చూడబోయి రచిత నవ్వేసింది.

మేడమీద బెడ్రూం కిటికీ తలుపులు టకటకా కొట్టుకుంటున్నాయి. అప్పుడే స్నానం చేసి వచ్చిన రచిత ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అవుతుంది.

గాలి బాగా వీస్తున్నట్టుంది.. శబ్దం మరింత ఎక్కువగా వినబడుతుంది. "అమ్మలు కిటికీ తలుపులు వేసిరామ్మా! లేకపోతే అద్దాలు పగిలిపోయేట్టున్నాయి" వంటింట్లో నుంచి అనసూయమ్మ కేకపెట్టింది. దువ్వుకోబోతున్న జుట్టుని తిరిగి పైకి మడిచి క్లిప్ పెట్టుకుని హడావుడిగా పైకి వెళ్ళింది.

మెట్లు ఎక్కి బెడ్ రూం వైపుకి వెళ్ళబోతున్నదల్లా సడన్‌గా దేనికో గుద్దుకున్నట్టయ్యింది. రచిత జుట్టుకి, చెంపలకి తెల్లగా, ఘాటైన వాసనతో నురగ నురగగా తగిలింది.

చేత్తో నుదురు తుడుచుకుంటూ తల ఎత్తి చూసేసరికి ఎదురుగా బనీన్, షార్ట్‌తో నిలబడి వున్నాడు అభి.

కండలు తిరిగిన భుజాలపై నరాలు పచ్చగా కనిపిస్తున్నాయి. అతని చెంపలమీద దట్టంగా షేవింగ్ క్రీం.

"అయామ్ సారీ. కిటికీ తలుపులు వేద్దామని వచ్చాను" అప్పటిదాకా అతను ఈ యింట్లో వున్నాడన్న విషయమే జ్ఞాపకానికి రాలేదు రచితకి.

"నేనూ అందుకే వచ్చాను" షేవింగ్ క్రీం వుండడం వల్లేమో పట్టి పట్టి మాట్లాడుతున్నాడు.

"ప్లీజ్" మర్యాదగా వాష్ బేసిన్ వైపు చేయి చూపించాడు.

రచిత జుట్టుకి, నుదురుకి అంటుకున్న క్రీం శుభ్రం చేసుకునేలోపు అతను కిటికీ తలుపులు వేసి వచ్చాడు.

"ఇటువంటి పనులు మీరే చేసుకోవాలంటే యిబ్బందిగా వుంటుందేమో కదా!" అంది అతనివైపు తిరిగి.

"ఏమనుకుంటున్నారు మీరు? నేనూ మనిషినే, కామన్‌సెన్స్ వుంది. రెండేళ్ళు యింగ్లండ్‌లో వున్నాను. నా పనులు నేనే చేసుకోవటం అలవాటు." టిష్యూతో నురుగ అంతా తుడిచేసుకుంటూ అన్నాడు.

"మంచి అలవాటు" నవ్వుతూ చెప్పి, కిందకు వెళ్ళిపోయింది. తలదువ్వుకుని, బ్యాగ్‌లో లాప్‌టాప్ పెట్టుకుని తయారయ్యేసరికి, వంటగదిలో నుంచి ఘుమఘుమలాడుతూ కమ్మటి వాసన వస్తూ వుంది.

పెనం మీద పెసరట్టు నేతిలో ఎర్రగా కాలుతూ వుంది.

"అమ్మమ్మా... త్వరగా" ప్లేటు పట్టుకుని నిల్చుంది. అనసూయమ్మ పళ్ళెంలో అల్లం పచ్చడి వేసి, దోరగా కాలిన పెసరట్టు వేసింది.

"ఆహా! ఓ బొట్టు అమృతం కానీ, కలుపుతావా నువ్వు పెసరట్టులో" ఓ ముక్క తుంచి నోట్లో పెట్టుకుంటూ అంది.

"సరేలే.. ఆ అబ్బాయిని కూడా పిలువు తింటాడు" అంది పెనం మీద యింకో అట్టువేస్తూ.

"అయ్యో నీ దుర్గాపురం బుద్దులు పోనిచ్చుకున్నావు కాదూ. అతనెక్కడో బయట తింటాడులే" నిర్లక్ష్యంగా అంది.

"యిక్కడ దగ్గర్లో ఏమి ఏడిచాయి తినడానికి అటు వెళితే గుళ్ళో ప్రసాదం. యిటు వెళితే బార్‌లో మందూ తప్ప."

"గుడి సంగతి తెలియదుగానీ, బార్‌కి వెళ్ళే అలవాటు మాత్రం బాగా వుంది" రెండురోజుల ముందు జరిగినది గుర్తొచ్చి పకపకా నవ్వింది.

వెనక్కి తిరిగి చూసేసరికి వంటగది గుమ్మమ ముందు అభినవ్ నిలబడి వున్నాడు.

నవ్వుతున్నదల్లా సడన్‌గా ఆగిపోయింది రచిత.

"అల్లం పచ్చడి, పెసరట్టు తింటావా బాబూ?" అంటూ ప్లేటు పట్టుకొచ్చి ఆదరంగా అడిగింది అనసూయమ్మ.

"కాసేపటి క్రితం షేవింగ్ చేసుకున్నాడు. యింతలోనే స్నానం చేసి, ట్రిమ్‌గా తయారయ్యి వచ్చాడు. చాలా స్పీడ్" అనుకుంటూ నిశ్శబ్ధంగా అతన్నే గమనిస్తూ నిల్చుంది రచిత.

"మామ్మగారూ! రేపు నాకు గారెలు చేసి పెడతారా?" అడిగాడతను.

"లక్షణంగా" ఆనందంగా చెప్పిందావిడ.

"వస్తాను మామ్మగారు.. బై రచిత."

ఎన్నాళ్ళ నుంచో పరిచయం ఉన్నవాడిలా అభిమానంగా చెప్పాడు.

"వన్ మినిట్" హఠాత్తుగా గుర్తుకు వచ్చిన దానిలా రచిత పక్కగదిలోకి పరిగెత్తింది.

కోటు, లాప్‌టాప్ బ్యాగ్ పట్టుకుని బయలుదేరడానికి సిద్ధంగా నిలబడి ఉన్నాడతను.

"ఇదిగోండి. సెకండ్ కీ. ఒకవేళ మీరు రాత్రికి లేటుగా వస్తే" రచిత పరుగున వెళ్ళి తాళం అందించింది.

"డోన్ట్ బి ఫార్మల్.. కాల్ మీ అభీ"

తాళాలు అందుకుంటూ ఆమె చేతివేళ్ళను తాకాడు.

రచితలో గగుర్పాటు "ఆ రోజు రాత్రి పూర్తిగా మీద వాలిపోతూ... వెచ్చటి వూపిరి చెంపలని తాకుతూ" అతనికిదంతా గుర్తు వుండి వుంటుందా? ఒకవేళ గుర్తుంటే అప్రయత్నంగానే రచిత సిగ్గుతో కిందకి వాలిపోయాయి కనురెప్పలు.

"సత్తెన్నా! మాలతి తీగె అంటు పక్కవాళ్ళ గార్డెన్‌లో ఆర్చికి అల్లించు బావుంటుంది."

"నీకెందుకీ పనులన్నీ రచితమ్మా" సత్తెన్న మొక్కలకి పాదులు చేస్తూ అన్నాడు.

"భలే చెప్పావులే. మా దుర్గాపురంలో ఖాళీ చిక్కితే తోటపని చేసేదాన్ని. ఇప్పుడు శని, ఆదివారాలు తప్ప వీలుదొరకడం లేదు. అమ్మమ్మా! నువ్వు చెప్పు సత్తెన్నకి మన వూర్లో తోట ఎలా వుండేదో"

రచిత మాటలకి అనసూయమ్మ జవాబివ్వలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు, వేరే లోకంలో వుంది.

"అమ్మమ్మా!" రచిత రెట్టించింది.

"ఆ... అమ్మలూ" ఒక్కసారిగా ఈలోకంలోకి వచ్చినట్టు అంది.

"ఏమిటంత లావున ఆలోచిస్తున్నావ్?"

"అమ్మలూ! ఒక్కసారి ఆ అబ్బాయికి ఫోన్ చేయరాదుటే?"

"ఏ అబ్బాయికీ?"

"అదేనే.. మనింట్లో దిగాడు. అభినవ్.. అతనికి"

రచిత ఒక్క క్షణం ఆలోచించింది. "శుక్రవారం పొద్దుననగా వెళ్ళాడు. రాత్రికి యింటికి రాలేదు. ఎప్పుడు వచ్చేదీ చెప్పలేదు. పైపెచ్చు గారెలు చేయండి. అని చెప్పి మరీ వెళ్ళాడు. బహుశా తిరిగి మేనమామ యింటికే వెళ్ళాడేమో"

"బయటికి వెళ్ళిన మనిషి వేళకి యింటికి రాకపోతే ఎలాగ? కనీసం ఎక్కడున్నాడో, ఎలా వున్నాడో ఫోన్ చేసి అయినా చెప్పొద్దూ" అనసూయమ్మ గొణుక్కుంటున్నట్టుగా పైకే అనేసింది.

"పిచ్చి అమ్మమ్మా! అతను ఫ్లైట్ ఎక్కి ఏ బాంబేలోనీ, ఢిల్లీలోనో ఫైవ్ స్టార్ హోటల్లో దిగి వుంటాడు. లేకపోతే, సరదాగా గర్ల్‌ఫ్రెండ్‌తో ఎక్కడికైనా వెళ్ళి వుండొచ్చు. నువ్వు అనవసరంగా కంగారు పడడమేగానీ, అతను బాగానే ఎంజాయ్ చేస్తూ వుండివుంటాడు."

రచిత పైకి అలా మాట్లాడినా, మనసులో మాత్రం ఆరాటంగానే వుంది.

"నాకు తెలీదు అమ్మలు. మనింట్లో వున్నంతవరకు ఆ పిల్లాడి బాగోగులు మనవే. అతని యోగక్షేమాలు పట్టించుకోవలసిన బాధ్యత మనకి వుంది. అందులోనూ, యింట్లో వాళ్ళతో గొడవపెట్టుకున్నాడు. మనసు చెదిరిపోయి వుంటుంది" అంది విచారంగా.

"ఎవరిమీదైనా ఎందుకంత పిచ్చిగా ప్రేమను పెంచుకుంటావు?" లాలనగా అంది, పక్కన వచ్చి కూర్చుంటూ.

"నాకవన్నీ తెలీదు. ముందా పిల్లాడి సంగతి కనుక్కో"

రచిత లేచి యింట్లోకి వెళ్ళింది.

వెనకాలే ఆరాటంగా వచ్చి, సోఫాలో కూర్చుని చూస్తూ వుంది అనసూయమ్మ.

వాట్సప్‌లో అభీకి మెసేజ్ పెట్టింది. రిప్లై రాలేదు.

సంకోచిస్తునే కాల్ చేసింది. వాయిస్ మెయిల్‌కి వెళ్ళింది. కట్ చేసి సోఫాలో కూర్చుంది రచిత.

"ఏమైనా తెలిసిందా అమ్మలూ..?" అనసూయమ్మ అడిగింది. రచిత సమాధానం చెప్పేలోపలే సెల్ రింగయ్యింది.

"హలో.."

"మీరు యింకా యింటికి రాకపోతే, ఎలా వున్నారో అని అమ్మమ్మ కంగారుపడుతూ వుంది, అందుకనే ఫోన్ చేశాను."

"ఓ... సారీ రాత్రి బెంగుళూరులో మీటింగ్ లేటయ్యింది. షెం టెక్ వాళ్ళతో మీటింగ్ ఓ.కే అయ్యింది. పొద్దున్న వచ్చాను. యిప్పుడే అమ్మని కలిశాను. పదినిమిషాలలో అక్కడికే బయల్దేరి వస్తున్నాను."

"అమ్మమ్మా! రాత్రి బెంగుళూరులో ఆలస్యం అయ్యిందట. ఇంకాసేపట్లో వస్తున్నానని చెప్పాడు" రచిత చెప్పడంతో అనసూయమ్మ తృప్తిగా తలాడించి పూజగదిలోకి వెళ్ళింది.

"ఇంతకీ నా నెంబరు ఎలా కనుక్కున్నావ్?"

"మీ రూంలో ట్రావెల్ బ్యాగ్ మీద, లగేజీ ట్యాగ్ పైన అడ్రసూ, ఫోన్ నెంబరూ రాసి వున్నాయి."

"ఓ... సో థాట్‌ఫుల్" మెచ్చుకోలుగా అన్నాడు.

"అయినా, ఎక్కడికెళ్ళారో ఏం చేస్తున్నారో చెప్పకపోతే అవతలివాళ్ళు కంగారుపడతారేమో అన్న ఆలోచన వుండొద్దూ"

"ఏమో నాకోసం అంత కంగారు పడతావని నిజంగానే వూహించలేదు."

అతని మాటల్లో ఆంతర్యం అర్థమై తత్తరపడింది రచిత. "మేం దుర్గాపురం వాళ్ళమండీ. అలాగే వుంటాం" అంది నవ్వుతూ.

"ఎలా అందంగా యింకా బోలెడంత మంచితనం కుప్పబోసినట్టుగానా?" మాటల్లో కొంటెతనం వినిపించింది.

"హలో మాటలు శ్రుతిమించుతున్నాయి" చిరుకోపం ప్రదర్శిస్తూ అంది.

"ఓ. సారీ మేడమ్ నేను యిప్పుడన్నవన్నీ మీగురించి అనుకుంటున్నారా? నేనన్నది దుర్గాపురం మామ్మగారి గురించి"

రచిత ముద్దుగా మూతి ముడుచుకుంది.

"ఓ.కే... ట్రాఫిక్‌లో వున్నాను. ఒక్క గంటలో అక్కడుంటా"

ఫోన్ కట్ చేసిన చప్పుడు.

రచిత మనసెందుకో హాయిగా అనిపించింది.

అభీ యింట్లో తిరుగుతూ వుంటే కొత్తగా వుంది. అతని గురించి ఆరాటపడడం, ఒకరి మీద ఒకరికి అభిమానం.. భార్యాభర్తా అంటే యిలాగే ఉంటారా?

"హారతి అద్దుకోవే" అనసూయమ్మ పిలుపుతో పూజగదిలోకి వచ్చింది.

"అబ్బాయి ఎంతసేపట్లో వస్తాడట?"

"ఏం?"

"ఏమిటేమిటి? వేడిగా గారెలు వేద్దామని, నోరు తెరిచి అడిగాడు"

"నోటితోనే అడుగుతారు ఎవరైనా? యిందులో విచిత్రం ఏముంది?" కనురెప్పలు ఆడిస్తూ వేళాకోళంగా అంది.

"....."

"అయ్యో అమ్మమ్మా అతనికి కావలసిన వాళ్ళంతా వున్నారు. అమ్మ, మేనమామ, కాబోయే భార్య.... మాట పట్టింపు కోసం నాలుగురోజులు మన యింట్లో ఉన్నంత మాత్రాన నీ కొడుకో, మనవడో అన్నట్టుగా అంత మమకారం దేనికి?"

అనసూయమ్మ మొహం దిగులుగా మారిపోయింది.

"నీకూ పెళ్ళై యింట్లో నా మనవడు తిరుగుతూ వుంటే, ఎలా వుంటుందో అన్న ఊహ వస్తూ వుంటుందే, ఆ అబ్బాయి మనింట్లో తిరుగుతూ వుంటే"

సరిగ్గా రచిత ఏమనుకుంటుందో అనసూయమ్మ కూడా అదే మాట అంది.

"సంబంధాలు చూడమని తెలిసినవాళ్ళకి చెప్పమంటావా? లేకపోతే నువ్వే కంప్యూటర్‌లో చూసుకుంటావా?" రచితని అడిగింది.

ఇంతలో, కాలింగ్ బెల్ మోగింది.

రచిత వెళ్ళి తలుపు తీసింది.

"లోపలికి రావచ్చా?"

అతను అడిగేదాకా గుమ్మంలో నిలబడి రెప్పవేయకుండా చూస్తున్నట్టు అర్థమై సిగ్గుపడి పక్కకి తప్పుకుంది.

అభినవ్ తిరిగి రాగానే నిశ్చింతగానూ, సంతోషంగానూ వుంది. అతను పైకి వెళ్ళి ఫ్రెష్ అయివచ్చే లోపు వేడిగా గారెలు వేసి తెచ్చింది అనసూయమ్మ.

"టిఫెన్ తినే వచ్చుంటారు. అమ్మమ్మా" రచిత కావాలనే అంది.

"అవును, మామ్మగారూ అమ్మని చూడడానికి వెళితే టిఫెన్ పెట్టకుండా పంపిస్తుందా? కాకపోతే, నేను గారెలు కూడా తింటాను" చొరవగా ప్లేటు అందుకుని రచిత వంక చూశాడు.

అభి వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి వచ్చాడనగానే అనసూయమ్మ మొహం సంతోషంతో విప్పారింది.

"అమ్మ కోపం తాటాకు మంట లాంటిది బాబూ! ఒక్క క్షణమే వుంటుంది"

రచిత కిటికీలోనుంచి బయటకు చూస్తూ కూర్చుంది.

"ఒన్ మోర్ థింగ్ రచితా! వచ్చుంటారు. తినుంటారు. ఏమిటి? నేనూ నాతో బాటూ నా డూప్ కూడా వున్నాడా? చక్కగా తిన్నాడు, వచ్చాడు అనలేవా?" అన్నాడు రచిత వైపు చూస్తూ.

"దుర్గాపురంలో పెరిగింది బాబూ, అమ్మాయి, అందరినీ గౌరవంగా మర్యాద యిచ్చి పిలవడం అలవాటు" గర్వంగా చెప్పింది అనసూయమ్మ.

దుర్గాపురం పేరు వినగానే అభీ పకపకా నవ్వాడు.

పొలమారి దగ్గు వచ్చింది.

"అయినవాళ్ళు తలుచుకుంటున్నట్టున్నారు" అనసూయమ్మ అంది.

"బహుశా, సియానా తలుచుకుంటుందేమో" ఊహకు రాగానే రచిత మనస్సంతా అదోలా అయిపోయింది.

**ప్రొద్దుటే లేచి తలారా** స్నానం చేసి, సన్న బార్డరు వున్న ఆకుపచ్చ రంగు పట్టుచీర కట్టుకుంది రచిత. చెవులకి బుట్టలు పెట్టుకుని, నిలువు బొట్టు దిద్దుకుంది.

"అమ్మమ్మా.. యిలారా!" అనసూయమ్మను పిలిచి కాళ్ళకు దండం పెట్టింది.

"త్వరగా పెళ్ళిచేసుకుని, హాయిగా బిడ్డాపాపలతో చల్లగా వుండు" దీవించింది.

"ఎప్పుడూ ఒకటే దీవెనా?"

"అంతకన్నా, సుఖం, సంతోషం ఎందులో ఉంటాయేం? పెరట్లో నాలుగు మందారపులు కోసి తెచ్చి దేముడికి పెట్టి నమస్కారం చేసుకో. పాయసం చేశాను, తిందువుగానీ," అంటూ వంటగదిలోకి వెళ్ళింది.

రచిత పూలకోసం పెరట్లోకి వెళ్ళింది.

గుమ్మానికి ఎదురుగా తులసికోట ముందు పిండితో ముగ్గులు పెట్టి వున్నాయి. కాస్త దూరంలో, నెలరోజుల క్రితం నాటిన గులాబీ మొక్క, పసుపుపచ్చ రంగు పూలతో తోటంతా సువాసనలు వెదజల్లుతుంది.

మందార చెట్టు దగ్గరకి వెళ్ళింది రచిత. ఆకుపచ్చ దేవతకి ఎర్రని కుంకుమబొట్లు పెట్టినట్టుగా చెట్టంతా విరగబూశాయి మందారాలు.

గోడ మీదుగా వాలివున్న కొమ్మని అందుకోవడానికి మునివేళ్ళ మీద నిలబడి ప్రయత్నిస్తూ వుంది.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ అప్పుడే అటుగా వచ్చిన అభీ ఒక్క క్షణం చిత్తరువులా నిలబడిపోయాడు.

నల్లటి నేలమీద పచ్చటి ఆమె పాదాలు.

చీరకొంగు నడుముకి దోపి కొమ్మని అందుకోవడానికి పూలచెండులా సాగుతూ వుంటే, ఒంటినిండా పూసిన అందాలు ఒక్కసారిగా కనువిందు చేశాయి.

కావ్యాల్లోని ప్రబంధనాయికలా ముగ్ధమనోహరంగా కనిపించిందామె. దోసిలినిండా పూలతో వెనక్కి తిరిగిన రచితకి అతని చూపులు పట్టుబడ్డాయి.

హఠాత్తుగా గుర్తుకు వచ్చినట్టుగా "ఐ విల్ కాల్ యూ లేటర్" అంటూ ఫోన్ కట్ చేశాడు.

"ఏమిటి? యివాళ విశేషం? కృష్ణాష్టమి పండుగా?"

రచిత పకపకా నవ్వింది.

"కృష్ణాష్టమి, పోయిన్నెల్లోనే అయిపోయింది. ఆ తర్వాత వచ్చే వినాయకచవితి కూడా ఈ మధ్యనే వెళ్ళిపోయింది..."

అంటూ, వంట యింటి గుమ్మంలోకి అడుగుపెడుతూనే, మంగమ్మ గొంతు వినిపించింది.

"ఇవాళ మా రచిత పుట్టినరోజు కాస్త పాయసం తీసుకో మంగమ్మా!" అనసూయమ్మ అంటూ వుంది.

"ఓ...అదా సంగతి..." అభీ నవ్వుతూ రచిత మొహంలోకి చూశాడు. పట్టుచీరలో నిండుగా రచిత, పక్కనే నిలబడి నవ్వుతూ మాట్లాడుతున్న ఆజానుబాహుడైన యువకుడు.

వెంటనే, మంగమ్మ "అనసూయమ్మగారూ మనవరాలికి గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళిచేశారా ఏం?" అనాలోచితంగా అనేసింది.

ఆ మాటలకు రచిత మొహం కోపంలో ఎర్రబడింది.

"మాట్లాడేముందు కాస్త ముందూ వెనుకా ఆలోచించి మాట్లాడండి మంగమ్మగారు" విసురుగా అనేసి వెళ్ళిపోయింది.

"నాకేం తెలుసు. పెద్దదాన్ని పొరపాటు పడ్డానే అనుకో. అంత కోపమా? అయినా, ఆడపిల్లలకు అంత కోపం పనికిరాదు, చెబుతున్నా గుర్తుంచుకో" వుడుక్కుంటూ అంది.

రచిత నుంచి సమాధానం రాలేదు.

"చిన్నపిల్ల తెలియక అంది. నువ్వేం మనసులో పెట్టుకోకు. ఎలాగూ నీ నోటితో అన్నావుగా మా రచితకి ఎక్కడైనా మంచి సంబంధాలు వుంటే చెప్పు" అనసూయమ్మ సర్ది చెబుతూ అంది.

"అలాగేలే"

"యింతకీ ఈ అబ్బాయి ఎవరు?" అభినవ్‌ని ఎగాదిగా చూస్తూ అంది.

"మా బంధువుల అబ్బాయిలే. హైదరాబాదులో పని వుండి వచ్చాడు."

"ఇంతకు మునుపెన్నడూ దుర్గాపురంలో చూసినట్టులేదే" మంగమం వదిలేటట్టు లేదు.

"ఇతను దుర్గాపురం రాలేదెప్పుడూ. వాళ్ళది మద్రాసు." అనసూయమ్మ అబద్ధం చెబుతున్నట్టు ఆవిడ మొహం చూస్తేనే అర్థం అయిపోతుంది.

కానీ మంగమ్మ పాయసం తింటూ పట్టించుకోలేదు. "ఇంతకీ ఈ అబ్బాయికి పెళ్ళయ్యిందా?" మంగమ్మ ప్రశ్నల పరంపర ఆపలేదు.

"ఆ... అయ్యిందండీ. ఇద్దరు పిల్లలు కూడా. మద్రాసులోనే వుంటే పిల్లలకి బొత్తిగా తెలుగు రావడంలేదని, హైదరాబాదు మారదామని యిక్కడ ఉద్యోగం వెతుక్కోవడానికి వచ్చాను." అభి ముసిముసిగా నవ్వుతూ అన్నాడు.

"ఓహో.. అలాగా?" అంటూ తలాడించింది.

ఆవిడ యింకో ప్రశ్న అడిగేలోపే అభి అక్కడ్నుంచి గబగబా వెళ్ళిపోయాడు. మంగమ్మ కాస్సేపు కూర్చుని, అవసరమైనవి, అనవసరమైనవే మాట్లాడి వెళ్ళిపోయింది.

❦❦❦

అనసూయమ్మ పూరీలు వత్తుతుంటే, రచిత వాటిని చకచకా నూనెలో వేసి వేయించింది.

పదిగంటలకల్లా, అభి సూట్ వేసుకుని తయారై కిందికి వచ్చాడు.

"బహుశా యివాళ మీటింగ్ ఏదైనా వుండివుంటుంది" ట్రిమ్‌గా తయారై వచ్చిన అతన్ని చూస్తూ అనుకుంది.

"సమయానికి వచ్చావు. రా తిందువుగానీ" కూర, పూరీలు ప్లేటులో వడ్డిస్తూ అంది అనసూయమ్మ.

అతను ఏదో మాట్లాడాలన్నట్టు వంటగది గుమ్మం దగ్గరే నిలుచున్నాడు.

అనసూయమ్మ టిఫిన్ ప్లేటు చేతికిచ్చింది.

"మామ్మగారూ! నేను వుండడంవల్ల మీకింత యిబ్బందిగా వుంటుందని అనుకోలేదు. యివాళ సాయంత్రమే నేను వెళ్ళిపోతాను. " సీరియస్‌గా చెప్పాడు.

"ఆ మంగమ్మ మాటలకేనా? నువ్వు అవేమీ పట్టించుకోకు. ఆవిడమాట తీరే అంత. నీకు వెళ్ళాలని వుంటే వెళ్ళు. అంతేకానీ, ఎవరో ఏదో అన్నారని మాత్రం కాదు. అలా చేస్తే నాకు బాధ కలుగుతుంది గట్టిగానే చెప్పింది అనసూయమ్మ.

అతను సంకోచిస్తూనే, నెమ్మదైన స్వరంతో చెప్పటం మొదలుపెట్టాడు. "నేను తప్పు చేశానో, ఒప్పు చేశానో తెలియదు మామ్మా. మామయ్యతో గొడవపడ్డాను. ఆ రాత్రి తాగి వచ్చి మీ యింట్లో అల్లరి చేశాను. అయినా, మీరెంతో ఆదరించారు. అసహ్యించుకోకుండా సేవలు చేశారు. ఇంత మంచి మనసున్న వాళ్ళని నేను ఎక్కడా చూడలేదు.

మీ యింట్లో వుంటేనే నాకు ప్రశాంతత అనిపించి వచ్చాను, కానీ, నావల్ల మీకెలాంటి సమస్యలు వస్తాయో అని ఆలోచించలేకపోయాను.

ఇక నేను మామయ్య వాళ్ళింటికి వెళ్ళదలచుకోలేదు వేరే యిల్లు చూసుకుని వెళ్ళిపోతాను."

ఆ మాటలు వింటూనే అనసూయమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నీ యిష్టం వచ్చినన్నాళ్ళు యిక్కడ వుండొచ్చు అభీ. ఎవరో ఏదో అన్నారని, నువ్వేమీ అనుకోవక్కర్లేదు. కాకపోతే, ఒకమాట చెబుతాను. "నీరెప్పుడూ పల్లానికే పారుతుంది" ఎంతకాదన్నా ఆయన నీ మేనమామ. ఆయనకి నీమీద అభిమానం వుండకుండా పోదు. అది గుర్తుంచుకో" నెమ్మదిగా చెప్పింది.

అభినవ్ ఒక్క క్షణం మౌనంగా వున్నాడు.

పైకి మామూలుగా కనిపిస్తూ వున్నా మనసులో యింతగా మథనపడుతున్నాడని అర్థం అయ్యింది రచితకి.

"అమ్మమ్మా పూరీలు తినడానికేనా లేకపోతే ఫోటో తీసి ఫేస్‌బుక్‌లో పెట్టుకోవడానికా..." వాతావరణాన్ని తేలిక చేయడం కోసం అంది.

అభీ నవ్వి, టిఫిన్ ప్లేటు చేతిలోకి తీసుకున్నాడు.

రచిత త్వరగా పట్టుచీర మార్చి కొత్త చుడీదార్ వేసుకుని వచ్చింది.

"వస్తాను. మామ్మగారు" వెళ్ళబోతూ అనసూయమ్మని దగ్గరకు తీసుకున్నాడు.

"ఓహో... అమ్మమ్మ నీకు పర్మినెంటుగా పడిపోయింది" రచిత నవ్వుతూ అంది. అభీ కూడా నవ్వాడు.

"పద. నిన్ను మీ ఆఫీసు దగ్గర డ్రాప్ చేసి వెళతాను."

రచిత బుద్ధిగా తల వూపి, "వస్తాను అమ్మమ్మా!" అని చెప్పి, అతని వెంట నడిచింది.

"ఆరోజు రాత్రి మరీ అసహ్యంగా ప్రవర్తించానా?" కారులో కూర్చుంటూనే అడిగాడు రచితని.

"లేదు. అసహ్యంగా కాదు కానీ, మంచి ఎంటర్‌టయినింగ్‌గా వుంది" అంది నవ్వుతూ.

"గుడ్. అయితే నేను నవ్వించగలనన్నమాట."

కారు చౌరస్తా దాటి ముందుకు పోతూ వుంది.

"నేను బరస్ట్ అవడానికో కారణం వుంది. కానీ, బ్యాడ్‌లక్ ఏమిటంటే నా మోస్ట్ ఎంబరాసింగ్ మూమెంట్స్ అన్నీ రికార్డ్ అయ్యి టెలికాస్ట్ అయ్యాయి. తల్చుకుంటే ఒక్కోసారి సిగ్గుగా వుంటుంది. నవ్వూ వస్తుంది."

రచితకి ఏమి చెప్పాలో అర్థంగాక మౌనం వహించింది. "ఇవాళ షెరోనా టెక్ వాళ్ళతో అగ్రిమెంట్స్ రాసుకోబోతున్నాను. అన్నీ కరెక్ట్‌గా అయివుంటే దీన్ని డెవలప్ చేసి పి.కె గ్రూప్స్‌లో కలపాలని అయిడియా. యిప్పుడు రెండు మూడు స్టార్టప్ కంపెనీలను కలిపితే రన్ చేయాలని ఆలోచిస్తున్నాను." చెప్పాడు.

"ఆల్ ద బెస్ట్" చిరునవ్వుతో చెప్పింది.

"ఎప్పుడూ బుర్రలో ఒక ఛానెల్ బిజినెస్ గురించే ఆలోచిస్తూ వుంటుంది కాబోలు."

అభినవ్‌ని ఆఫీసులో మొదటిసారి చూసిన క్షణం జ్ఞాపకానికి వచ్చింది. మేనేజర్‌ని, సెక్రటరీనీ పరుగులు తీయిస్తూ ఎప్పుడూ బిజీగా వుండేవాడు.

అప్పుడూ, యిప్పుడూ పనిలో అదే శ్రద్ధ. అదే అంకితభావం.

"ఏంటీ సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?"

"ఏమీలేదు" నవ్వుతూ తల అడ్డంగా తిప్పించి.

కారు ఆఫీసు బిల్డింగ్ ముందు టర్నింగ్ తీసుకుని ఆగింది.

"థాంక్యూ ఫర్ ద రైడ్" చెప్పి కారు దిగబోయింది.

"ఒన్ మినిట్.."

ఏమిటన్నట్టు చూసింది.

"థాంక్యూ వెరీమచ్.. రచితా"

ఆమె చేతిమీద చేయి ఆనించి బరువుగా చెప్పాడు.

క్యూబికల్‌లో కూర్చున్నా రచిత ఆలోచనలు అభీ చుట్టూనే తిరగసాగాయి.

కారులో వస్తున్నప్పుడు అతను అన్న మాటలు.

"నా మోస్ట్ ఎంబరాసింగ్ మూమెంట్స్ రికార్డ్ అయ్యి, టెలికాస్ట్ అయ్యాయి"

ఎదుటివారు మనల్ని మంచివారుగా గుర్తించి నమ్మినప్పుడే, మనం ఎంత మంచివాళ్ళమో అది ఒకసారి ఆలోచిస్తాం.

రచిత వెంటనే సెల్‌ఫోన్ పాస్‌కోడ్ ఓపెన్ చేసింది.

అందులో రికార్డు అయిన వీడియో క్లిప్పింగ్‌ని చూసింది.

"పీకేయండి. పీకేయండి. పి.కె గ్రూప్స్ బోర్డులు కనిపిస్తే సోఫా మీద నిల్చుని తూలిపోతూ.. అభి"

రచిత పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

వెంటనే ఆ వీడియో క్లిప్‌ని డిలీట్ చేసేసింది.

ఒకొక్కసారి మనం కాజువల్‌గా చేసే పనులు, అవతలివారిని ఎంతో బాధపెడతాయి. ఒక మనిషి పడిపోతుంటే నవ్వడం లాంటిదే యిదికూడా.

"హలో.. ఏమిటో.. నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?" వసూ గొంతు విని సెల్‌ఫోన్ పక్కకి పెట్టింది.

"మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ద డే" వెనకాలే సాత్విక్ విష్ చేస్తూ వచ్చాడు.

"ఇవాళ బర్త్‌డే ట్రీట్ రచిత నుంచి" అన్నాడు ఉత్సాహంగా.

"సారీ సాత్విక్! నాకసలు పుట్టినరోజు ఆర్భాటంగా చేసుకునే అలవాటే లేదు."

"సరే అయితే నేనిస్తాను ట్రీట్. ఎలాగైనా తప్పదు యివాళ"

"హూ. సరే అయితే. మధ్యాహ్నం లంచ్ కామత్‌లో, నేనే యిప్పిస్తా"

"అలా రా.. దారికి."

వసుధ కూడా విష్ చేసి వెళ్ళిపోయింది.

ఒంటిగంట కొడుతూనే, సాత్విక్ కారులో హోటల్‌కి వెళ్ళారు ముగ్గురూ.

లంచ్ ఆర్డర్ యిచ్చాక, "యిప్పుడే వస్తాను" అంటూ వాష్ రూంకి వెళ్ళాడు సాత్విక్.

"రచీ సాత్విక్ నిన్న నాకు మ్యారేజ్ ప్రపోజల్ పెట్టాడు."

చెబుతున్నప్పుడు వసుధ బుగ్గలు ఎర్రబడ్డాయి.

"మీ యిద్దరూ చీటికీ మాటికీ కొట్టుకుంటున్నప్పుడే నాకు అనుమానం వచ్చింది" నవ్వుతూ అంది.

"నిన్న ఈవినింగ్ పిజ్జాహట్‌కి వెళదామన్నాడు. సరే అన్నాను. తీరా చూస్తే, సిటీ అవుట్ స్కర్ట్స్ దాటి నారసింగి దగ్గర కొండల్లోకి తీసుకెళ్ళాడు. కొండల మధ్య అస్తమిస్తున్న సూర్యుడు, మేఘాలు అడ్డుపడడంతో ట్విలైట్ అదేనే బంగారు రంగులో సూర్యకిరణాలు చుట్టూ పరుచుకున్నాయి. అది ఉదయమో, సాయంత్రమో కూడా తెలియలేదు. బొమ్మలాగా చూస్తూ నిలుచుండిపోయాను. అప్పుడు ప్రపోజ్ చేశాడు. ఇట్‌వాజ్ సో రొమాంటిక్"

చెంపకి చేయి ఆనించుకుని చెబుతూ వుంటే వసుధ మొహంలో వింత కాంతి.

"నీకు యిష్టమేనని చెప్పావా?"

"**వెంటనే చెప్పేయాలనిపించింది.** కానీ, తొందరపడలేదు. నాకు కొంచెం టైం కావాలని చెప్పాను. "

సాత్విక్ రెస్ట్‌రూం నుంచి రావడంతో "ఇదంతా నీకు చెప్పానని అప్పుడే చెప్పకు" చిన్నగా రచితతో అంది.

"ఇక్కడ రసగుల్లాలు బావుంటాయి. ట్రై చేద్దామా" సాత్విక్ అన్నాడు.

"ఓ.. యస్. బిల్లు నువ్వు కడతానంటే ఆర్డర్ చెయ్యి" వెక్కిరింతగా నవ్వుతూ అంది వసూ.

ఆర్డర్ చేసిన ఐటమ్స్ అన్నీ వచ్చాయి.

సాత్విక్ అన్న ప్రతిమాటకీ, కొంటెగా జవాబిస్తూ అల్లరి చేస్తూ వుంది వసుధ. "చూడు అక్కడ బ్లూకలర్ టాప్‌లో వున్నది రమ్య కదూ" అంది దూర్మగా చేయి చూపిస్తూ.

సాత్విక్ అటువైపుకి చూశాడు.

"ఇంతకీ ఎవరా రమ్య..?"

"ఓ... మరీ చెప్పకు. నీ పాత టీంలో ఎనెలిటిక్స్ మీద వర్క్ చేసింది. నువ్వు అమ్మాయిల్ని మర్చిపోయావంటే నేను నమ్మను."

"ఏమో గుర్తురావడంలేదు." అని నిట్టూర్చి ప్లేటు వైపుకి చూసేసరికి, అందులో యింకో పెద్ద గుట్ట నూడిల్స్ కనిపించాయి.

"ఇప్పుడర్థమైంది సడన్‌గా లేని రమ్య ఎలా పుట్టుకొచ్చిందో... నీ ప్లేట్‌లో నూడిల్స్ అన్నీ నా ప్లేట్‌లో వేశావు కదూ"

వసుధ కిలకిలా నవ్వింది.

ఇద్దరూ అలా సరదాగా పోట్లాడుకుంటూ వుంటే, రచితకి ముచ్చటగా అనిపించింది.

"అభీతో పెళ్ళయ్యిందా?" అని మంగమ్మ అన్న మాటలు గుర్తుకువచ్చాయి. అసందర్భంగా అనిపించి కోపం తెప్పించినా, ఆ వూహ మనసుకి గిలిగింతలు పెట్టినట్టయ్యింది.

రచిత పుట్టినరోజునాడు గుడికి వెళ్ళడం అలవాటు.

అనసూయమ్మని తీసుకుని గుడికి వెడదామని సాయంకాలం పెందలాడే ఆఫీసు నుంచి యింటికి వచ్చింది.

ఆటో దిగి లోపలికి వస్తుంటే, తెలిసిన గొంతుక వినిపించింది. నాలుగడుగులు వేశాక మరింత స్పష్టంగా వినిపించిన మాటల్ని బట్టి వచ్చిన వ్యక్తి ఎవరో అర్థం అయ్యింది.

రచిత కనుబొమలు ముడిపడ్డాయి. కోపంగా లోపలికి దూసుకువచ్చింది. రామారావు సోఫాలో కూర్చుని, కాఫీ తాగుతూ అనసూయమ్మతో మాట్లాడుతున్నాడు. టీపాయ్ మీద స్వీట్‌పాకెట్ పెట్టివుంది.

"లేవండి.. ముందు వెళ్ళండి యిక్కడినుంచి" ఆవేశంగా అరిచింది.

రామారావు గబుక్కున లేచి నిలబడ్డాడు.

"అదికాదు అమ్మలు యివ్వాళ నీ పుట్టినరోజని" అనసూయమ్మ చెప్పబోయింది.

"నా పుట్టినరోజని ఈరోజే గుర్తొచ్చిందా?" కటువుగా అంది. రామారావు మౌనంగా తలదించుకున్నాడు.

"ఎంతైనా ఆయన నీకు నాన్న" అనసూయమ్మ గట్టిగానే చెప్పింది.

"ప్లీజ్ అమ్మమ్మా ఆయన్నిక్కడ నుండి వెళ్ళమను" కోపంగా అని గబగబా బెడ్‌రూములోకి వెళ్ళి తలుపేసుకుంది.

రామారావు మారు మాట్లాడకుండా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

అనసూయమ్మ స్వీట్‌బాక్స్ తీసి చెత్తబుట్టలో పారేసింది.

బెడ్‌రూంలో రచిత దిండులో తలదూర్చి ఎక్కిళ్ళు పెట్టి ఏడిస్తే అనసూయమ్మ మౌనంగా మనసులోనే కన్నీరు కార్చింది.

పాత జ్ఞాపకాలన్నీ ముళ్ళులా మారి మనసుకు గుచ్చుకున్నాయి.

రచిత తల్లి చనిపోయాక, రామారావు దుర్గపురానికి రావడం, అప్పటికే ఆయనకు ఎవరితోనో సంబంధం వుందని, ఆ గొడవల వల్లే తల్లి ఆత్మహత్య చేసుకుందని యిరుగూ-పొరుగూ చెప్పుకోవడం రచితకి గుర్తు.

తెలిసీ తెలియని వయసులోనే అమ్మమ్మతో వుండిపోతానని మంకుపట్టు పట్టింది.

చుట్టూ తన వయసు పిల్లలు అమ్మల దగ్గర గారాలు పోయేవాళ్ళు, ఆడపిల్లలు వయసుకి వచ్చినప్పుడు సమస్యలని తల్లులతో చెప్పుకునేవాళ్ళు.

"పాపం, రచితకి అమ్మలేదుగా" అని తోటివాళ్ళు అంటున్నా..

"తల్లిలేని పిల్ల" అని జాలి చూపించినా, రచితకి తండ్రి మీద కచ్చ రెట్టింపయ్యేది.

ఇంకాస్త, ఊహ తెలిశాక, భార్యని మోసగించడం అంటే ఎంత నీచమో అర్థమైంది. అప్పటినుంచే, రచిత "తండ్రి వద్దు" అనుకుంది.

అతన్ని చూస్తేనే అవన్నీ గుర్తుకు వస్తాయి.

రచిత చాలాసేపు వంటరిగా కూర్చుని ఏడ్చింది.

నెమ్మదిగా లేచి, వంటగదిలోకి వెళ్ళి కాఫీ పెట్టి, అనసూయమ్మ దగ్గరికి వచ్చింది.

"అమ్మమ్మా కొంచెం కాఫీ తాగు."

అనసూయమ్మ మొహం దిగులుతో కుంగిపోయినట్టుగా వుంది.

"నేను తప్పు చేశానా అమ్మమ్మా?" దగ్గర కూర్చుంటూ చిన్నపిల్లలా అడిగింది.

"లేదు మన ఖర్మ అలా కాలిదంతే."

రచిత మాట్లాడలేదు.

"నేను కాస్సేపు పడుకుంటాను అమ్మలు.. రెస్టు కావాలనిపిస్తుంది"

రెక్కపట్టుకుని అనసూయమ్మను గదిలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి హాల్లోకి వచ్చి కూర్చుంది.

ఇంట్లో రచిత, అనసూయమ్మ యిద్దరే వుంటారు. నిశ్శబ్దం వారికి అలవాటే. కానీ, ఈ నిశ్శబ్దం చాలా భయంకరంగా వుంది.

ఏడ్చి ఏడ్చి రెప్పలు బరువెక్కి వున్నాయేమో సోఫాలోనే వాలి నిద్రపోయింది. అలా ఎంతసేపు పడుకుందో తెలియదు.

కిటికీ నుంచి ఫ్లాష్ లైటు కళ్ళమీద పడగానే గబుక్కున లేచి కూర్చుంది.

టైం ఏడున్నర. బయట కారు ఆగిన చప్పుడైంది.

కాలింగ్‌బెల్ మోగితే అనసూయమ్మకి నిద్రాభంగం అని పరుగున వచ్చి తలుపు తీసింది.

గుమ్మంలో అభినవ్ పెద్ద పూలబొకే పట్టుకుని నిలబడ్డాడు. లోపలికి వస్తూనే, రచిత చేతిలో బొకే పెట్టి "హేపీ బర్త్‌డే" అని నవ్వుతూ విష్ చేశాడు.

ఆమె దాన్ని అందుకుని నిరాసక్తంగా సోఫాలో పడేసింది. అతనేదో మాట్లాడబోయి ఆమె మొహం చూసి ఆగిపోయాడు.

ఒక నిముషం పాటు, అక్కడే నిలబడి ఆమె నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో, మౌనంగా మేడమీద తన గదివైపుకు వెళ్ళాడు.

రచిత అనసూయమ్మ గదిలోకి వెళ్ళింది.

అనసూయమ్మ నిద్రలో వుంది. తలుపులు నెమ్మదిగా చేరవేసి, స్నానానికి బాత్‌రూంలోకి వెళ్ళింది.

షవర్‌లో నుంచి వెచ్చటి నీళ్ళు ఒంటిమీద పడుతుంటే, శరీరంతో బాటు మనసూ తేలికపడింది.

హఠాత్తుగా అప్పుడు గుర్తొచ్చింది, రచితకి "అభీ పెందలాడే యింటికి వచ్చాడు. డిన్నర్ బయటచేసి వుండడు. కనీసం బొకే యిచ్చినందుకు థాంక్స్ అయినా చెప్పి వుండాల్సింది." అని త్వరగా స్నానం ముగించింది.

తెల్లని కాటన్ లక్నో కుర్తా, పైజమా వేసుకుని తలదువ్వుకుంది. వంటగదిలోకి వెళ్ళి చకచకా దోసెలు వేసి, ప్లేట్లలో సర్ది, ట్రే పట్టుకుని మేడమీదకి వెళ్ళింది.

అభీ బాల్కనీలో కూర్చుని ఐపాడ్‌లో పాటలు వింటూ కూర్చుని వున్నాడు. ఫ్రెష్ అయి వచ్చినట్టుగా తేటగా వున్న అతని మొహమే చెబుతుంది.

ట్రే పట్టుకుని నిలబడ్డ రచితను చూసి, పక్కనున్న స్టూలుని ముందుకు జరిపాడు.

"థాంక్యూ" అంటూ స్టూలు మీద ట్రే, మంచినీళ్ళగ్లాసులు పెట్టి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

"థాంక్యూ.. ఫర్ ద బొకే టూ" అభీ కళ్ళలోకి చూస్తూ చెప్పింది.

"నో ప్రాబ్లం. ఇవ్వాళే కాంట్రాక్ట్ సైన్ చేశాను. ఇది సక్సెస్ అయితే, నీ బర్త్‌డే నాకు బాగా గుర్తుండిపోతుంది" నవ్వుతూ అన్నాడు.

వెన్నెల వెలుగులో అతని మొహం మరింత ప్రకాశవంతంగా కనిపించింది.

"కంగ్రాట్స్"

"నువ్వు ఎందుకో అప్‌సెట్‌గా వున్నావు. నీ పుట్టినరోజునాడు నిన్నంతగా బాధపెట్టిన విషయం ఏమిటో నాకు చెప్పాలి."

రచిత ఒక్క క్షణం తటపటాయించి, ధైర్యం కూడగట్టుకుని నెమ్మదిగా విషయం అంతా వివరించింది.

"అయామ్ సో సారీ! నేను అతిగా కల్పించుకుంటున్నాను అని అనుకోకపోతే ఒక్క విషయం చెబుతాను. నువ్వు మీ నాన్నను దోషి అంటున్నావు. కానీ, నీకోసం మీ అమ్మే అలా చేయకుండా ధైర్యంగా నిలబడి వుండాల్సింది అనిపిస్తుంది నాకు."

"నువ్వు చెప్పిందీ కరక్టే. మా అమ్మ, నాన్న పెట్టిన భాధల్ని ఎదిరించి నాకోసం బతికి వుండొచ్చు. ఆమె పిరికిది" రెప్పల చివరలదాకా వచ్చిన కన్నీటిని బలవంతంగా ఆపుకుంటూ అంది.

"మీ నాన్న మారిపోయి వుండవచ్చు. ఇప్పుడు నువ్వు కావాలి అనుకుంటున్నాడేమో?"

"ఇప్పుడే కాదు యిదివరకు కూడా చాలాసార్లే నాకోసం వచ్చాడు కానీ, నా పదేళ్ళ వయసులో నా మనసులో పడ్డ ముద్ర అలాగే వుంది. నాన్నతో వుండనని పట్టుబట్టాను.

ఆయన్ని చూస్తే ఒళ్ళంతా కాలిపోయి భయంకరంగా మారిపోయిన మా అమ్మ శవమే గుర్తొస్తుంది"

కళ్ళలో నుంచి జలజలా నీళ్ళు రాలాయి.

"ప్లీజ్ రచితా కంట్రోల్ యువర్ సెల్ఫ్" ఆమె రెండు చేతులను పట్టుకుని మృదువుగా చెప్పాడు.

"నాన్నతో వెళ్ళనన్నాను. చిన్నపిల్లనైనా అమ్మమ్మ నా మాట గౌరవించింది. అమ్మమ్మ తన చివరిరోజులు తాతయ్య కట్టించిన యింట్లోనే గడపాలనుకుంది. కానీ, నా బాధ్యత తీసుకుంది కాబట్టి, నా చదువుకోసం దుర్గాపురం వదిలిపెట్టింది. డబ్బు అవసరాల కోసం యింటినే అమ్మేసింది.

అమ్మమ్మలో వున్న ధైర్యంలో నాలుగోవంతు మా అమ్మలో వున్నా బావుండేది. నాన్న ఒకసారి నన్ను తీసుకెళతానని వచ్చాడు. అప్పుడు పెద్ద రాద్ధాంతమే జరిగింది. ఆరోజు ఆయనన్నమాట యిప్పటికీ నన్ను భయపెడుతూనే వుంటుంది.

ఈ ముసల్ది ఎన్నాళ్ళు బ్రతుకుతుంది? ఎప్పటికైనా నా దగ్గరకు రావాల్సిందే అని. అప్పట్నుంచీ నాకు భయం. నాన్న అన్నమాట నిజం కాకూడదు అని ఎన్ని దేవుళ్ళకు మొక్కానో.

ఆ మాట గుర్తొచ్చినప్పుడల్లా వణికిపోయేదాన్ని. చిన్నతనంలో అంత అభద్రతాభావానికి లోనయ్యాను. ఇప్పటికీ దేవుడికి దండం పెట్టుకుంటే అమ్మమ్మకి ఆరోగ్యం, ఆయుష్షు యివ్వమనే ప్రార్థిస్తాను. నాకు ఆమె తప్ప యింకెవ్వరూ లేరు. యేడాదికేడాదికి అమ్మమ్మ వయసు పెరుగుతుందనుకుంటేనే భయమేస్తుంది. ఆమెకేదన్నా అయితే నేను తట్టుకోలేను. నాకు ఎవ్వరూ లేరు" అప్పటిదాకా తెచ్చిపెట్టుకున్న బింకం కాస్తా కరిగిపోయి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"ప్లీజ్ రచితా" కుర్చీలో నుంచి లేచి, ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమె భుజాల చుట్టూ చెయ్యివేసి, లేపి దగ్గరకు తీసుకున్నాడు.

"జరిగిపోయినవన్నీ తవ్వుకుని బాధపడకు. ప్లీజ్" అంటూ చెంపలమీద నుంచి జారుతున్న కన్నీళ్ళను తుడిచాడు. ఆమెకూడా రెండు నిమిషాలపాటు మౌనంగా అతని చేతుల్లో ఒదిగిపోయింది.

"నీ భయం పోయేందుకు ఒక సలహా యివ్వనా?"

ఏమిటన్నట్టు ఎర్రబడ్డ మొహంతో అభీ కళ్ళలోకి చూసింది.

"ధైర్యం చేసి మీ నాన్నని ఫేస్ చెయ్యి. బాధని, వత్తిడిని మనసులో దాచుకోవడం కంటే, దాన్ని బయటపెట్టడమే వుత్తమం" తన అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని చెప్పాడు.

"ఇప్పుడు ఆయనకి పిల్లలు వున్నారు. నేను దగ్గరయ్యి వాళ్ళకి ఆయన చరిత్ర యిదీ అని గుర్తుచేయడం నాకు యిష్టంలేదు. కనీసం వాళ్ళనయినా తండ్రితో హాయిగా వుండనీ"

అభీ, ఒకసారి సంభ్రమంగా రచితవైపు చూశాడు.

"నువ్వు యింత గొప్పగా ఆలోచిస్తావని వూహించనేలేదు. నీది నిజంగా మంచి మనసు" మనస్ఫూర్తిగా అన్నాడామాట.

"లేదు అభీ అంత గొప్పగా అనుకోకు. నేనే అంత గొప్పదాన్నైతే మా నాన్నని క్షమించగలిగేదాన్ని."

"దీనికి కారణం చెప్పనా?"

"....."

"నీకు వుద్యోగం వుంది. యిండిపెండెంట్‌గా వున్నావు. అయినా, నీలో యిన్‌సెక్యూరిటీ పోలేదు. అమ్మమ్మ లేకపోతే ఎలా? అనే భయం నీలో గూడుకట్టుకుని పోయి వుంది. నీ జీవితంలో నీకంటూ ఒక తోడు, పిల్లలు వుండి ఆనందంగా వుంటే, వాస్తవాలని యాక్సెప్ట్ చేసే బలం నీకు వస్తుంది. మీ నాన్ననీ క్షమించగలుగుతావు."

రచిత అతను చెప్పేది శ్రద్ధగా వింది. అతను చెప్పింది అసంబద్ధంగా అనిపించలేదు.

ఇద్దరి మధ్యా మౌనం. ఆ మౌనంలో కలతపడ్డ మనసుని శాంతపరిచే ప్రయత్నం చేసింది.

ఆకాశంలో నక్షత్రాల కాంతిని వెన్నెల వెలుగు కప్పేసింది.

టేబుల్ మీద ప్లేట్లో దోశెలు అలాగే వున్నాయి.

"అయామ్ సారీ.. డిన్నర్ తెచ్చి, తిననీయకుండా అనవసర ప్రసంగం చేశాను" అంది నొచ్చుకుంటూ.

అభీ ఐపాడ్‌కి వున్న యియర్‌ఫోన్స్ తీసేసి, ఇళయరాజా పాటలు ప్లే చేశాడు. చట్నీ వడ్డించి ప్లేటు చేతికందించింది రచిత. వెన్నెల్లో చెట్లనీడలు బాల్కనీలో చిత్రమైన రంగవల్లుల్లా పరుచుకుని వున్నాయి.

కాలే కడుపులు చల్లబడడంతో చల్లనిగాలి, చిక్కటి వెన్నెల అనుభవంలోకి వచ్చాయి.

ప్లేట్లు తిరిగి ట్రేలో పెట్టుకుని, క్రిందకి వెళ్ళడానికి సిద్ధమైంది రచిత.

"ఒక్క నిముషం" అభీ పిలిచాడు.

ఏమిటన్నట్టు వెనక్కి తిరిగి చూసింది.

"మన మధ్య యిగోలు లేవని నమ్ముతున్నాను. ఐ థింక్ ఉయ్ మేక్ గుడ్ ఫ్రెండ్స్"

"యస్.. మనం ఫ్రెండ్స్"

సమ్మోహనంగా నవ్వి క్రిందకు వెళ్ళిపోయింది.

"అమ్మమ్మా, నేను వసూ వాళ్ళింటిదాకా వెళ్ళొస్తాను" హాల్లో నుంచే కేకపెట్టింది రచిత.

"అమ్మలూ నీతో కొంచెం మాట్లాడాలి కూర్చో" అంటూ వచ్చింది అనసూయమ్మ.

"కూర్చుని మాట్లాడాలి అంటే, అదేదో సీరియస్ విషయమే అయి వుంటుంది చెప్పు" అంది సోఫాలో కూర్చుంటూ.

"నువ్వు కోపం తెచ్చుకోకుండా వినాలమ్మా!" అనునయంగా అంది. ముందురోజు జరిగిన డ్రామాకి అమ్మమ్మని బాధపెట్టినందుకూ రచిత సిగ్గుపడుతూ వుంది.

ఇవాళ ఏ విషయమైనా కాస్త సహనంతో వ్యవహరించాలని ముందే ఓ నిశ్చయానికి వచ్చింది.

"నిన్న మీ నాన్న వచ్చాడు కదా"

రచిత మొహంలో భావాల్ని చదువుతూ నెమ్మదిగా చెప్పసాగింది.

"అతను క్యాన్సరుతో బాధపడుతున్నాడు. గొంతు భాగంలో సర్జరీ చేసి, ఏదో గ్రంథిట దాన్ని తీసేస్తారు అని చెప్పాడు.

కిమీనో, కిమోనో అది కూడా చేయాలట పిల్లలు యిద్దరూ యింకా చిన్నవాళ్ళు. మానసికంగా బాగా కుంగిపోయాడమ్మా. బాధ్యతలు నెత్తిమీద వుండగా, యిలాంటి ఉపద్రవాలు వచ్చి నెత్తిమీద పడితే ఎంతటివాళ్ళైనా కుంగిపోతారు."

అనసూయమ్మ ఆర్ద్రత నిండిన గొంతుతో అంది.

తండ్రి ఈ మధ్య తరచుగా తనకోసం రావడానికి కారణం అర్థమైంది. అన్నింటికన్నా ఆశ్చర్యపరిచిన విషయం ఆయన బాధలకి అనసూయమ్మ అంతలా చలించి కన్నీరు పెట్టుకోవడం.

కడుపున పుట్టిన బిడ్డో, తోడబుట్టినవాడో కనీసం దూరపుబంధువు కూడా కాదు. కూతుర్ని చేసుకున్నాడన్న ఒక్క కారణం తప్ప. ఇంకే విధమైన సంబంధం లేదు. ఆ సంబంధం కూడా ఆరని గాయాన్నే చేసింది.

కూతురి చావుకి కారణమైన వ్యక్తిని ఎలా మన్నించగలుగుతుంది? అది మంచితనమో, ఎదుటివారి కష్టాలకి కరిగిపోయే బలహీనత అర్థంకాలేదు.

"అయితే, యిప్పుడేం చేయమంటావు? ఆయన కావాలని చేసుకున్న భార్య వుంది, పిల్లలు వున్నారు" పొడిగా అంది.

"మనిషికి చావుకి దగ్గరవుతున్నప్పుడే అహం నశిస్తుంది. అప్పటిదాకా, నాకు ఎదురులేదు అనుకున్నవాడికైనా, చేసిన తప్పులు మనసుని ముల్లులా గుచ్చుకుని బాధపెడతాయి. ఎన్ని కాదన్నా, నువ్వు ఆయన కూతురివి. నీకు దగ్గరవ్వాలనుకుంటూ వుండొచ్చు.

అయిపోయిన విషయాల్ని పట్టుకుని వేలాడకుండా మీ నాన్నతో మాట్లాడుతూ వుండు. చనిపోయే ముందైనా కాస్త తప్పు చేశాననే భావం నుంచి బయటపడేయ్."

రచితకి అనసూయమ్మ చెప్పిన విషయం సారాంశం అర్థమైంది.

అహంకారంతో తప్పు, ఒప్పు తెలియకుండా ప్రవర్తించడం, చావు ఎదురైనప్పుడు హఠాత్తుగా తేగిన గిల్టీ ఫీలింగ్‌కి మందు వెతుక్కోవడం. ఇష్టం లేకపోయినా జాలితో మన్నించాలి.

లేకపోతే "కన్నతండ్రి మీద జాలి అన్నా లేదు కూతురికి" అని ఆడిపోసుకుంటారు.

రచితకి తండ్రి పట్ల కొంచెం కూడా సానుభూతి కలగలేదు. కానీ, కనీసం జాలిపడ్డట్టు నటించి సంతోషపెట్టాలని మాత్రం అనుకుంది.

"అభీ ఆవో ఆవో! చాలా రోజులైంది నిన్ను చూసి. మొన్న వచ్చి వెళ్ళావుట. నేను యింట్లోలేనప్పుడు" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది గురుప్రీత్.

"అభీ" అన్న పేరు వినగానే, గబగబా లివింగ్ రూంలోకి వచ్చింది శకుంతలాదేవి. అభినవ్, హరిప్రసాద్‌తో గొడవపడి యింట్లో నుంచి వెళ్ళిపోయినప్పటి నుంచి శకుంతలాదేవి అక్కడే వుంది. పరిస్థితులు చక్కబడేదాకా కదలకూడదని నిర్ణయించుకుంది కూడా.

"మామాజీ గుస్సా తగ్గిపోయిందిలే. ఎన్ని రోజులని కోపంగా వుంటారు? అభిక్ ఛోటా బచ్చాహా ఏదో ఫ్రస్టేషన్‌లో మాట్లాడవు. అంతేకదా! ఆజ్‌కల్ సబ్ కుఛ్ చలతాహై. అసలు మీడియా వల్లే విషయం అంత పెద్దది అయ్యింది. జో హోగయా.. సో హోగయా." గురుప్రీత్ అంది.

మళ్ళీ గుర్రాన్ని తెచ్చి గాటన కట్టేసుకోవడానికి మాట్లాడుతున్న మాటలు అని అభీ సులభంగానే గ్రహించాడు. సమస్యకి శాశ్వత పరిష్కారం దొరికేవరకు తిరిగి ఆ వలయంలో పడే ఉద్దేశ్యం లేదతనికి.

"అమ్మా నువ్వు బెజవాడ ఎప్పుడు వెళుతున్నావు?" తల్లిని అడిగాడు. శకుంతలాదేవిని మాట్లాడనీయకుండా, గురుప్రీత్ అడ్డుపడింది.

"అరె.. జల్దీ ఏముంది? మీ మామాజీ గుస్సా తగ్గిపోయింది. నువ్వు ఒక్కసారి మాట్లాడితే అంతా ఓ.కే అయిపోతుంది. తిరిగి నువ్వు ఈ యింటికి వచ్చాకే అమ్మ వెళతారు" చెప్పింది.

అభినవ్ సంభాషణని పొడిగించకుండా మౌనంగా వుండిపోయాడు. శకుంతలాదేవి కొడుకు ఎలా వున్నాడో, ఏం తింటున్నాడో అని కుశలప్రశ్నలు వేయాలనుకున్నా, గురుప్రీత్ అక్కడ వుండడంవల్ల మౌనంగా వుందని గ్రహించాడు అభి.

గురుప్రీత్, శకుంతల యిద్దరూ ఒక వయసువారే. గురుప్రీత్ సన్నగా చురుగ్గా, చలాకీగా వుంటుంది. ఆధునికమైన అలంకరణ, వస్త్రధారణతో ముప్పై అయిదేళ్ళ వ్యక్తిలా వుంటుంది.

చుట్టుపక్కల వారిని తన వాక్చాతుర్యంతో కట్టిపడేసి, లౌక్యంగా పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోగల నేర్పు ఆమె సొంతం. హరిప్రసాద్ చేసే ప్రతిపని వెనుక, ఆలోచన వెనుక ఆమె వుంటుంది.

శకుంతలాదేవి అందుకు పూర్తిగా భిన్నం. పెద్ద తరహా వస్త్రధారణ, నెరసిన జుట్టుతో మరింత వయసు మీద పడ్డట్టు కనిపిస్తుంది. విధి తీసిన దెబ్బ నుంచి కోలుకోలేకపోయినట్టుగా వ్యవహరిస్తూ వుంటుంది. సమర్థత, ఆత్మవిశ్వాసం లేకపోవడంతో అన్నీ అన్నగారి

చేతిలో పెట్టి కూర్చుంది. అంత ఐశ్వర్యానికి అధికారిణి అయినా పరాధీనత, దీనత్వం. గురుప్రీత్‌లో ఉన్న ఆత్మవిశ్వాసం ఆమెలో కనిపించదు.

అంతలోనే సియానా కూడా వచ్చింది.

మోకాళ్ళదాకా వున్న నల్లని స్కర్ట్, దానిపైన సన్నని పూవుల డిజైన్ వున్న గ్రీన్‌కలర్ స్లీవ్‌లెస్ టాప్. వేసుకుని వుంది.

ఫ్యాషన్ విషయంలో ఎప్పుడూ అప్‌డేట్‌గా వుంటుందామె. "ఈ నాలుగురోజుల్లో ఒక్కసారన్నా ఆమె ఎలావున్నాడో చూడడానికి రాలేదు. కనీసం ఒక్క ఫోనన్నా చేయలేదన్న" విషయం గుర్తొచ్చి బాధగా అనిపించింది అభీకి.

హైహీల్సు టకటకలాడిస్తూ ఒకసారి అభీ వంక కోపంగా చూసి, సెల్‌లో మాట్లాడుతూ మేడమీదకి వెళ్ళిపోయింది.

అంతకు ముందే గురుప్రీత్, సియానీల కళ్ళు సైగలు చేసుకోవడం అభీ దృష్టిని దాటిపోలేదు.

గుడ్‌కాప్ బాడ్ కాప్ స్ట్రాటజీ.. తల్లి ప్రేమగా ఆదరిస్తున్నట్టు మాట్లాడితే, కూతురు బింకంగా బెట్టు చేసి లొంగదీసుకోవాలి. అందరికీ అణిగిమణిగి వుండేవాడు కావాలి. మొగుడు, అల్లుడు తమ శక్తిసామర్థ్యాలని బట్టి అవతలివాళ్ళని లొంగదీసుకోవాలని ప్రయత్నం. దానికోసం, అవతలివాళ్ళ బలహీనతలు, అవసరాలు ఆసరాగా చేసుకోవడం. ప్రేమ, అభిమానంలాంటివి కూడా యిటువంటివారికి టూల్స్‌గా ఉపయోగిస్తాయి.

సియానా నిర్లక్ష్యంలో "నన్ను కాదని వెళ్ళిపోయావుగా.." అనే అర్థం వుంది. ఈ విషయాలు అర్థం కాకముందు ఎంత అమాయకంగా సియానని ప్రేమించాడో ఒక్కసారి స్ఫురణకు రాగానే అభీ మనసు అదోలా అయిపోయింది.

"ఏంటలా ఆలోచిస్తూ కూర్చున్నావు అభీ. రా మీ మామాజీతో మాట్లాడు" చనువుగా, అభినవ్ చెయ్యిపట్టుకుని హరిప్రసాద్ గదికి తీసుకువెళ్ళింది.

లోపల హరిప్రసాద్ లాప్‌టాప్‌లో ముఖ్యమైన వ్యవహారాలేవో చూసుకుంటున్నాడు.

"ఎలా వున్నారు మామయ్యా.." అభీ మామూలుగా మాట్లాడడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"మీరు మాట్లాడుకోండి. నేను చాయ్ పంపిస్తాను" అంటూ గురుప్రీత్ వెళ్ళింది.

హరిప్రసాద్ లాప్‌టాప్‌లో నుంచి తలపైకెత్తి అభినవ్ వంక చూశాడు.

"కొత్తగా స్టార్టప్ కంపెనీలకి ఫండింగ్ చేస్తున్నావట" నేరుగా అడిగాడు.

"అవును నెట్‌వర్క్స్‌లోకి వెళ్ళాలని వుంది"

"హూ!" తలపంకించి అభీవైపు సాలోచనగా చూశాడు.

"నీకు ఫండింగ్‌కీ, డబ్బు కావాలంటే, నా సాయం తీసుకోవచ్చు"

"ప్రస్తుతానికి అవసరంలేదు.. అవసరమయినప్పుడు తప్పకుండా మీ మాట గుర్తుంచుకుంటాను."

"నీ అయిడియా గురించి తర్వాత ఆలోచించాను. బానే వుంది. ఎలాగూ నువ్వు మొదలుపెట్టావుగా వర్కవుట్ అయ్యాక చూద్దాం. నీకు డబ్బు కావాలంటే నేనూ పెట్టుబడి పార్ట్‌నర్‌గా చేరతాను. ఈ ప్రపోజల్‌ని నీ మైండ్‌లో పెట్టుకో" క్లుప్తంగా, పొడిగా చెప్పాడు.

ఆయన చెప్పిన వాక్యాలన్నింటినీ కలిపి చూస్తే, అభినవ్‌కి విషయం అర్థమైంది. "ఇప్పుడు, ఆయన ఆలోచనా విధానాన్ని మార్చుకున్నాడు. కానీ, అది నమ్మకం ఏర్పడడం వల్లకాదు."

"అలాగే మామయ్యా"

ఇంతలో హరిప్రసాద్ సెల్‌ఫోన్ మోగింది.

ఒక నిముషం తేడాతో అభినవ్ సెల్ కూడా రింగయ్యింది.

ఇద్దరికీ అందిన సమాచారం కూడా ఒక్కటే. విషయం విన్న హరిప్రసాద్ డీలా పడిపోయాడు.

"మోహన్ అంకుల్‌కి స్ట్రోక్ వచ్చిందట. చేయి, కాలుతోపాటు మాట కూడా పడిపోయింది అని చెప్పారు" అభినవ్ విచారంగా అన్నాడు.

అప్పటికే, రెండుసార్లు కాలింగ్ బెల్ నొక్కింది రచిత. మరి, రెండు నిముషాలు ఎదురు చూసి వెనక్కి తిరగబోయేంతలో తలుపు తెరుచుకుంది.

నలభై, నలభై అయిదేళ్ళు వయసున్నావిడ తలుపు తీసింది.

తెల్ల చుడీదార్, దానిపైన ఎర్రదుప్పట్టా, యింటో వాడుకగా వేసుకునే బట్టల్లా వున్నాయి. రెండు చేతులకి లావుగా, కంకణాల్లాంటి గాజులు వేసుకుని వుంది. హెన్నాతో ఎర్రబారిన జుట్టు, తెల్లగా ఉన్నా మందంగా మొద్దుబారినట్టున్న చర్మం. రచిత ఆమెను సులభంగానే పోల్చుకుంది. మాలతి రామారావు ప్రస్తుత భార్య.. పిన్ని..

"మీరు..?" అడిగిందామె.

"నా పేరు రచిత"

చెప్పగానే ఆమె ముందుగా ఆశ్చర్యపోయింది.

"రామ్మా..రా సమయానికి ఆయన యింట్లో లేరు. నువ్వు వచ్చావని తెలిస్తే చాలా సంతోషించేవారు" అంటూ ఆదరంగా ఆహ్వానించింది.

ఆరేళ్ళపాప టేబుల్ పక్కగా నిలబడి, సోఫాలో కూర్చున్న కొత్తవ్యక్తిని గమనిస్తూ వుంది. బొమ్మలు గీసుకుంటూ ఉంది కాబోలు గౌనుకి, చేతులకీ అక్కడక్కడా స్కెచ్ పెన్ గీతలు ఉన్నాయి.

రెండు పిలకలు తెల్లటి బుగ్గలు చూడడానికి వాళ్ళమ్మలుగానే వుంది.

"తన్నూ.. ఇలారా! ఈమె నీ అక్కయ్య పేరు రచిత" రచిత పాపకోసం తెచ్చిన వస్తువులు చూపించింది. అయినా, దగ్గరికి రాకుండా దూరంగా నిలబడి రచితను చూస్తూ వుంది.

"కొత్త వాళ్ళని చూస్తే తొందరగా దగ్గరకు రాదు "మొహమాటంగా చెప్పింది మాలతి.

"అమ్మా.. ఆకలేస్తుంది.."

ధనాధనా అడుగులు వేసుకుంటూ రాకెట్‌లా వచ్చాడు పన్నెండేళ్ళ పిల్లవాడు. ఆటలాడి వస్తున్నాడులా వుంది. ఒంటి నిండా చెమటలు, చేతిలో క్రికెట్ బ్యాట్.

"సుధీర్ ..ఈవిడ మీ అక్కయ్య రచిత" మాలతి పరిచయం చేసింది. సుధీర్ ఒకసారి రచితకేసి పరీక్షగా చూసి "హలో" అని చెప్పి లోపలికి వెళ్ళాడు.

"అమ్మా! ఆకలేస్తుంది" ఇంకోసారి కేక వినిపించడంతో మాలతి లేచి లోపలికి వెళ్ళింది.

రచిత హాలంతా ఒకసారి కలియజూసింది. గోడలకి ఫ్రేమ్ చేసిన సీనరీలు, ఫోటోలు తగిలించివున్నాయి.

వాటిల్లో ఒక ఫోటో మీద రచిత దృష్టి నిలిచిపోయింది. అవి రామారావు, మాలతి, సుధీర్ తన్మయిలతో తీయించుకున్న ఫోటో, అందరి మొహాల్లో ఆనందం కొట్టవచ్చినట్టు కనిపిస్తూవుంది.

రామారావు కుటుంబం అది. యిప్పుడు హఠాత్తుగా ఈ జబ్బు రావడం వల్ల కుటుంబంలో కొత్త సభ్యురాలిగా రావడం ఎందుకో రచితకి నచ్చలేదు.

పది నిముషాల తర్వాత టీ కప్పులతో వచ్చింది మాలతి.

మొదట ఫార్మల్గా మొదలుపెట్టి, రచిత గురించి ఆరాలు అడిగింది. రామారావుకి కాన్సరు ఎలా బైటపడిందో, ట్రీట్మెంట్కి ఏ హాస్పిటల్కి వెళ్ళాలనుకుంటున్నారో వరుసగా చెప్పుకొచ్చింది.

"నీకు అమ్మ లేకపోయినా, అమ్మమ్మ సాయంతో బాగానే పైకొచ్చావు. సాఫ్ట్వేర్ వాళ్ళకి వచ్చినట్టుగా జీతాలు యింకెవరికి వస్తున్నాయి? మా సుధీర్ని కూడా కంప్యూటర్స్ చదివిద్దామనే నా ఆశ. ఆశపడితే సరిపోతుందా? ఈ వైద్యానికి ఎంత ఖర్చవుతుందో అర్థం కాకుండా వుంది.

అన్నట్టు మీ కంపెనీలో తల్లిదండ్రులకి వైద్యానికి అయ్యే ఖర్చులన్నీ వాళ్ళే యిస్తారటగా? "

మాలతి ఉద్దేశ్యం రచితకి అర్థం అయ్యింది.

"దానికి ముందుగానే, తల్లిదండ్రుల పేర్లురాసి, సంతకాలు చేయించిన కాగితాలు యివ్వాలి. నేను గార్డియన్గా అమ్మమ్మ పేరు మాత్రమే రాశాను" చెప్పింది.

"అవునులే మా దగ్గర వుండడం లేదుగా నువ్వు. ఎలా గుర్తుంటాము మేము. ఇందులో నీ తప్పు లేదులే. ప్రేమైనా, పగైనా కంటికి కనిపిస్తుంటేనే అంటారు. ఈయన వైద్యానికి దాదాపు యిరవై లక్షల దాకా అవుతుందంటున్నారు. ఎలాగా అని దిగులుపడిపోతున్నాను. నువ్వు వచ్చావు. నాకు ధైర్యం వచ్చింది. మా పిల్లలకో అక్కయ్య దొరికింది. యిక నాకే దిగులూ లేదు" కళ్ళనీళ్ళు పెట్టుకుని అంది.

రచితకి ఆవిడ చూపిస్తున్న ప్రేమ నిజమో, నటనో అర్థం కాలేదు. కానీ, ఆర్థిక బాధ్యతలు అన్నీ తనమీద కన్వీనియంట్గా తోసెయ్యాలని చూస్తుందని మాత్రం గ్రహించగలిగింది.

కాస్సేపాగి "నాకు ఆలస్యం అవుతుందండీ.. నేను వెళ్ళొస్తాను" అంటూ లేచింది.

"అదేమిటి? భోజనం చెయ్యకుండానే వెళతావా? మీ నాన్న వస్తూ వుంటారు. కాస్సేపు కూర్చో"

"ఫర్వాలేదండి. అమ్మమ్మ ఎదురు చూస్తూ వుంటుంది వెళ్ళాలి" సోఫాలో నుంచి లేచింది.

మాలతి అన్నటుగానే, రామారావు వచ్చాడు.

"డాడీ వచ్చారు" తన్మయి ఆనందంగా వెళ్ళి రామారావు రెండు కాళ్ళనూ చుట్టేసుకుంది. రచితకి అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.. పోగొట్టుకున్న బాల్యమేదో తన్మయి రూపంలో ఎదురుగా నిలబడ్డట్టు అనిపించింది.

రచితని చూస్తునే ఆశ్చర్యపోయాడు రామారావు.

ఆనందం, అభిమానం రెండూ ఒక్కసారిగా కనిపించాయి అతని ముఖంలో. పైకి మాత్రం "బాగున్నావామ్మా?" అని మాత్రం అనగలిగాడు.

అప్పుడు పరిశీలనగా చూసింది రచిత. మనిషి బాగా చిక్కిపోయాడు. కళ్ళలో నీరసం, బాగా కనిపిస్తూవుంది.

"ఇప్పుడే చెబుతున్నానండీ. మీరు వచ్చేదాకా ఆగి వెళ్ళమని" మాలతి చెబుతూ అధికారికంగా ఆయన చేతిలో నుంచి సంచి అందుకుంది. వెళ్ళబోయినదల్లా మళ్ళీ కూర్చుంది రచిత.

"యిప్పుడు మీ ఆరోగ్యం ఎలా వుంది?" అడిగింది.

"ఫర్వాలేదు ట్రీట్‌మెంటు మొదలుపెట్టారు. ఆఫీసుకి కూడా వెళ్ళడం లేదు. స్నేహితులే మేనేజ్ చేస్తున్నారు. నెలకొకసారి వెళ్ళి సంతకం పెట్టి జీతం తెచ్చుకుంటున్నాను" చెప్పాడు.

"డబ్బు గురించి మీరే ఆలోచనలూ పెట్టుకోవద్దు. మీ థెరపీకి అయ్యే ఖర్చంతా నేను చూసుకుంటాను."

రామారావు మాట్లాడలేదు.

దాన్ని అంగీకారంగానే తీసుకుంది రచిత.

"వస్తాను"

"భోజనం చేసి వెళ్ళు. అరగంటలో వంట చేస్తాను" మాలతి అంది. ఆమె ఆశించినదేదో వస్తుందని అర్థమయ్యాక, ఈసారి మొక్కుబడిగానే అడిగినట్టు అనిపించింది.

"ఇంకోసారెప్పుడైనా చూస్తాను" అని పిల్లలవంక ఒకసారి ఆప్యాయంగా చూసి, గబగబా అక్కడనుంచి వచ్చేసింది.

రామారావుని కలిసి వచ్చాక రచిత మనసు కలతపడింది.

అనసూయమ్మ తలనొప్పిగా వుందని పడుకోవడంతో, కాస్సేపు చల్లగాలి కోసం వరండా మెట్లమీద కూర్చుంది.

ఆకాశంలో చంద్రబింబం. సగానికి తరిగిపోవడంతో వెన్నెల అంతగా లేదు. చీకటిలో కీచురాళ్ళు చేసే రొద, రచిత మనసులో ఆలోచనలలాగే చికాకుని కలిగిస్తున్నాయి.

"కుటుంబాన్ని ఒకసారి కోల్పోతే తిరిగి పొందడం ఎంత కష్టమో ఆ అనుభూతులు, ఆదరణ కోసం జీవితాంతం ఎంత బాధ పడాలో" రచిత మనసులో యిదే ఆలోచన పదే పదే తిరుగుతూ వుంది.

గేటు తెరిచే వుండడంతో, అభీ కారు రావడం కూడా గమనించనేలేదు.

మెట్లమీద చెంపకు చేయి ఆనించి కూర్చుని ఏదో లోకంలో ఉన్నట్టున్న రచితని విచిత్రంగా చూశాడు అభీ.

"ఏమిటిలా కూర్చున్నావు?" పక్కనే తను కూర్చుంటూ అన్నాడు.

"తోచక చల్లగాలి కోసం మీరెందుకు కూర్చున్నారు?"

"మళ్ళా మీరు అంటున్నావు"

"సారీ నువ్వెందుకు కూర్చున్నావు?"

"నాకు మనసంతా చికాకుగా వుంది. మోహన్ అంకుల్‌కి పెరాలసిస్ స్ట్రోక్ వచ్చింది. మధ్యాహ్నం నుంచి హాస్పిటల్‌లోనే వున్నాను."

"అయ్యో యిప్పుడెలా వుంది?" కంగారుగా అడిగింది. "కాలూ, చెయ్యితోబాటు మాట కూడా పడిపోయింది. మనిషి జీవించే వున్నా కమ్యూనికేషన్ లేదు. త్వరలోనే బాగవుతారన్న నమ్మకం పెద్దగా లేదు."

"చైతూ ఎలా వున్నాడు?"

"ఎలా వుంటాడు? యిప్పటిదాకా బాధ్యతలేకుండా తిరిగాడు. ఇక మీదైనా బాధ్యతగా వుండాలి. చైతూ అన్నయ్య అమెరికా నుంచి వస్తున్నాడు. చూడాలి ఆనంద్ ఎలా హేండిల్ చేస్తాడో" నిట్టూరుస్తూ అన్నాడు.

అభీ కూడా విచారంగా వున్నాడని గ్రహించింది రచిత.

"అట్లా కాస్సేపు వాకింగ్‌కి వెళ్ళొద్దామా?" అతన్ని మామూలుగా చేయాలని అనుకుంటూ అడిగింది.

"యాఁ ఈవెన్ ఐ నీడ్ ఎ వాక్" అంటూ లేచాడు.

భాద్రపదమాసం చివర్లో కావడంతో వాతావరణం అంత వేడిగాను లేదు, చల్లగాను లేదు. కాలనీ లోపల రోడ్డు మీద పెద్దగా జనసంచారం లేదు. నిర్మలమైన ఆకాశంలో నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి.

అప్పటిదాకా దిగులుగా కూర్చున్న రచిత, తన సంగతి మర్చిపోయి అభిని ఉల్లాసంగా వుంచాలని ఆరాటపడుతూ వుంది. సరదా కబుర్లు, జోకులు చెప్పి నవ్వించే ప్రయత్నం చేసింది. నడుస్తూ వీధి దాకా చేరుకున్నారు.

"నా సంగతి అంతా నీకు తెలుసు. మరి నీ గురించి చెప్పు నువ్వు ఏం చేయాలనుకుంటున్నావు లైఫ్‌లో?" నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయి మరీ అడిగాడు.

ఆ ప్రశ్నకి రచిత ఆశ్చర్యపోయింది.

వెంటనే, దుర్గాపురంలో యిల్లు గుర్తొచ్చింది. కానీ, "బరువైన విషయాలు మాట్లాడి, ఎమోషనల్ లోడ్ పెంచకూడదు" అని నిశ్చయించుకుంది.

"నేనేమైన అతికష్టమైన ప్రశ్న వేశానంటావా?" అతను రెట్టించాడు.

"పెద్ద గోల్స్ ఏమీలేవు కానీ, చిన్న చిన్న ఆశలైతే బోలెడు వున్నాయి" అంది నవ్వుతూ.

"ఏమిటవి?"

"అవి చాలా సిల్లీగా వుంటాయి. చెబితే నవ్వుతారు."

"చెబితేకదా నవ్వుతారో లేదో తెలిసేది" అతను కుడా సరదా మూడ్‌లోకి వచ్చాడని గొంతుని బట్టి అర్థం అయ్యింది.

"నవ్వకూడదు మరి చెబుతున్నాను" అంది అందంగా మూతి ముడుస్తూ.

"ఊఁ...కానీ.."

"రోజంతా పడుకుని పుస్తకాలు చదవాలి. జ్వరం వస్తే హాయిగా వేడి వేడి సూప్ తాగి, మత్తుగా పడుకోవాలి. నా ఫ్రెండ్స్‌తో రాత్రంతా కబుర్లు చెపుతూ నైటౌట్ చేయాలి. పిల్లల్ని పడుకోబెట్టి చందమామ కథలు చదివి వినిపించాలి, పిల్లలంటే నా పిల్లలన్నమాట."

అభీ పకపకా నవ్వాడు.

"ఇంతేనా, యింకా వుందా లిస్టు?"

అతను హాయిగా నవ్వడం చూసి రచిత మనసు నిండిపోయింది.

"నాకు తెలుసు నవ్వుతారని" పైపైకి ఉడుక్కుంటున్నట్టు అంది.

"లేదులే.. చెప్పు యింకా వున్నాయా?"

"వున్నాయా అంటే వున్నాయి. సమయాన్ని బట్టి కొత్త కొత్తవి పుట్టుకొస్తుంటాయి."

అభీ ఒక్క క్షణం తలతిప్పి రచిత మొహంలోకి చూశాడు.

"ఏమిటిలా చూస్తున్నారు? దీనికి పుట్టి తిక్క అనా?" అలా మాట్లాడుతున్నప్పుడు రచిత సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిల్ కాకుండా అమాయకమైన ఆడపిల్లలా కనిపించింది.

"నిజం చెప్పనా..?"

రెండు చేతులతో ఆమె భుజాలను పట్టి తనవైపుకు తిప్పుకున్నాడు.

"స్వచ్ఛమైన నీ కళ్ళల్లో నీ మనసూ స్వచ్ఛంగా కనిపిస్తుంది. నిరాడంబరంగా నిర్మలంగా చిన్ని చిన్ని ఆశలతో ఆడపిల్లలంటే యిలాగే వుండాలి అనిపిస్తూ వుంది నిన్ను చూస్తూంటే" మృదువుగా చెప్పాడు.

రచిత బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి.

అప్పటిదాకా నిర్మలంగా వున్న ఆకాశం మబ్బు దుప్పటి వేసుకుని, పూలలాగా నీటి బిందువుల్ని రాల్చింది.

క్షణం పాటూ యిద్దరి మనసులూ ఆనందంతో నిండిపోయాయి.

పరిసరాలు, కాలం స్థంభించిపోయినట్టనిపించింది. నిర్మలమైన ఆమె కళ్ళలోకి చూస్తూ, ముందుకు వంగి ఆమె పెదవుల్ని ముద్దాడాడు.

అప్రయత్నంగానే ఆమె చేతులు రెండూ అతని మెడ చుట్టూ అల్లుకున్నాయి. ఆ అనుభూతిని ఆస్వాదిస్తూ మరి కొద్దిక్షణాలు అలాగే వుండిపోయారిద్దరూ.

ప్రతిమనిషి జీవితంలో కొన్ని మధురమైన క్షణాలు వుంటాయి. కాలమాన పరిస్థితులతో సంబంధం లేకుండా హృదయంలో సజీవంగా వుండి మధురానుభుతిని కలుగజేస్తాయి.

అభీ ముద్దుపెటుకున్న నిమిషంలో సియానా గుర్తుకురాకపోవడం విచిత్రంగా అనిపించింది రచితకి.

"ఆ క్షణం అతని కళ్ళలో భావాలు స్పష్టంగా, నిజాయితీగా అనిపించాయి. బహుశా ఆ తర్వాత అతను తప్పుచేశాననో, తొందరపడ్డాననో అనుకోవచ్చు కానీ ఆ క్షణంలో ఆ సంఘటన అతని మనసును బయటపెట్టింది" ఆలోచిస్తూ కూర్చుంది రచిత.

ఆ రోజంతా ఆమె మనసు అలాగే వుంది.

"రచితా! ఒక్క కృతిపాడమ్మా. విని చాలా రోజులయ్యింది" అనసూయమ్మ హాల్లో దివాను మీద నడుం వాలుస్తూ అడిగింది.

దుర్గాపురంలో వున్నప్పుడు రచిత ఆరుసంవత్సరాలు శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. తీరిగ్గా వున్నప్పుడు అనసూయమ్మకి మనవరాలి చేతపాడించుకోవడం అలవాటే.

రచిత కుర్తాని మోకాళ్ళదాకా లాక్కుని బాసింపట్టు వేసుకుని కూర్చుంది.

"మహాగణపతిం మనసా స్మరామి...

మహా గణపతీం..." ముత్తుస్వామి దీక్షితుల కృతి అందుకుంది. నాజూకైన వేళ్ళు తాళం వేస్తున్నాయి.

ఆమె గొంతులోని మాధుర్యం గాలిలో అలలుగా తేలి వస్తుంటే అప్పుడే గుమ్మంలోకి అడుగుపెట్టిన శకుంతలాదేవి నిశ్చలంగా వుండిపోయింది.

అభీ కాలింగ్ బెల్ కొట్టవద్దని వారించి, తన దగ్గరున్న స్పేర్ కీతో తలుపుతీశాడు. శకుంతలాదేవిని చూసి పాట ఆపేయబోయిన రచితని వద్దన్నట్టు కళ్ళతోనే వారించాడు.

"చాలా బాగా పాడావమ్మా!" పాడడం పూర్తవుతూనే, మెచ్చుకుంది శకుంతల.

"దుర్గాపురంలో ఆరేళ్ళపాటు, చెరుకూరి విశ్వనాథశాస్త్రిగారి వద్ద సంగీతం నేర్చుకుంది" అనసూయమ్మ మనవరాలి గురించి గర్వంగా చెప్పింది.

"ఈవిడ మా అమ్మ శకుంతలాదేవి" అభీ పరిచయం చేశాడు. రచిత శకుంతలాదేవి నమస్కరిస్తే, శకుంతలాదేవి అనసూయమ్మకు చేతులు జోడించింది.

"ఈ అమ్మాయి రచిత, వాళ్ళ అమ్మమ్మ అనసూయమ్మగారు" పరిచయం పూర్తిచేశాడు.

"దుర్గాపురం అనసూయమ్మగారంటే పరమేశ్వరరావుగారి భార్య."

"అవును" అనసూయమ్మ అంది.

శకుంతలాదేవి మొహం విప్పారింది.

"అభీ వాళ్ళ పెదతాతగారిది దుర్గాపురమే. ఆయనకు పిల్లలు లేరు. ఆ ఆస్తిపాస్తులు కూడా మావారే చూసుకునేవారు. దుర్గాపురంలో పొలాలు, తోటలు చూసుకోవడానికి వచ్చినప్పుడల్లా మీ యింట్లోనే దిగేవారుట. ఎప్పుడూ చెబుతూ వుండేవారు. ఇప్పుడవన్నీ లేవనుకోండి. మీ గురించి వినడం తప్ప చూడలేదు. యిన్నాళ్ళకి యిలాగ అనుకోకుండా కలుసుకున్నాము"

"అంటే..శ్యాంగోపాల్..!?"

"అవునండి.. మావారు.."

"అభీ శ్యాంగోపాల్ కొడుకా?" ఆశ్చర్యం, ఆనందం కలగలిపిన గొంతుతో అంది.

పాతపరిచయాలు తోడవడంతో మరింత అభిమానంగా ఒకరి విషయాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు.

రచిత కాఫీ కలిపి తెచ్చి యిచ్చింది.

"అయితే, అప్పుడు మా వారికి యిప్పుడు మా అబ్బాయికీ ఆతిథ్యం యిచ్చారన్నమాట. మావాడు యిన్నాళ్ళూ ఎవరింట్లోనో వున్నాడనుకున్నాను. అందుకు కృతజ్ఞతలు తెలుపుకుందామనే యివ్వాళ బయల్దేరి వచ్చాను. అది మీరేకావడం సంతోషంగా వుంది." శకుంతలాదేవి అంది.

"ఎవరికెక్కడ ఋణమో ఎవరు చెప్పగలరమ్మా?"

"మావాడు చేసిన ఆకతాయి చేష్టలు అన్నీ చెప్పాడు. మీ మనవరాలు మంచితనం, ఓపిక గురించి కూడా అర్థమైంది" అంది రచిత వైపు ఆపేక్షగా చూస్తూ.

"అభీని మాత్రం తక్కువ చేసి చెప్పగలమా. మంచి పిల్లవాడు" అనసూయమ్మ అంది.

అభీ రచిత వైపు చూసి కొంటెగా కళ్ళెగరేశాడు.

రచిత గమనించనట్టే ఖాళీ కాఫీ కప్పులు, తిరిగి ట్రేలో సర్దుకోసాగింది.

"మీకు తెలియనిదేముందీ అభీ మొండిపట్టుదల కలవాడు. అనుకున్నది సాధించేవరకూ వదలడు. వాడు కోరినట్టే యిక్కడే యింకో యిల్లు తీసుకున్నాము.

వెళ్ళేముందు వాడిని యింత అభిమానంగా చూసుకున్నవారిని, చూసి వెళదామని వచ్చాను.

మా అన్నయ్య కూడా కాస్త దిగివచ్చాడు. అభీ బిజినెస్‌లో పెట్టుబడి పెడతానని అంటున్నాడు కూడా.

"త్వరలోనే అన్నీ పరిస్థితులు చక్కబడతాయని నా ఆశ" అంది నిట్టూరుస్తూ.

అభీ వెళ్ళిపోతున్నాడనగానే, రచితకి ఒక్కసారిగా నీరసం వచ్చేసింది. అప్రయత్నంగా కళ్ళలోకి నీళ్ళు వుబికి వచ్చాయి.

అభీ కోసం చూసింది. అతను హడావిడిగా మేడమీద గదిలోకి వెళుతూ కనిపించాడు.

శకుంతలాదేవి ఫోన్ రింగ్ యివ్వడంతోనే, వారితోబాటు వచ్చిన మనిషి, అభీ వెనకాలే మేడమీదకు వెళ్ళాడు.

అరగంటపాటు అతను మేడదిగి రాలేదు. లాప్‌టాప్‌లు, కాగితాలు సర్దుకుంటూ వున్నాడు.

అదే తన జీవిత ధ్యేయం అన్నట్టుగా పాక్ చేసుకుంటూ వుంటే రచితకి కోపం, బాధ కలగలిపి వచ్చాయి.

పెరటి గుమ్మం దగ్గర చతికిలబడి, చేతిలోకి చిన్నరాయిని తీసుకుని, మెట్లమీద దాన్ని నేలకి రాస్తూ కూర్చుంది.

"ఆ రాయిని పూర్తిగా అరగదీస్తే నిన్ను గిన్నీస్ బుక్‌లోకి ఎక్కిస్తానన్నారా?" నవ్వుతూ, వచ్చి పక్కన కూర్చుంటూ అన్నాడు అభి.

రచిత గడ్డాన్ని మోకాలిపైన ఆనించి, తన పని అదేనన్నట్టు దీక్షగా రాయిని అరగదీస్తూ వుంది.

"మాట్లాడవేం. కోపం వచ్చిందా?"

"...."

మాదీ దుర్గాపురమే అని తెలిస్తే సంతోషిస్తావనుకున్నాను కానీ, కోపం ఎందుకు వచ్చిందో తెలియడం లేదే" కవ్వింపుగా అన్నాడు.

"నాకేం కోపం లేదు" విసుగ్గా అంది.

"సరే అయితే నేను బయలుదేరాలి." అంటూ లేచి నిలబడ్డాడు.

"ఈ నాలుగు రోజుల్లోనే మనం మంచి ఫ్రెండ్స్ అయ్యాం. మన ఫ్రెండ్షిప్ యిలాగే కంటిన్యూ అవ్వాలి" మళ్ళీ అతనే అన్నాడు. రచిత తల ఎత్తి సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది.

"అంతకంటే చెప్పాల్సింది ఏమీలేదా?"

"మెసేజ్‌లు పెడుతూ వుండు, వీలైనప్పుడల్లా ఫోన్ చేయి" రచిత నిస్తేజంగా అయిపోయింది.

అతడింకేదో చెప్పాలని మనసుకి ఆరాటంగా వుంది. ఇద్దరి మధ్యా ప్రేమ వుందని గట్టిగా నమ్ముతుంది. కానీ సియానా?

అయోమయంగా అయిపోయింది రచిత.

"అన్నీ, అనుకూలంగా జరిగితే, త్వరలోనే మళ్ళీ మనం దగ్గరవుతామేమో" తనలో తానే మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు.

"కొన్ని రిలేషన్స్ స్వల్పకాలం మాత్రమే మనగలుగుతాయేమో. వాటిని హృదయంలో నిక్షిప్తం చేసుకుని జ్ఞాపకాలుగా మార్చుకుంటేనే కలకాలం మనగలుగుతాయి. అభీతో పరిచయం ఒక జ్ఞాపకంగానే మిగిలిపోతుందేమో" రచిత బాధతో సంబంధం లేకుండా పనులు చకచకా జరిగిపోతున్నాయి.

పైనుంచి అభీ బట్టలు,షూస్ పాక్ చేసి, కిందకి దించారు.

శకుంతలాదేవి రచితకి, అనసూయమ్మకి కానుకగా తెచ్చిన పట్టుబట్టలు చేతిలో పెట్టి, "మీకు ఏ అవసరం వచ్చినా, మేమున్నామని తప్పకుండా గుర్తుపెట్టుకోండి.." అని మరీ మరీ చెప్పింది.

శకుంతల చెప్పడంతో అభి, అనసూయమ్మ పాదాలకు నమస్కారం చేశాడు.

"చల్లగా వుండు" అంటూ దీవించి దగ్గరకు తీసుకుంది అనసూయమ్మ. రచిత మనసు మొద్దుబారిపోయినట్టు వులుకూ - పలుకూ లేకుండా నిలుచుంది.

"వస్తాను" అంటూ రచిత చేతిని చేతిలోకి తీసుకుని వీడ్కోలు చెప్పాడు.

ఆమె చూస్తూ వుండగానే, సామాన్లన్నీ కారు డిక్కీలోకి చేరాయి. కారు కదిలింది. అభీ విండోలో నుంచి చేయి వూపాడు. క్షణాల్లో కారు కాంపౌండ్ దాటి, వీధిమలుపు తిరిగి రోడ్డు మీద అన్ని వాహనాల్లో ఒకటిగా కలసిపోయి దూరంగా కనిపించకుండా పోయింది.

అభీ ఎంత సైలెంట్‌గా, సడన్‌గా వచ్చాడో అలాగే వెళ్ళిపోయాడు.

"హే.. ఇవాళ కొత్త మేనేజర్ వచ్చాడు. పేరు సారంగ్. పూర్తి పేరు సారంగపాణి. తెలుగువాడే" వార్త మోసుకొచ్చింది వసుధ.

అంతక్రితం దాకా వున్న మేనేజర్ మంచి ఆఫర్ రావడంతో వారం క్రితమే జాబ్ మానేసి వెళ్ళాడు.

"సో. ఇక నుంచి సారంగ్‌తో కలిసి పని చేయాలన్నమాట" రచిత అంది.

"ఈ మధ్య ఆఫీసులో ఎక్కువగా పనిలేదని బాధపడుతున్నావుగా మీ టీంకి. కొత్త ప్రాజెక్ట్ ఒకటి రాబోతుంది" మరో శుభవార్త చెప్పింది.

అభీ వెళ్ళిపోయాక నిజంగానే తోచడంలేదు. అతని గురించి ఆలోచిస్తే "తప్పు చేస్తున్నానా? సియానానే ముందుగా అతని లైఫ్‌లో వుందన్న విషయం ఎలా మరిచిపోయాను" అని బాధపడుతుంది.

దానికి తోడు ఆఫీసులో ఎక్కువగా పనిలేకపోవడం, అనవసరమైన ఆలోచనలకు దారితీస్తూ వుంది.

వసుధ చెప్పినట్టు కొత్త ప్రాజెక్టు వస్తే పనిలో బిజీ అయిపోవచ్చు. అనుకుంది.

"ఏమిటే నా మానాన నేను మాట్లాడుతూనే వున్నాను. ఎటో ఆలోచిస్తూ కూర్చున్నావు? ఈజ్ ఎవ్రిథింగ్ ఆల్‌రైట్?"

"నథింగ్ నేను బాగానే వున్నాను. డోన్ట్ వర్రీ"

"సరే. అయితే, సాత్విక్ ఈవినింగ్ మూవీకి ప్లాన్ చేశాడు. మల్టీప్లెక్స్‌లో మహేష్‌బాబు మూవీ నీకూ టికెట్ బుక్ చేయమంటాను. ఓ.కే.నా?"

"వద్దు.. వద్దు.. మీరు వెళ్ళిరండి"

"సరే. నీ యిష్టం" భుజాలెగరేస్తూ వెళ్ళిపోయింది వసూ.

"రండి రండి" అనసూయమ్మ వయసే వున్నావిడ తలుపు తీసి లోపలకు ఆహ్వానించింది.

రచిత, అనసూయమ్మ యిద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. "లోగడ, రెండు మూడుసార్లు రామారావుని చూడడానికి యిద్దరూ వచ్చినప్పుడు ఈవిడ కనిపించలేదు. ఎవరై వుంటుందబ్బా" అనుకుంటూ.

"ఓ.. మీరా ఈ సమయంలో ఎవరై వుంటారా అనుకుంటున్నాను." లోపలి నుంచి వస్తూ మాలతి అంది.

"ఈ అమ్మాయేనా రచితా అంటే..." ఇందాకటి ఆవిడ రచిత వైపు చూస్తూ అంది.

"మా అమ్మ, రామాయమ్మ" మాలతి పరిచయం చేసింది. అనసూయమ్మకి ఈ పరిస్థితి యిబ్బందికరంగా వుంటుందేమో అని రచిత మనసులో బాధపడింది.

"ఇటు పిల్లల్ని, అటు ఆయన్ని చూసుకోలేక, తోడుగా వుంటుందని మా అమ్మని పిలిపించుకున్నాను." మాలతి చెప్పింది. మామూలుగానే రచితకి ఆ యింట్లో తను పరాయి మనిషినన్న భావం వుంది. ఇప్పుడు రామాయమ్మ ఎదురుగా వుండడంతో మాట్లాడాలన్నా సంకోచంగా అనిపించింది.

"అమ్మాయ్ కాస్త కాఫీ పట్టుకురా ఈ అమ్మాయి నీ యింటి ఆడబడుచు. ఆడబిడ్డ మనసు కష్టపెట్టకుండా చూసుకోవాలే తల్లీ" రామాయమ్మ మాలతిని పురమాయించింది.

రచిత ఆ మాటల్లో ఎంత నిజమో, ఎంత నాటకమో అర్థం కాలేదు. కానీ మాలతి పలకరింపులో మాత్రం చాలా మార్పు గమనించింది. "ప్రతినెలా ఠంఛనుగా ఆమె ఎకౌంట్‌లో పడుతున్న డబ్బు, జబ్బుతో బాధపడుతున్న భర్త ఆమె ఆలోచనల్లో మార్పు కలిగించి వుండవచ్చు" అనుకుంది.

"అక్కా" అంటూ తన్మయి వడిలోకి వచ్చి కూర్చుంది. ఇప్పుడిప్పుడే కొత్తపోయి దగ్గరవుతూ వుంది.

బ్యాగులో నుంచి డెయిరీ మిల్క్ చాక్లెట్ తీసి యిచ్చింది రచిత.

"ఈమె ఎవరు? నీతో వస్తూ వుంటుంది?" అంది అనసూయమ్మవైపు చూస్తూ.

"ఆమె నా అమ్మమ్మ."

"అంటే నాకు బామ్మవుతుందా? అమ్మమ్మవుతుందా?"

"నీకూ అమ్మమ్మే అవుతుంది."

కొంచెంసేపు అనసూయమ్మని పరీక్షగా చూసి దగ్గరకు వచ్చింది. ఆవిడ బుగ్గలు పట్టుకోబోతే పరిగెత్తుకుంటూ లోపలికి పారిపోయింది ఇంతలో, కాఫీలు పట్టుకొచ్చి యిచ్చింది మాలతి.

"మాలతీ" లోపల్నుంచి రామారావు కేకపెట్టాడు. హడావుడిగా అతని అవసరం చూడడానికి వెళ్ళిందామె. రామారావుకి కిమోథెరిపీ మొదలు పెట్టాక అప్పుడప్పుడూ బట్టల్లోనే విరోచనం అవుతూ వుంటుంది.

మాలతే శ్రద్ధగా అతనికి సేవలు చేస్తూ వుంటుంది. ఒకటి, రెండు సార్లు రచిత గమనించిందా విషయం.

వాళ్ళిద్దరూ అన్యోన్యంగానే వుంటారన్న సత్యం కూడా బోధపడింది. అయినా, మనసులో మాలతి వున్న స్థానం తన తల్లికి లేదని గుర్తొస్తూనే వుంటుంది.

కాన్సరుతో పోరాడుతూ వున్నా తండ్రిని మన్నించలేకపోతుంది.

"అభీ చెప్పినట్టు పెళ్ళిచేసుకుంటే భర్త, పిల్లలు వారి ప్రేమతో మునిగి వీటన్నింటినీ మర్చిపోగలుగుతానా? క్షమించేంత పెద్దమనసు వస్తుందా?" రచిత ప్రశ్నించుకుంటూ వుంది.

రామారావు రచితని చూడడానికి హాల్లోకి వచ్చాడు. నీరసంగా వున్నాడేమో, మాలతి చేయిపట్టుకుని తెచ్చి కూర్చోబెట్టింది.

"ఇప్పుడెలా వుంది నాయనా?" అనసూయమ్మ అడిగింది.

"ఫర్వాలేదు. కోలుకున్నట్టే. కిమోకి శరీరం సహకరిస్తూ వుంది. ఇంకో మూడు నెలల్లో థెరపీ పూర్తవుతుంది", చూడడానికి మనిషి మాత్రం బలహీనంగా వున్నాడు. నెత్తిమీద జుట్టంతా రాలిపోయివుంది.

"నేను మాట్లాడడం బావుంటుందో లేదో అయినా, చెప్పాలనిపించి చెబుతున్నాను. రచితకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా?" అడిగాడు. ఇంకో సందర్భంలో అయితే, రచితకి అతనలా అడగడం కోపం తెప్పించి వుండేదే కానీ ప్రస్తుత పరిస్థితులలో ఏమీ అనలేకపోయింది.

"నేనూ పెద్దదాన్ని అయిపోతున్నాను. రచిత పెళ్ళి చూడాలనే వుంది. ఎంతైనా, పీటల మీద కూర్చుని కాళ్ళు కడిగి కన్యాదానం చేయవలసినవాడివి నువ్వు. ముందు నీ ఆరోగ్యం కుదటపడనీ. తర్వాత ఆలోచిద్దాం" అనసూయమ్మ అంది.

"భగవంతుడి దయవల్ల నాకింకొక పది సంవత్సరాల ఆయుర్దాయం దొరికినట్టే అనిపిస్తుంది. నేను ఖచ్చితంగా కోలుకుంటాను. బాధ్యతలు తీర్చుకోడానికి యింకో అవకాశం దొరికినట్టే వుంది. అమ్మాయి ఎవరినైనా యిష్టపడితే సరే లేదంటే మీరే ఒక మంచి సంబంధం చూడండి" చెప్పాడు.

"హలో.! "

సీరియస్‌గా పనిచేసుకుంటున్న రచిత ఒక్కసారిగా వులిక్కిపడింది.

"సారీ మిమ్మల్ని భయపెట్టాలని రాలేదు" వెనకాల సారంగ్ నవ్వుతూ నిలబడివున్నాడు.

"ఓ. ఇట్స్‌యూ" రివాల్వింగ్ ఛెయిర్‌తో బాటూ వెనక్కి తిరిగింది.

"మొన్న మీ ప్రజంటేషన్ సూపర్బ్. క్లయింట్ యింప్రెస్ అయ్యాడు. సో ఈ ఫ్రైడే మీకు లంచ్ నా తరపు నుంచి. మీకు ఓ.కేనా?" మర్యాదగా అడిగాడు.

రచిత మొహం విప్పారింది. "ఓకే. ష్యూర్" అంది నవ్వుతూ.

సారంగ్ నెమ్మదస్తుడు. నిదానంగా, ఆచి తూచి మాట్లాడతాడు. అంత నెమ్మదిగా, సాఫ్ట్‌గా వున్నా పనులు ఖచ్చితంగా ఎలా చేయించుకోవాలో అతనికి బాగా తెలుసు.

అతని పనితీరుకి రచిత ఆశ్చర్యపోతూ వుంటుంది. అతనితో బాటు పనిచేసే ఆడవాళ్ళ పట్ల మర్యాదగా వుండే సారంగ్ అంటే రచితకి చాలా గౌరవం. అందువల్లనే అతను లంచ్ ప్రపోజల్ పెట్టగానే ఆలోచించకుండా "సరే"నంది.

"ఏంటీ, లంచ్ యిన్విటేషన్ నీకొక్కదానికేనా?" వసుధ కొంటెగా నవ్వుతూ అంది.

"నువ్వు ఎక్కువగా వూహించుకోకు. మొన్న ప్రజెంటేషన్ బాగా జరిగినందుకు, ఫార్మల్‌గా లంచ్... అంతే" అంది రచిత.

"అంతేలే వూహించుకుంటే మాత్రం జరిగేదేముంది? ఒక్క రూఫ్ కింద నాలుగురోజులు వున్న హాండ్‌సమ్‌నే అలా ఈజీగా వదిలేశావు. ఎన్నిసార్లు లంచ్‌కి తీసుకెళితే మాత్రం నువ్వు మారతావా?" నిట్టూరుస్తూ అంది.

"నా సంగతి సరే నీ విషయం చెప్పు. సాత్విక్‌ని వదిలి ఇలా ఎందుకు వచ్చినట్టు?"

వసుధ మొహం సీరియస్‌గా మారిపోయింది.

"చెబుతా కానీ, యిక్కడ కాదు. పద కాఫీ షాపులో కూర్చుని మాట్లాడుకుందాం" హ్యాండ్ బ్యాగ్ తగిలించుకుంటూ కుర్చీలో నుంచి లేచింది.

ఇద్దరూ లిఫ్ట్‌లో కిందకి దిగి ఆఫీస్ బిల్డింగ్ బయటకి వచ్చారు. ఆకాశం నిండా నల్లని మబ్బులు చల్లటిగాలి సన్నగా వణుకు పుట్టిస్తుంది.

చిటపటా చినుకులు పడుతూ వుంటే, తలమీద చేతులు అడ్డం పెట్టుకుని రోడ్డు దాటారు.

షాప్ అంతా కాఫీ ప్రియులకు సంబరం కలిగించే ఘుమఘుమలాడుతూ వుంది. బయట చలిగా వుండటంతో రద్దీగా కూడా వుంది.

గ్లాస్ వాల్ మీద పడుతున్న చినుకులను చూస్తూ వెచ్చటి కాఫీ సిప్ చేసి, తీరిగ్గా కుర్చీలో వెనక్కివాలింది రచిత.

అద్దం మీద పడ్డ ఒక్కొక్క నీటిబిందువు, ఒకదానితో ఒకటి కలిసి ధారలై సాగుతూ వుంటే...

అభీ జ్ఞాపకం వచ్చాడు.

బ్లూకలర్ మెర్సిడెజ్ కారులో నుంచి దిగుతూ బ్లూకలర్ షర్ట్, దానిమీద స్ట్రైప్స్ వున్న బ్లాక్ కలర్ టైతో.

"హే... అభినవ్" ఒక్క క్షణం మనసు వుత్సాహంతో గంతువేసింది. వానకొద్దిగా జోరందుకోవడంతో రోడ్డుకి అవతలి పక్క దృశ్యాలు మసకబారాయి. రెప్పపాటులో అభీ మాయమయ్యాడు.

"ఇదంతా నిజమా? భ్రమా?" అనుమానం వచ్చింది.

"నేను స్టోరీ చెబుదామని వస్తే, నువ్వు ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్ళిపోయావేం?" నాప్‌కిన్స్ బొత్తి పట్టుకుని వచ్చి కూర్చుంటూ, రచిత మొహం మీద చిటికె వేసింది వసూ.

"ఇందాకే చెప్పాను. నా సంగతి వదిలేయమని. నీ స్టోరీ మొదలుపెట్టు" అంది రచిత కాఫీ సిప్ చేస్తూ.

వసుధ మొహం గంభీరంగా మారిపోయింది.

"మొన్న సండే సాత్విక్ పేరెంట్స్‌ని కలిశాను. ఇంట్లో అందరూ బాగానే వున్నారు. కానీ, వాళ్ళమ్మను చూస్తేనే భయం వేసింది"

వసుధ ఎక్స్‌ప్రెషన్ చూసి రచితకి నవ్వొచ్చింది.

"ఆవిడ పాత సినిమాల్లో సూర్యకాంతం టైపా?"

"లేదు. సూర్యకాంతం టైప్ అయితే మొగుడ్ని ఈజీగా మనవైపు టర్న్ చేసుకోవచ్చు. కానీ, ఆవిడ అంజలీదేవి టైపు. ఓవర్ ఎఫెక్షన్. అదే భయం వేస్తుంది."

రచిత ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టింది.

"చదువుకున్నదానివి నువ్వూ యిలా ఆలోచిస్తావనుకోలేదు. మొగుడ్ని నీ వైపు తిప్పుకోవడం ఏమిటి? సాత్విక్‌కి ఒక వ్యక్తిత్వం వుంది. అతనికీ యిష్టాయిష్టాలు, అభిప్రాయాలూ, మూడ్స్ వుంటాయి. వాటిని గౌరవించు" మందలిస్తున్నట్టుగా చెప్పింది.

"అదికాదే నా వుద్దేశ్యం ఏమిటంటే, ఆవిడ యిరవై ఆరేళ్ళ వ్యక్తిని యింకా చిన్నపిల్లవాడిలా చూస్తూ అతిప్రేమ కురిపిస్తూ వుంటే ఎలా వుంటుంది చెప్పు? అతను యిండిపెండెంట్‌గా, స్ట్రాంగ్‌గా వుండొద్దూ.."

"అమ్మ అలాగే వుంటుంది. ఐమీన్ అలాగే వుంటుందనుకుంటున్నాను." రచిత గొంతులో బాధ ధ్వనించింది.

సంభాషణ ఎటువైపుకి మళ్ళిందో అర్థమైంది వసుధకి. "అదికాదు. నేననేదేంటంటే"

రచిత మధ్యలోనే అందుకుంది.

"నాకు అర్థం అయ్యింది. సాత్విక్ ఆఫీసులో చూస్తున్నానుగా. ఇండిపెండెంట్‌గా, స్ట్రాంగ్‌గానే వుంటాడు. తల్లిప్రేమ యిప్పటివరకూ అతని కెరీర్‌ని అయితే ఎఫెక్ట్ చేయడంలేదు. ఇక పర్సనల్ విషయాలంటావా ముందు నుంచే నువ్వు నెగెటివ్‌గా ఆలోచించి భయపడుతున్నావేమో"

అసలు విషయం రాబట్టాలని కాజువల్‌గా అంది.

వసుధ కొంచెం తత్తరపడింది.

ఓ.కే. అసలు పాయింటు కొచ్చేస్తాను. ఒకసారి గట్టిగా గాలిపీల్చి టేబుల్ ముందుకి వంగింది.

"ఎందుకనో, పెళ్ళి అనుకోగానే నెర్వస్‌గా వుంది. ఇప్పుడు హాయిగా, స్వేచ్ఛగా బతుకుతున్నాను. సంపాదించుకుంటున్నాను. రేపు పెళ్ళి అయ్యిందనగానే బాధ్యతలు వస్తాయి కదా" అంది.

"అయితే, అసలు నువ్వు పెళ్ళికి రెడీనా, కాదా ఆలోచించు ముందు" సలహా యిచ్చింది రచిత.

"అదే అర్థం కావడంలేదు. సాత్విక్‌తో లవ్, రొమాంటిక్ మూమెంట్స్ అన్నీ థ్రిల్లింగ్‌గానే వున్నాయి. కానీ, నిన్న సడన్‌గా వాళ్ళింటికి వెళ్ళేసరికి రియాలిటీ అర్థమైంది. పెళ్ళవగానే అత్తగారు, మావగారూ ఆడబడుచు అలకలు, సాధింపులు, గొడవలు, పెళ్ళికి వెళ్ళడాలూ, పరామర్శలు, పిల్లలు ఫ్యూచర్ అంతా సినిమా రీలులా కనిపించి బుర్ర తిరిగి పోయిందనుకో. చాలా భయం వేసింది. వాళ్ళదీ మాలాంటి ఫ్యామిలీనే. కోడలు నుంచి ఏమి ఎక్స్‌పెక్ట్ చేస్తారో నేను వూహించగలను. వుద్యోగంలో వున్న వత్తిడి చాలక, ఈ స్ట్రెస్ కూడా మోయగలనా? ఇదంతా నాకవసరమా? అని ఆలోచిస్తున్నాను" వివరంగా విషయమంతా బయటపెట్టింది.

"అయితే యిప్పుడేం చేయాలనుకుంటున్నావు?"

"అది అర్థంకాకనే కదా నీ సలహా అడుగుతూ వున్నాను."

రచిత కొంచెం సేపు ఆలోచించింది.

"పోనీ. పెళ్ళికి యింకా రెడీగా లేనని చెప్పేయ్ సాత్విక్‌తో" అంది

"అలా అంటే, నేను వాడి టైప్ కాదనుకుని, వేరే అమ్మాయిని వెతుక్కుంటే?"

"అంటే నువ్వు సాత్విక్‌ని డీప్‌గా లవ్ చేస్తున్నావనమాట."

"అఫ్‌కోర్స్ రచితా.. ఐ లవ్ హిమ్ వెరీమచ్."

వాస్తవాల్ని మనసు అర్థంచేసుకోదు. మనసుని బట్టి వాస్తవ పరిస్థితులు మారవు. ఈ రెండింటికీ ఎప్పుడూ వైరుధ్యమే.

సియానాని చేసుకోబోయే వ్యక్తి అని తెలిసీ అభిని మర్చిపోలేకపోతున్నాను. అలాగని అతడు ఆమెకి అన్యాయం చేసినట్టనిపించినా మనశ్శాంతిగా వుండలేను తన పరిస్థితిని తల్చుకుని నిట్టూర్చింది రచిత.

"సాత్విక్ ఒక్కడే కావాలి. అతని ఫ్యామిలీ వద్దు అని చెప్పలేవు. అలా చెబితే అతని దృష్టిలో చీప్ అయిపోతావు."

"ఛ..ఛ. నాకలాంటి వుద్దేశ్యం కూడా లేదే కాకపోతే వెళ్ళినచోట ప్రేమాభిమానాలకి బదులుగా సాధింపులూ, ఆరళ్ళూ ఎదురైతే? అదే నా భయం కొత్తగా జాబ్‌తో బాటు యింకా స్ట్రెస్‌ని మూటగట్టుకుని శారీరకంగా, మానసికంగా సమస్యలు కొని తెచ్చుకోవడమా? అనే ఆలోచిస్తున్నాను."

"ఒకవేళ అలాంటి సమస్యలే ఎదురైతే సాత్విక్ నీకు తోడుగా వుంటాడని నమ్ము. అదృష్టం బాగోలేక పరిస్థితులు ఎదురు తిరిగాయే అనుకో 'మీ పాదాల దగ్గర యింతచోటు యివ్వండి' అని ఏడుస్తూ కూర్చునే రోజులు కావు కదా! అయినా, ప్రతిదీ నెగెటివ్‌గా చూడడం మానెయ్." వసుధ దీర్ఘంగా ఆలోచిస్తూ కణతలు నొక్కుకుంది.

స్నేహితురాలి మనసులో ఆలోచనలు ఎలా సుడులు తిరుగుతూ వున్నాయో గ్రహించగలిగింది రచిత. ఆత్మవిశ్వాసం దెబ్బతింటే, ప్రతివిషయం భూతమై భయపెడుతుంది. అభద్రతాభావం మంచితనాన్ని చూసే అవకాశం యివ్వకుండా, మనస్సంతా చీకటిమయం చేసేస్తుంది.

వసుధ మేనత్త పెళ్ళి తర్వాత పడ్డ కష్టాలు ఎంతటివారినైనా కదిలించివేస్తాయి. పిల్లలకోసం ముళ్ళకంపలాంటి సంసారాన్ని మోస్తూ శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు అనుభవించి చిన్నవయసులోనే చనిపోయింది. వసుధ మీద ఆ ప్రభావం వుండడం సహజమే. చిత్రం ఏమిటంటే, మగవాళ్ళతో బాటు, సాటి ఆడవాళ్ళను నమ్మడానికి భయపడే పరిస్థితిలో వుంది స్త్రీ అప్పుడూ యిప్పుడూ.

వసుధకి పెళ్ళంటే భయం. కానీ, వయసుకీ, ఆలోచనలకీ వైరుధ్యం. సంసారం అంటే బందిఖానా. కానీ, ప్రేమించే తోడుకావాలి. వాస్తవానికీ, వూహలకీ మధ్య దూరాన్ని అంచనా వేయలేక సతమతమవుతూ వుంది.

వసుధ మనసును సులభంగానే చదవగలిగింది రచిత.

నెమ్మదిగా ముందుకు వంగి వసుధ చేతిని మృదువుగా తాకింది.

"వసూ.. నువ్వు మంచిదానివి. నిన్ను యిష్టపడకుండా ఎవరూ వుండలేరు. నువ్వు బయపడేట్లు జరిగితే, సాత్విక్ నీకు తోడుగా వుంటాడని నమ్ము."

వసుధ మొహం మబ్బు వీడినట్టయ్యింది.

"బాగా చెప్పావు రచీ. కొద్దిరోజులు పెళ్ళిప్రస్తావన తేవద్దని చెబుతాను సాత్విక్‌కి. నాకున్న అనుమానాలూ, భయాలూ అన్నీ అతనితో షేర్ చేసుకుంటాను. మనసుకి ముసుగు వేసి నటించడం కంటే యిదే బెటర్. కొద్దిరోజులు టైం తీసుకుంటే నాకే ధైర్యం వస్తుందేమో" ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా చెప్పింది.

బిల్ పే చేసి యిద్దరూ బయటికి వచ్చారు.

హడావుడిగా కురిసిన వాన అంతలోనే వెలిసిపోయింది. ఒకటీ అరా చినుకులు మాత్రం రాలుతున్నాయి.

నీటిబిందువులు చక్కిలిగిలి పెట్టినట్టు మీద పడుతూ వుంటే, అభీతో కలిసి వాకింగ్‌కి వెళ్ళిన రాత్రి గుర్తొచ్చింది.

సన్నని కోటేరులాంటి ముక్కు, ఆకుపచ్చగా నీడలు తేలుతున్నట్టు వున్న గడ్డం అభీ ఊహలోకి రాగానే నిజంగా ఎదురుగా నిలబడ్డట్టయ్యింది.

రెండు అడుగులు ముందుకి వేస్తూనే, గబుక్కున చేయిపట్టి ఆపినట్టయ్యింది.

తలతిప్పి చూస్తూనే కళ్ళముందు అభినవ్. గబుక్కున చేయి పట్టుకోవడంతో, రచిత పింక్ చుడీదార్ దుపట్టా అతని చేతిని చుట్టుకుంది.

"పిలుస్తుంటే, వినిపించుకోకుండా వెళ్ళిపోతావేం?" నవ్వుతూ అడిగాడు.

వసూ రచితవైపు చూసి, కొంటెగా నవ్వి, "వస్తాను" అని వెళ్ళిపోయింది.

"మీరేమిటిక్కడ?" దుపట్టాని వెనక్కి లాగుతూ అడిగింది.

"మళ్ళీ మీరులోకి వచ్చావు"

"సారీ. నువ్వేంటిక్కడ?"

"'షెరోనా టెక్' గురించి చెప్పాను కదా.."

అవునన్నట్టు తలాడించింది రచిత.

"యిప్పుడు అది గేరప్ అయ్యింది. మామయ్య కూడా అందులో యిన్వెస్ట్ చేశాడు. కొత్త ఆఫీస్ బిల్డింగ్ కూడా తీసుకున్నాను. దాని యింటీరియర్స్ డిజైన్స్ రెడీ అయ్యాయని ఫోన్ వచ్చింది. ఆర్కిటెక్ట్‌ని యింటికి రమ్మన్నాను కానీ సియా బయటికి వెళదాం అంది. అందుకని మేమే వచ్చాం."

రచిత కళ్ళు అప్రయత్నంగానే సియానా కోసం వెదికాయి.

"సియా యింకా ఆర్కిటెక్ట్ ఆఫీస్‌లోనే వుంది. పై ఫ్లోర్ నుంచి చూస్తే కాఫీ షాప్‌లో నువ్వు కనిపించావు. అందుకే, నిన్ను కలవాలని ముందుగా వచ్చి యిక్కడ వెయిట్ చేస్తున్నాను."

"సియానా, అభీ కలిసి వచ్చారన్నమాట. యిప్పుడు వాళ్ళిద్దరి మధ్య ఏ అడ్డుగోడలు లేవు." రచిత అనుకుంది.

స్టెయిర్‌కేస్ మీద అభీ సియానాని ముద్దుపెట్టుకోవడం ఆమె అతని ఫియాన్సీ అని వసూ చెప్పడం. నాజూకుగా వుండే సియానా రూపం కళ్ళముందు రీలులా కదిలింది.

"ఓ.కే. కంగ్రాట్స్. నీ కొత్త వెంచర్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను. అయామ్ హేపీ ఫర్‌యూ" చెప్పి, గబగబా అక్కడ నుంచి కదలబోయింది.

"ఏమిటంత తొందర? మాట్లాడుతూ వుంటే వెళ్ళిపోతావేం?"

"నాకు ఆఫీసులో పనివుంది. అయినా, మాలాంటివాళ్ళు పనిచేయకపోతే మీకే నష్టం" బాధ అంతా వుక్రోషం రూపంలో వెలిబుచ్చింది.

"ప్లీజ్." మళ్ళా ఆమె చేయి పట్టుకున్నాడు.

"యిలా మాటిమాటికీ రోడ్డుమీద చేయిపట్టి ఆపకు. సియానా చూస్తే బాధపడుతుంది."

అభినవ్ హర్ట్ అయినట్టు చూశాడు.

"రచితా.. ఫోన్ చేస్తే తీయడంలేదు. మెసేజ్‌లకి రిప్లై యివ్వడంలేదు. ఎందుకు నన్ను ఎవాయిడ్ చేస్తున్నావు?" నిలదీస్తున్నట్టుగా అడిగాడు.

"ప్లీజ్ అభీ ఆ రోజు రాత్రి జరిగినదాన్ని బట్టి నువ్వు నన్ను తప్పుగా అర్ధం చేసుకున్నట్టున్నావు. ఐ వాంట్ టు ఫర్‌గెట్ యిట్. నువ్వు కూడా మర్చిపోతే మంచిది. ప్లీజ్... నన్ను మళ్ళా కలవాలని ట్రై చేయకు."

"అదే అడుగుతున్నాను. ఎందుకు మర్చిపోవాలి?" కోపాన్ని అణుచుకుంటున్నట్టు అన్నాడు.

"ఎందుకంటే, పేరు, పరపతి, డబ్బు అందం వున్న సియానాని కాదని, నా వెంటపడుతున్నావంటే మోసపోయేంత మూర్ఖురాల్ని కాదు. నా వల్ల యింకో ఆడపిల్ల బాధపడడం నాకు యిష్టం లేదు" కటువుగా మాట్లాడి గబగబా వెళ్ళిపోయింది.

ఆఫీసుకి బయలుదేరబోతుండగా, రచిత సెల్‌ఫోన్ రింగయ్యింది.

"అమ్మా.. నేను బాబూరావ్‌ని మాట్లాడుతున్నాను." అవతలి నుంచి వినిపించింది.

బాబూరావు పేరు వినగానే రచిత నిటారుగా అయ్యింది.

"చెప్పండి" అంది.

"మీ యిల్లు అమ్మకానికి వస్తే ముందుగా ఒకమాట చెప్పమన్నారని. ఫోన్ చేస్తున్నాను. మా అల్లుడు బెజవాడలో వాటర్ బాటిల్స్ తయారుచేసే ప్లాంటు పెడతానంటున్నాడు. అందుకే, యిల్లు కొంత పొలం బేరం పెట్టాను. మీరు యిల్లు తిరిగి కొనుక్కోదలుచుకుంటే, నాకు వారం లోపు చెప్పండి" అని ఫోన్ పెట్టేశాడు.

బాబురావు దుర్గాపురంలో అనసూయమ్మ యింటిని కొన్న వ్యక్తి.

"ఆస్తిలా పడివుంటుందని కొన్నానుగానీ, పడగొట్టి కట్టించే ఆలోచన లేదమ్మా!" అని ఆయన అన్నప్పుడు రచిత ఎంతో సంతోషించింది.

భవిష్యత్తులో డబ్బు అవసరపడి అమ్మకానికి పెడితే ముందుగా తెలియజేయమని, వీలైతే తనే కొనుక్కుంటానని చెప్పింది కూడా.

ఆ మాటే గుర్తుంచుకుని ఫోన్ చేశాడు బాబూరావు.

ఆఫీసుకి వెళ్ళినా రచితకి యిల్లు విషయమే పదే పదే మనసులోకి వస్తూ వుంది.

"లంచ్‌కి వస్తావా? అని మెసేజ్ పెట్టి అరగంట అయ్యింది" అని సారంగ్ వచ్చి అడిగేదాకా ఆ విషయమే గుర్తుకు రాలేదు.

"అయామ్.సారీ.." అంటూ లాప్‌టాప్ మూసేసి అతని వెనకాలే నడిచింది.

కారుని వేలెట్ పార్కింగ్‌కి యిచ్చి, హోటల్ లోపలికి వెళ్ళారు. చల్లని ఎయిర్‌కండిషన్డ్ హాల్లో, వేడి వేడి పదార్థాలు హడావుడిగా సర్వ్ చేస్తూ వున్నారు వెయిటర్‌లు.

ముందుగా రిజర్వ్ చేసిన టేబుల్ వైపుకు నడిచాడు సారంగ్. రచిత అతన్ని అనుసరించింది.

గోడలకు ఎత్తైన తైలవర్ణచిత్రాలు. తగిలించి వున్నాయి. వాటి ముందు స్టాండు మీద గుత్తులుగా విరగబుసిన గులాబీ మొక్కలు. ఎయిర్ కండిషన్ చల్లదనానికి తోడుగా గులాబీల పరిమళం హాయిగొలిపేట్టు వుంది.

హడావుడిగా తిరిగే వెయిటర్లు, ప్లేట్లు, స్పూన్ల చప్పుళ్ళు సందడి చేస్తూంటే, మంద్రంగా వినిపిస్తున్న సంగీతం ప్రశాంతతని కలిగించే ప్రయత్నం చేస్తూ వుంది.

కిటికీలో నుంచి బయట వచ్చే పోయే కార్లను చూస్తూ కూర్చుంది రచిత.

"సార్.. మీ ఆర్డర్.." తెల్లగా మల్లెపూవులా వున్న యూనిఫాం వేసుకొచ్చిన వెయిటర్ వచ్చి అడిగాడు.

"మిక్స్‌డ్ వెజ్జీ సూప్, పుల్కా, దాల్ తడఖా" రచిత వైపు చూస్తూ అన్నాడు.

"సేమ్.. ప్లస్ కర్డ్ రైస్" చెప్పింది.

"ఇంకేంటి విషయాలు" టేబుల్ మీద మోచేయి పెట్టి ముందుకు వంగుతూ అడిగాడు.

"మన న్యూప్రాజెక్ట్‌లో 'లేయర్ 3' మీద పనిచేయడానికి యింకా కొంతమందిని హైర్ చేసుకుంటే బావుంటుందేమో సర్"

"రచితా ప్లీజ్. వర్క్ సంగతి వద్దు. యింకేదైనా మాట్లాడు" దాదాపు మందలించినట్టే అన్నాడు.

"అన్నట్టు నువ్వు వెజిటేరియనా? నాన్ వెజిటేరియనా?"

"నా ఆర్డర్ విన్న తర్వాత కూడా మీకు అనుమానమేనా?" అంది నవ్వుతూ.

"జస్ట్, కన్‌ఫర్మేషన్ కోసం అడిగానంతే. "

"మనిద్దరికీ ఒక పాయింట్ కలిసినట్టే అయితే."

రచిత నవ్వింది.

"దుర్గాపురం వెళ్ళావా? ఈ మధ్య కాలంలో"

రచిత కళ్ళు విశాలంగా చేసుకుని, ఆశ్చర్యంగా చూసింది.

"మీకెలా తెలుసు?"

"నాకు మాత్రమే కాదు, ఆఫీసులో వాళ్ళందరికీ తెలుసు. అరగంట మాట్లాడితే అందులో నాలుగుసార్లు దుర్గాపురం అని వినబడుతుందని అంటారు" అన్నాడు నవ్వుతూ.

రచిత కూడా శృతి కలిపి నవ్వింది.

"అవును. నా చైల్డ్‌హుడ్ అంతా అక్కడే గడిచింది. నాకు మా వూరన్నా, మా యిల్లన్నా చాలా యిష్టం."

"అయితే, ఒకసారి నీతోపాటు నేనూ దుర్గాపురం చూడాలి."

"తప్పకుండా"

పొగలు కక్కుతున్న సూప్, పుల్కాలు, కూరలు పెరుగన్నం బల్లమీద పెట్టి వెళ్ళాడు వెయిటర్.

''ఇవాళ నిన్ను లంచ్‌కి యిన్వైట్ చేయడానికి వెనుక ఒక కారణం వుంది. నిన్నో విషయం అడగాలనుకుంటున్నాను.'' వేడి సూప్ బౌల్‌ని ముందుకి లాక్కుంటూ అన్నాడు.

ఏమిటన్నట్టు తలపైకెత్తి చూసింది రచిత.

''నా గురించి నీ అభిప్రాయం ఏమిటి? ఐ మీన్.. నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. అంటే నీ సమాధానం ఏమిటి అని'' నేరుగా అడిగేశాడు.

యిటువంటి సంభాషణ వూహించని రచితకి, ఏం మాట్లాడాలో అర్ధం కాలేదు.

మళ్ళీ సారంగ్ చెప్పడం మొదలుపెట్టాడు.

''ఈ రెండు నెలలనుంచీ నిన్ను బాగా గమనిస్తున్నాను. నీ పనీ, మాట, మన్నన అన్ని నాకు బాగా నచ్చాయి.

నా గురించి చెప్పాలంటే మాది మిడిల్ క్లాస్ ఫామిలీ. చిన్నప్పట్నుంచీ చదువు, కెరీర్‌లాంటి వాటి మీదే శ్రద్ధపెట్టాను.

నో గర్ల్‌ఫ్రెండ్స్, నో ఫ్లర్టింగ్.. యుకెన్ ట్రస్ట్ మి.

పెళ్ళయితే ఫర్‌ఫెక్ట్ ఫ్యామిలీ మేన్ అనిపించుకునే లక్షణాలన్నీ నాలో వున్నాయి.

తెలియాల్సిందల్లా నీ అభిప్రాయమే. నా ప్రపోజల్‌కి నీ సమాధానం ఏమిటో బాగా ఆలోచించుకుని చెప్పు'' మధ్య మధ్య తడబడుతూ, మొహమాటపడుతూ చెప్పదలచుకున్న విషయం పూర్తిచేశాడు.

''నాకు కొంచెం టైం కావాలి.. సారంగ్'' పెరుగన్నం మీద అందంగా పేర్చిన దానిమ్మ గింజలవైపు చూపు మళ్ళించుకుంటూ అంది.

''ఫర్వాలేదు. టేక్ యువర్ టైం. కానీ, ఒకటి గుర్తుంచుకో. నీ నుంచి పాజిటివ్ ఆన్సర్ వస్తే మాత్రం నేను లక్కీయస్ట్ పర్సన్ అని అనుకుంటాను'' ఆర్ధ్రతతో అన్నాడు.

రచిత మౌనంగా విన్నది.

పొద్దున బాబురావ్ ఫోన్‌కి తోడుగా ఆలోచనలకి అదనపుభారం పడ్డట్టయ్యింది.

ప్లేటులో స్పూన్ కదులుతూ వుంది కానీ, తినబుద్ధికాలేదు. సారంగ్ చనువుగా కర్డ్‌రైస్ బౌల్ అందుకుని రచిత ప్లేటులో వడ్డించి, తన పళ్ళెంలో కొద్దిగా వేసుకున్నాడు.

గ్లాసులోకి మంచి నీళ్ళు వంపుకుందామని రచిత జగ్‌ని అందుకోబోయింది. అంతలోనే అతను తీసుకున్నాడు. అతని చేతివేళ్ళు తగలడంతో రచిత చేతిని వెనక్కి తీసుకుంది.

''లెట్ మీ డూ యిట్..'' అంటూ రచిత గ్లాసులోకి ఒంపాడు. వెయిటర్ ఫింగర్ బౌల్స్‌తో బాటూ, బిల్ కూడా తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

''లెట్ మీ షేర్ యిట్'' రచిత అంటున్నా వినకుండా, బిల్ అంతా అతనే పే చేశాడు.

రచితకి యిదంతా యిబ్బందిగా వున్నా, ఏమీ అనలేకపోయింది.

రాత్రి పడుకున్నా నిద్రపట్టకపోవడంతో, నెమ్మదిగా లేచి హాల్లోకి వచ్చి వసుధకి ఫోన్ చేసి మాట్లాడింది.

''వావ్.. నీకు యిల్లు మళ్ళా దక్కించుకునే ఛాన్స్ వచ్చింది. దీనికి ఎందుకింత ఆలోచన? వెంటనే, కొంటానని ఫోన్ చేసి చెప్పు.'' ఉత్సాహంగా అంది వసూ.

"ప్రస్తుతం వున్న పరిస్థితిలో ఆ యిల్లు కొనలేనే"

"మేడమ్ ఏమిటీ బీద అరుపులు వినిపిస్తున్నాయి. మనిద్దరికీ ఒకే శాలరీ వస్తుంది. కథలు చెప్పకు" కవ్వింపుగా అంది.

"నాన్న కాన్సరు ట్రీట్‌మెంట్‌కి నా దగ్గర దాచివుంచిన డబ్బంతా వాడేశాను. దానికి తోడు పదిలక్షలు పర్సనల్ లోన్ కూడా తీసుకున్నాను."

"ఓ నిజమే అయామ్ సారీ. నాకా సంగతే గుర్తులేదు. సరే నీకు ఎంత ఎమౌంట్ అవసరం అవుతుందో చెప్పు, మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తా."

"ఓహ్. థాంక్స్ వసూ. యిప్పుడు చాలా రిలీఫ్‌గా వుంది. రేపు బాంక్ వాళ్ళతో హౌసింగ్ లోన్ విషయం మాట్లాడి, ఎంత ఎమౌంట్ అవసరం అవుతుందో చెప్తాను. నీకైతే ఏ యిబ్బందీ లేదుకదా" అనుమానంగా అడిగింది.

"మరీ ఫార్మల్‌గా మాట్లాడకు. నాకే యిబ్బందీ లేదు. ఇక నీ ప్రాబ్లం సాల్వ్ అయ్యిందిగా. హాయిగా పడుకో. రేపు మాట్లాడుకుందాం."

రచిత గుండెల మీద భారం దించినట్టయ్యింది.

ఒక సమస్య తీరింది. ఇక సారంగ్‌కి ఏం సమాధానం చెప్పాలో ఆలోచించింది రచిత.

కానీ దుర్గాపురంలో యిల్లు తొందరలో తిరిగి సొంతం కాబోతుంది అన్న వూహ ఆమెను వూపిరాడకుండా చేసింది.

సంక్రాంతి పండగకి వాకిట్లో పోటీలుపడి ముగ్గులు పెడుతుంటే "యిక ముగ్గుపిండి అయిపోయింది. వేసింది చాలు" అని అమ్మమ్మ కేకలు పెట్టడం, తొలకరి జల్లుకి పెరట్లో బీరపాదులు పెట్టడం, వంటగదిలోకి పాము దూరినప్పుడు జరిగిన హంగామా..

ఆ యింటితో ముడిపడిన జ్ఞాపకాలన్నీ వరసగా ఒకదాని వెంట ఒకటి గుర్తుకు వచ్చాయి. "ఆఫీసుకి మూడు నెలలు సెలవు పెట్టి అమ్మమ్మను ఆ యింటికి తీసుకుని వెళ్ళి అక్కడ కొన్నిరోజులు గడపాలి" అని నిర్ణయించుకుంది.

"దానికి ఏమేమి ఏర్పాట్లు చేయాలి?" అని ఆలోచించుకుంటూ ఎప్పటికో నిద్రలోకి జారుకుంది.

పోష్ లొకాలిటీఓలో కొత్తగా కట్టిన బంగ్లా, మరీ విశాలంగా లేకపోయినా లేటెస్ట్ ఆర్కిటెక్చర్‌తో చూడడానికి పొందికగావుంది.

అభీ యిల్లు కొన్నప్పటినుంచి, శకుంతలాదేవి దాదాపుగా యిక్కడే వుంది.

హరిప్రసాద్, అభీ మధ్య ఏర్పడిన మనస్పర్ధలు పూర్తిగా పరిష్కారం కాకపోయినా, తీవ్రత చల్లబడడంతో యిటు పి.కె గ్రూప్స్ బిజినెస్, అటు 'షెరోనాటెక్' వ్యవహారాలూ రెండు అభీనే చూసుకోవాల్సి వస్తుంది.

ఏనాటికైనా ఎవరో ఒకరు తగ్గకపోతారా? అన్న ఆశతో ఎదురుచూస్తూ వుంది శకుంతలాదేవి.

ప్రొద్దుటే స్నానం ముగించి, పూజగదిలోకి వెళ్ళబోతుండగా టేబుల్ మీద పెట్టిన సెల్‌ఫోన్ అదే పనిగా మోగుతూవుంది.

"గౌరీ! ఫోన్ ఎవరో చూడు" చెప్పింది.

పూజ సమయంలో కావలసినవారు అయితే తప్ప, సహజంగా ఫోన్ తీయడానికి యిష్టపడదామె.

స్క్రీన్ మీద 'అభినవ్' పేరు చూసి పనిమనిషి గబగబా ఫోన్ తెచ్చి అందించింది.

"అమ్మా నువ్వు యింట్లోనే వున్నావుకదూ" కంగారుగా వుంది అభీ గొంతు.

"అవును యింట్లోనే వున్నాను. నువ్వు ఎందుకు కంగారుపడుతున్నావు? ఏమైంది అభీ" ఆదుర్దాగా అడిగింది.

"నేను ఒక్క అరగంటలో యింటికి వస్తాను. ఈలోపు ఎక్కడికీ వెళ్ళకు ఎవరికీ ఫోన్ చేయకు"

శకుంతల ఇంకోమాట మాట్లాడేలోపలే ఫోన్ కట్ అయ్యింది. అభీ గొంతులో కంగారు శకుంతలని భయపెట్టింది. ప్రశాంతంగా పూజ కూడా చేసుకోలేకపోయింది.

అరగంటకన్నా ముందే అభీ యింటికి వచ్చాడు. వస్తూనే, శకుంతల చేయిపట్టి నడిపించుకుని వెళ్ళి సోఫాలో కూర్చోబెట్టాడు. "అమ్మా ఒక విషయం చెబుతాను. కంగారుపడకుండా విను. మనసు గట్టి చేసుకుని విను. గుర్‌ప్రీత్ అత్తయ్య వస్తున్న కారుకి యాక్సిడెంట్ అయ్యింది. అత్తయ్య మనకిలేదు. చనిపోయింది" నెమ్మదిగా చెప్పాడు.

ఆ వార్త వింటూనే, శకుంతల మొహం పాలిపోయింది.

"ఇప్పుడే పోలీస్ ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి. ఇప్పుడు బెంబేలు పడే సమయంకాదు. మామయ్యకి ధైర్యం చెప్పాల్సిన సమయం." అభీ మాటలతో మనసు కూడగట్టుకుంది ఆవిడ.

వెంటనే, యిద్దరూ హరిప్రసాద్ యింటికి బయలుదేరారు.

ఢిల్లీనుంచి, చండీఘడ్ నుంచి గుర్‌ప్రీత్ తరపు బంధువులు వచ్చేసరికి కాస్త ఆలస్యం అయ్యింది.

రాజకీయ నాయకులు, బిజినెస్ పరిచయాలు, పెద్ద పెద్ద వాళ్ళంతా వచ్చారు. సియానా చిన్నపిల్లలా ఏడుస్తూ వుంటే, శకుంతలాదేవి గుండెలకు హత్తుకుని ఓదార్చే ప్రయత్నం చేసింది.

అందరికంటే, ఎక్కువగా కుంగిపోయింది హరిప్రసాదే పైకి కన్నీళ్ళు కనిపించకపోయినా లోలోపలే కుమిలిపోతున్నట్టుంది అతని మొహం.

అన్ని కార్యక్రమాలు, అయ్యేవరకూ శకుంతల, అభీనే అక్కడి వ్యవహారాలన్నీ చక్కబెట్టారు.

"బాబూరావుగారూ మీరు ఒకటి చెప్పి యింకోటి చేయడం ఏమీ బాగాలేదు" కోపంగా అంది రచిత.

"ఏం చేయను తల్లీ! యిదంతా నా అల్లుడు చేసిన నిర్వాకం"

"మీరు చెప్పి వారం కూడా కాలేదు. యింతలోనే యింటిని వేరేవాళ్ళకి ఎలా అమ్మారు?"

"చెప్పాగా తల్లీ నా అల్లుడు ప్లాంటు కోసం ఐదురూపాయల కాడికి ముందుగానే, డబ్బు వడ్డీకి తెచ్చాడంట.

కొన్న పార్టీ వాళ్ళు మార్కెట్ రేటు కంటే అయిదురెట్లు ఎక్కువ డబ్బు యిస్తామన్నారు. అల్లుడు ముందుగా బజానా కూడా తీసుకున్నాడు. యింక నేనేం చేసేది చెప్పమ్మా!" అవసరాన్నీ, అసహాయతనూ వివరిస్తూ చెప్పాడు బాబూరావు.

రచిత అప్పటికీ ప్రయత్నం విరమించకుండా, బాబూరావుని అడిగి యింటిని కొన్న వ్యక్తి నంబరు తీసుకుంది.

ఆ నంబరుకి ఫోన్ చేసింది. అది యింటిని కొన్న వ్యక్తి మేనేజర్‌ది. "అతను ఎట్టి పరిస్థితులలోనూ ఆ ప్రాపర్టీని వదులుకునేది లేదని, దానికోసం కొద్దిరోజులుగా కాచుకుని వున్నామని" ఖరాఖండీగా చెప్పాడు.

"మేనేజర్‌ని మెయిన్‌టెయిన్ చేస్తున్నారంటే, బాగా డబ్బున్న వాళ్ళే అయివుంటారు. మన వేడికోళ్ళు వాళ్ళకేం లెక్క?" అనుకుంటూ విచారంగా ఫోన్ కట్ చేసింది.

"జీవితంలో గోల్స్, టార్గెట్స్ ఏమీలేవు. దుర్గాపురంలో యింటిని తిరిగి స్వంతం చేసుకోవాలనీ, అమ్మమ్మని అక్కడికి తిరిగి తీసుకుని వెళ్ళాలనే ఒక్క కోరికా తీరకుండా పోయింది."

రచితకి పనిమీద మనసు లగ్నం కావడంలేదు.

"హాయ్ రచితా" సారంగ్ క్యూబికల్ వాల్‌మీద చేతులు పెట్టి లోనికి తొంగిచూస్తూ అన్నాడు.

"హలో.." బలవంతంగా నవ్వే ప్రయత్నం చేసింది. సారంగ్ తన మనసు బయటపెట్టినప్పటి నుంచి ఆఫీసులో అతన్ని తప్పించుకుంటూ తిరుగుతూ వుంది.

"కాఫీ తాగుతూ మాట్లాడుకుందామా?" అడిగాడు.

"సారీ.. సారంగ్ నాకింకో అప్పాయింట్ మెంట్ వుంది" సెల్ లో ఒకసారి టైం చూసుకుంటూ అంది.

"ఫర్వాలేదులే" అతని మొహంలో నిరుత్సాహం దాగలేదు.

రచిత భారంగా నిట్టూరుస్తూ అతను వెళ్ళినవైపే చూసింది.

**సాయంత్రం చిన్ననాటి** స్నేహితురాలు సుజాత యింటికి వెళదామనుకున్నారు వసూ, రచిత.

కొత్త యింటి గృహప్రవేశం అయ్యాక, ఫ్రెండ్సందరినీ పిలిచి చిన్నపార్టీలాంటిది యిస్తోంది.

బాబూరావుతో మాట్లాడాకా రచితకి పార్టీకి వెళ్ళాలనే ఉత్సాహం లేదు. "అలా వెళ్ళొస్తేనన్నా కాస్త నీకు మార్పుగా వుంటుంది. రావాల్సిందే" అని వసూ మెసేజ్ పెట్టడంతో తప్పనిసరై వెళ్ళాలని నిర్ణయించుకుంది.

లాప్‌టాప్ బ్యాగ్ సర్దుకుని, సీట్‌లో నుంచి లేచేలోపే, మాలతినుంచి ఫోన్ "త్వరగా డబ్బు పంపమని."

రామారావు ఆరోగ్యం కుదుటపడింది. ఆ వైద్యం ఖర్చంతా రచితే భరించింది. అయినా, మాలతి అలవాటుగా డబ్బు అడుగుతూనే వుంది. అంతేకాదు, అలా అడగడానికి అస్సలు మొహమాటపడడం లేదు కూడా. మాలతి ఆప్యాయంగా ఉండడానికి కారణం డబ్బు మాత్రమే అనుకుంటే రచితకి బాధగా వుంది.

అనసూయమ్మని వసుధ వాళ్ళింట్లో దించి, దారిలో గిఫ్ట్ కొనుక్కుని ఆటోలో సరూర్ నగర్ వెళ్ళారు.

సుజాత.. సుజీ యింటర్మీడియట్ దాకా వసుధ, రచితలతో బాటే చదివింది. వసూని, రచితని చూస్తునే ఆనందంతో ఎదురెళ్ళి పలకరించింది.

"ఛామనఛాయతో సన్నగా ఉండేదానివి, యిప్పుడు బాగా ఒళ్ళుతేలి, రంగు వచ్చావే" అంది వసుధ గిఫ్ట్ చేతిలో పెడుతూ.

"ఆ..ఁ అలాగంటావా? లావయ్యానా?" అంటూ నడుముకి రెండుపక్కలా చూసుకుని పెద్దగా నవ్వింది.

అప్పటికే చాలామంది గెస్టులు వచ్చివున్నారు.

చేతిలో ఐస్‌క్రీం బౌల్ పట్టుకుని అటుగా వెళుతున్న అమ్మాయిని ఆపి "లక్ష్మీ.. వీళ్ళు నా ఫ్రెండ్స్ రచిత, వసుధ సాఫ్ట్‌వేర్ యింజనీర్లు. ఇది మా ఆడబిడ్డ లక్ష్మి" పరిచయం చేసింది.

ఆ అమ్మాయి మొక్కుబడిగా ఓ నవ్వుపారేసి వెళ్ళింది.

"రండే యిల్లు చూద్దురుగానీ." మేడమీదకి దారితీస్తూ అంది. ఇద్దరూ సుజాతను అనుసరించారు.

"ఏదో మీలాగా సాఫ్ట్‌వేర్ యింజనీరు కాకపోయినా, మా వారూ కాంట్రాక్టులు చేసి బాగానే సంపాదిస్తున్నారు."

మాట్లాడుతూనే అన్ని గదులూ చూపించింది.

"ఇది మాస్టర్ బెడ్రూం" తలుపు తీసింది, అందులో పెద్ద సైజు మంచాలు, బెడ్‌కి రెండువైపులు చిన్న చిన్న స్టోరేజ్ యూనిట్స్, గోడవారగా సోఫాలు వేసివున్నాయి, ఫర్నిచర్ అంతా గ్రానైట్ ఫ్లోర్ మీద ప్రతిఫలిస్తూ వుంది.

"స్థలం కాక కట్టడానికే కోటి రూపాయలదాకా అయ్యింది." చెబుతూ వుండగానే "సుజీ..సుజీ" కిందనుంచి మగగొంతుక వినిపించింది. "మా వారు.. ఏం కావాలన్నా నన్ను పిలవాల్సిందే" రచిత వైపు చూసి నవ్వింది.

రెండు నిమిషాల తర్వాత మూడేళ్ళ పిల్లవాడిని చంకనేసుకుని వచ్చింది.

"వీడు మా రెండో అబ్బాయి సుదీప్. నానీ ఆంటీలకు హై..హై చెప్పు...చెప్పు" అంటుంటే వాడు నవ్వుతూ చెయ్యి పైకెత్తాడు

"ఆంటీలు" అన్న పదం వింటూనే వసుధ మొహం మండిపోయింది.

"ఫర్వాలేదులేవే మీకూ పెళ్ళిళ్ళయి వుంటే, నాలాగే యిద్దరు పిల్లలు ఉండేవాళ్ళు. మీరేమో ఉద్యోగాలు చేస్తూ, విమానాల్లో తిరుగుతూ ఉంటారు. అవునే.. అమెరికా ఛాన్సు వచ్చిందా మీకెప్పుడైనా?

రాలేదన్నట్టు తలలు అడ్డంగా వూపారు యిద్దరూ.

"అయ్యో!" మూతి విరిచి సానుభూతి తెలిపింది.

రెండడుగులు వేసి, "అన్నట్టు ఈ చీర ప్రత్యేకంగా ఈ పార్టీ కోసమే కొన్నాను. డెబ్బైవేలు అయ్యింది. అన్‌కట్ డైమెండ్ సెట్ కూడా బావుందా? అంటే నా ఒంటికి నప్పిందా?" అని.

వసుధ మాట్లాడకుండా మూతి ముడుచుకుంది.

"బావుంది" రచిత జవాబిచ్చింది.

"ఈ బాత్రూమ్‌లో పెద్ద టబ్ పెట్టించాం. హాట్ వాటర్ జెట్ కూడా వుంది" అంటూ బాత్రూం డోర్ తీయబోయింది.

"ఫర్వాలేదులే.. సుజీ" అని రచిత అంటున్నా వినిపించుకోలేదు. డోర్ ఓపెన్ కాలేదు. యింకొంచెం బలంగా తిప్పబోయింది.

"బహుశా లోపల ఎవరన్నా ఉన్నారేమో" వ్యంగ్యంగా అంది వసూ.

"అవునేవ్ పొరపాట్న లాగాను కాదు. లేనిపోనిది" పకపకా నవ్వింది. ఇంతలో, సుజాత పెద్దకొడుకు వచ్చాడు. "అమ్మా నిన్ను నానమ్మ పిలుస్తుంది" అంటూ.

"మా వాడు అన్నిట్లో ఫస్టే" అని చెప్పబోతుంటే, వాడు కాస్తా పారిపోయాడు.

"పోనీలే వాడి చేత మళ్ళా "ఆంటీ" అని ఎక్కడ వినాల్సొస్తుందో అని హడలిచచ్చాను.."

వసుధ రచిత చెవిలో గొణిగింది.

"వస్తానే. మా అత్త పిలుస్తుందంట. ఏమిటో ఉట్టి మా లోకం అనుకో. ప్రతిదానికీ నన్ను పిలవాల్సిందే నేను లేకపోతే ఏ పనీ తెమలదు. మీరు మాత్రం భోజనం చేసే వెళ్ళండే ఒన్ ఫిఫ్టీ ఐటమ్స్ పెట్టించాం."

పెద్దగా చెబుతూ మెట్లు దిగి వెళ్ళింది.

బఫే భోజనం తిన్నామనిపించి బయటపడ్డారు.

"అబ్బా ... ఒకటే బ్రాగింగ్. తల పగిలిపోయిందనుకో. మన గురించి ఒక్కమాట కూడా అడగలేదు. చూశావా?"

తిరిగి వచ్చేటప్పుడు ఆటోలో కూర్చుంటూ అంది వసుధ.

"పోనీలేవే" రచిత నవ్వింది.

"దానికి మనలాగా జాబ్ చెయ్యలేకపోతున్నానని దుగ్ధ. అందుకే, తనెంత గొప్పగా బతుకుతుందీ మొగుడు, అత్త, పిల్లలు తనమీద ఎంత ఆధారపడి వుందీ అతిగా చెప్పుకుంటుంది."

"కానీ, భర్త, పిల్లలుతో అది నిండుగా వుంది కదూ" తనలో తాను మాట్లాడుకుంటున్నట్టే అంది.

ఒక్క క్షణం వసుధ ఏమీ మాట్లాడలేదు.

"బావుంది. నువ్వెంత పొయిటిగ్గా చెప్పినా నేను పెళ్ళి రొంపిలోకి దిగదలచుకోలేదు. సాత్విక్, నేనూ కొద్దిరోజులు లివ్ యిన్ రిలేషన్ షిప్‌తో ఉందామనుకుంటున్నాం" చల్లగా విషయం చెప్పింది.

"ఎవరికి తోచినట్టు వాళ్ళు ముందుకు వెళుతున్నారు జీవితంలో. నేనే ఎక్కువగా ఆలోచిస్తూ ఏ నిర్ణయం తీసుకోలేక పోతున్నానా? నిలబడ్డ చోటే వుంటే ముందుకు సాగలేనేమో" రకరకాల ఆలోచనలు ఒక్కసారిగా మెదిలాయి.

"సాత్విక్ మెసేజ్ పెట్టాడు. అర్జంటుగా మాట్లాడాలట. యిప్పుడే టింకర్స్ బేకరీదాకా వెళ్ళొస్తాను"

దాదాపుగా యిల్లు సమీపిస్తుండగా అంది.

"ఈ టైంలో వెళతావా?" రచిత ఆశ్చర్యంగా అడిగింది.

"టింకర్స్.. మా పక్క వీధిలోనే, టెన్ మినిట్స్‌లో వుంటాను. సాత్విక్ తోడుంటాడుగా భయం లేదులే. యింట్లో అడిగితే మెడికల్ షాప్ దాకా వెళ్ళాలని చెప్పు" అని,

"భయ్యా ఆటో కొంచెం సైడ్‌లో ఆపవా" ఆటోవాలాతో చెప్పి దిగిపోయింది.

"నాకు తెలుసు. అది మనమాట వినేరకం కాదని" వసూ తండ్రి కోపంతో అరిచాడు.

వసుధ మెడికల్ షాప్‌కి వెళ్ళిందంటే, నమ్మలేదాయన.

అనసూయమ్మ అప్పటికే, మంచి నిద్రలో వుంది. బి.పి టాబ్లెట్ వేసుకుని పెందలాడే పడుకోవడం కొన్ని సంవత్సరాలుగా రుక్మిణమ్మకి అలవాటు అయిపోయింది.

"కాస్సేపు నడుం వాలుస్తూనే నిద్రలోకి జారిపోయివుంటుంది" అనుకుంటూ టైం చూసింది రచిత. 9.30 అయ్యింది.

"అమ్మమ్మని యిక్కడే నిద్రపోనీ. మధ్యలో లేపితే, రాత్రంతా నిద్రపట్టక యిబ్బంది పడుతుంది. నువ్వుకూడా వసూ బెడ్రూంలో పడుకో యివాల్టికి" వసూ వాళ్ళమ్మ అంది.

"లేదాంటీ! నాకు పెండింగ్ వర్క్ వుంది. ఆఫీస్ లాప్‌టాప్ కావాలి. యింటికి వెళతాను. అమ్మమ్మని రేపొద్దున్నే వచ్చి తీసుకువెళతాను." అని చెప్పి బయలుదేరింది.

రచిత వద్దన్నా వినిపించుకోకుండా, వసూ వాళ్ళ నాన్నగారు, స్కూటర్ మీద యింటి దగ్గర డ్రాప్ చేశారు.

టైం దాదాపుగా పదిగంటలు కావస్తుంది.

గేటెడ్ కమ్యూనిటీ కాబట్టి రచితకి పెద్దగా భయం అనిపించలేదు. చల్లగాలికి శరీరం వణుకుతూ వుంది.

కాంపౌండ్‌వాల్ మీది లైట్ల వెలుతురులో చెట్ల నీడలు భయం గొల్పేలా అల్లుకున్నాయి.

వరండా మెట్లు ఎక్కి మెయిన్ డోర్ తీసింది.

హాల్లో డిమ్‌లైట్ వల్ల అంతా మసక మసగ్గా వుంది.

ఇంతలో ఏదో చప్పుడు సోఫాలో ఒక ఆకారం కదిలినట్టయ్యింది.

భయంతో కెవ్వుమని అరిచింది రచిత.

స్విచ్ బోర్డ్ దగ్గరికి వెళ్ళి లైట్ వేసింది.

"హే.. కూల్. యిట్స్ మీ. అభినవ్" ఒక్క అంగలో వచ్చి రచిత భుజాల చుట్టూ చేయివేశాడు.

భయంతో ఆమె శరీరం యింకా కంపిస్తూనే వుంది.

"ఐ యామ్ సారీ. నువ్విచ్చిన స్పేర్ కీ నా దగ్గరే వుంది. ఈ దారిలోనే వెళుతూ యిచ్చేసి వెళదామని వచ్చాను. యింట్లో ఎవ్వరూ లేరు, వెనక్కి వెళదామనుకునేలోపు నువ్వు ఒక్కత్తివే వస్తూ కనిపించావు. చిన్న సర్ ప్రైజ్ చేద్దామని సరదాగా ట్రిక్ చేశాను. కారు కూడా దూరంగా పార్క్ చేశాను. అందుకే, గెస్ చేసి వుండవు. అయామ్ సారీ.. హనీ" లాలనగా అన్నాడు.

రచితలో భయం తగ్గింది. కానీ, పొద్దుటినుంచి ఎదురౌతున్న డిసప్పాయింట్‌మెంట్స్... ఒంటరితనం.. అన్నీ కలిసి ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది.

"రచీ.. ఏమైందీ.. ఆర్యూ ఓ.కే!?" ఆప్యాయంగా అడగడంతో మరింతంగా కన్నీళ్ళు పొంగుకొచ్చాయి.

నిశ్శబ్దంగా ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకుని, చేతితో ఆమె తలని పైకెత్తాడు.

క్రమంగా మనసులోని నిరాశా, నిస్పృహ అతని చేతుల్లో కరిగిపోతున్నట్టు అనిపించిందామెకి.

"ఏదో కారణం వుంది నువ్వు బాధపడడానికి.. ఏమిటో నాకు చెప్పవూ?" భుజాలు పట్టి కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

ఏడ్చి, ఏడ్చి రచిత మొహం ఎర్రగా అయ్యింది.

ఏమీ లేదన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

"నన్ను మిస్సవుతున్నావు కదూ. నువ్వు చెప్పకపోయినా నేను అర్థం చేసుకోగలను."

"మొన్నటిదాకా సియానా గురించి ఆలోచించి మనసుని కట్టడిచేసే ప్రయత్నం చేసింది. కానీ వల్లకావడంలేదు. జీవితాన్నే కోల్పోయినట్టు వుంది.

"అతనికీ అటువంటి ఉద్దేశ్యమే వుంటే ఈ క్షణంలోనే తేలిపోవాలి" అనుకుంటూ, నెమ్మదిగా అతనికి దూరంగా జరిగింది.

"నిజం అభీ.. ఐ మిస్ యూ. అంతేకాదు ఐ లవ్ యూ..." మనసులోని మాట చెప్పేసింది.

అతను చలించిపోయినట్టు రచిత కళ్ళలోకి చూశాడు.

"అతని నుంచి సమాధానం కావాలి. ఇది తప్పో ఒప్పో తెలియదు" అనుకుంటూ. దైవాన్ని ప్రార్థిస్తూ చేతులు రెండూ గుప్పిట చేర్చి అతనివైపే చూస్తూ వుంది.

అభీ యిబ్బందిగా తలపక్కకి తిప్పుకున్నాడు.

"ఇదిగో..కీ యిక్కడ పెడుతున్నాను" టీపాయ్ మీద ఉంచి రెండడుగులు వేశాడు.

రచిత మొహం పాలిపోయింది.

"అతని దగ్గరితనాన్ని మరోలా అర్థం చేసుకోవడం నా తప్పేనన్నమాట. లేకపోతే, కాఫీషాప్ దగ్గర అన్నమాటలు గుర్తుంచుకుని యిలా కక్షతీర్చుకుంటున్నాడా?"

రచిత బేలగా మారిపోయింది.

గబగబా ముందుకు వచ్చి అతని చేయిపట్టుకుని ఆపింది.

"అభీ ప్లీజ్ ఈ ఒక్కపూటకీ యిక్కడ ఉండు. ఇక నిన్నేమీ అడగను. అయామ్ ఫీలింగ్ లోన్లీ"

"సారీ రచితా నేను చాలా బిజీగా వున్నాను. నాకు కుదరదు. ప్లీజ్ అండర్‌స్టాండ్" నెమ్మదిగా ఆమె చేయి వదిలించుకుని గబగబా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

రచిత మనసు బండబారినట్టు అయిపోయింది.

"పిచ్చితనంతో ఆశల తీగెలతో వేసిన పందిరి కాస్తా పుటుక్కున తెగి అగాధంలో పడిపోయినట్టు అయ్యింది పరిస్థితి. హార్ట్‌బ్రేక్ అంటే యిదేనా?" కుమిలిపోతూ కన్నీళ్ళతో దిండుని తడిపేసింది. అస్తవ్యస్తమైన ఆలోచనలతో రాత్రంతా గడిపేసింది.

"మరీ బొత్తిగా యిలా ఉంటే, ఎలా అన్నయ్యా?" హరిప్రసాద్‌ని అనునయిస్తున్నట్టుగా అంది శకుంతల.

"ఇప్పుడు, నేను చలాకీగా తిరిగి మాత్రం ఏం చెయ్యాలి? అన్నీ అభీ చూసుకుంటున్నాడుగా" విరక్తిగా అని మళ్ళీ పుస్తకంలో తలదూర్చాడు. స్నేహితుడైన మోహన్ కాలూ, చేయితో బాటూ, మాట కూడా పడిపోయి జీవచ్ఛవంగా వీల్ ఛెయిర్‌కి పరిమితమయ్యాడు. అమితంగా ప్రేమించిన భార్య ఈ లోకంలోనే లేదు.

నెలరోజుల వ్యవధిలో జరిగిన ఈ రెండు హఠాత్పరిణామాలు హరిప్రసాద్‌ని బాగా కుంగదీశాయి.

"పోయినవాళ్ళు పోయారనుకో. యిలాగ నిరామయంగా వుంటే ఎలా కుదురుతుంది? ఒక సరదా, సంతోషమూ లేకుండా యిలా బైరాగిలాగా ఎన్నాళ్ళుంటావు?" రెండు నెలలుగా చెబుతున్న మాటలనే మళ్ళీ చెప్పింది.

హరిప్రసాద్ చదువుతున్న పుస్తకం మధ్య వేలుపెట్టి మూసి, గట్టిగా నిట్టూర్చాడు. ఏదో చెప్పబోయినవాడల్లా ఆగి, మళ్ళా పుస్తకం తీసి అందులో మునిగిపోయాడు.

శకుంతలాదేవి, భోజనం పళ్ళెంతో బాటు మంచినీళ్ళు టేబుల్ మీద పెట్టి, "అభీ, వచ్చే వేళయ్యింది... వస్తానన్నయ్యా" అని చెప్పి వచ్చేసింది.

"మామయ్య ఎలా వున్నాడు?"

అప్పుడే హాల్లోకి అడుగుపెట్టిన అభినవ్ చొక్కా కాలరు వెనక్కిలాగి కూర్చుంటూ అన్నాడు.

పనిపిల్ల గౌరి వచ్చి మంచినీళ్ళు అందించి, లాప్‌టాప్ బ్యాగ్ తీసుకుని లోపలికి వెళ్ళింది.

"ఎలా వుంటాడు? ఎప్పుడూ దిగులు పడుతూ కూర్చుంటాడు. మనిషి యింకా ఈ లోకంలోకి రాలేదు. ఇంట్లో పిల్లా పాప వుంటే యిన్నాళ్ళూ దిగులుగా కూర్చోగలిగేవాడా? తొందరగా మీ పెళ్ళి జరిగితేనన్నా మామయ్య డిప్రెషన్ నుంచి కోలుకుంటాడేమో" నిష్ఠూరంగా అంది.

"యిప్పుడు పెళ్ళి సంగతి ఎందుకులేమ్మా" చిరాగ్గా అన్నాడు.

"ఇప్పుడు కాక యింకెప్పుడని? ఈ యింట్లో స్మశాన నిశ్శబ్దం యింకా ఎన్నాళ్ళు? అభీ..? ఒకటి గుర్తుంచుకో, మనం కష్టాల్లో ఉన్నప్పుడూ మామయ్య మనల్ని ఆదుకున్నారు." కోపంగా అంది.

"నేనామాట ఎప్పుడైనా కాదన్నానా?" గంభీరంగా అన్నాడు.

"మామయ్య యిప్పుడు చాలా మారిపోయాడురా.. ఆయనే దగ్గరుండి, నా పేరుతో ఉన్న షేర్లు నీ పేరు మీద ట్రాన్స్‌ఫర్ చేయించారు కదా! మోహన్ అంకుల్ తరఫున చైతూనే బిజినెస్ విషయాలు చూసుకుంటున్నాడు. మీ స్నేహితులిద్దరిదీ ఒకేమాట యిప్పుడు, అంతా నీ యిష్టప్రకారమే నడుస్తుంది. ఇక నీకొచ్చిన అభ్యంతరం ఏమిటి? దయచేసి అడ్డుచెప్పకు అభీ" లాలనగా అంది.

"సరిగ్గా పద్దెనిమిదేళ్ళ క్రితం ఏం జరిగిందో మళ్ళా యిప్పుడు అదే రిపీట్ చెయ్యమంటావా? మామయ్య డిప్రెషన్‌లో వున్నాడు, సియానాకి కంపెనీ వ్యవహారాలు చూసుకోవడం చేతకాదు. ఇదే అవకాశంగా వాడుకుని మనం పెత్తనం చేద్దామా? సియాని భార్యగా చేసుకుని అన్నింటికీ వాళ్ళు మన మీద ఆధారపడేలాగా చేద్దామా? అదేగా మామయవాళ్ళు మనకి చేసింది. నేను ఎక్కడ తెలివి తెచ్చుకుంటానో అని నన్ను కంట్రోలు చేయాలని చూశారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. నేనూ అలాగే చెయ్యనా?" వెటకారంగా అన్నాడు.

శకుంతలాదేవికి కోపం వచ్చింది.

"అంటే, మామయ్య చేసింది సాయంకాదు. అవకాశవాదం అంటావా?" గట్టిగా అంది.

"ఎప్పుడూ మనుషుల తీరు ఒక్కలా వుండదమ్మా! మొదట్లో ప్రేమతో మోసే బాధ్యతలు తరువాత బరువుగా గుదిబండలుగా అనిపించొచ్చు. నడకరానప్పుడు చేయిపట్టి నడిపించినట్టు అనిపిస్తే శక్తి వచ్చాక మనల్ని నియంత్రిస్తున్నట్టు అనిపిస్తుంది.

అందుకే, రిలేషన్స్ బాగా వుండాలంటే, ఎవరికి వారు స్వతంత్రంగా వుండాలి.

మామయ్య చేసిన సాయంతో అవకాశవాదం కూడా వుందనేది అందుకే. నిజంగా సాయం చెయ్యాలనుకుంటే, నిన్ను సమర్థురాలిగా తీర్చిదిద్దాల్సింది. నీ వ్యవహారాలు నువ్వే చూసుకోగలిగేట్లు చేయాల్సింది" ఓపిగ్గా వివరించి చెప్పాడు.

శకుంతలాదేవి దగ్గర అనడానికేమీ మాటలు మిగల్లేదు. అభీ అలా రాత్రిళ్ళు చెప్పాపెట్టకుండా బెజవాడ వచ్చినప్పుడు, బిడ్డ బాధపడుతున్నాడని తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి, గురుప్రీత్‌కి జంకి, పట్టుమని పదిరోజులు కూడా అభీ దగ్గర వుండేది కాదు, వ్యవహారాలు చూసుకోవడం చాతగాక, ఆస్తిని, కన్నబిడ్డను అన్నగారి చేతుల్లో పెట్టి పరాయిదానిలా చూస్తూ ఉండిపోయింది.

భవిష్యత్తు మీద భయంతో బతికింది.

స్వేచ్ఛగా ఆలోచించగలిగినవాళ్ళు ఈ తరం పిల్లలు పరాధీనంలో ఒదిగి వుండాల్సిన పని ఏముంది?

గతానికీ, వర్తమానానికీ మధ్య అడ్డుగా వున్నదేదో కూలిపోయినట్టనిపించి, శకుంతల దృక్కోణం మారిపోయింది.

"అయితే యిప్పుడేమంటావు?" నిదానించి అడిగింది.

"ముందు సియానాకి కంపెనీ వ్యవహారాలన్నీ, స్వయంగా చూసుకోవడం నేర్పిస్తాను. బాధ్యత తెలిశాక, ఆమెకీ ఆలోచన పెరుగుతుంది. ఇగతా విషయాలన్నీ తర్వాత. మామయ్యకి యిదే నేను చేయగలిగిన సాయం అనుకుంటాను" ఖండితంగా చెప్పాడు.

"ఎలా సాగుతుంది నీ సహజీవనం?"

వసుధతో బాటు నడుస్తూ అడిగింది రచిత.

"ఇల్లు సెటప్ అయిపోయింది. కొత్తలో అంతా థ్రిల్లింగ్‌గానే వుంటుందిగా" చిలిపిగా నవ్వుతూ అంది వసుధ.

ఐడీలు స్కాన్ చేసి ఆఫీసులోకి అడుగుపెడుతూనే, బ్లాక్ కలర్ సూట్‌లో హడావుడిగా ఛాంబర్‌లోకి వెళుతున్న అభీ కనిపించాడు. అతని పక్కనే సెక్రటరీ సియానా కూడా ఉన్నారు. ఎప్పుడూ స్టైలిష్ ఐకాన్‌లా కనిపించే సియానా, పక్కా ప్రొఫెషనల్‌గా డ్రస్ చేసుకుని వచ్చింది.

పాయింటెడ్ హైహీల్స్‌కి బదులుగా, బ్లాక్ కలర్ పాలిష్‌తో తళతళలాడుతున్న షూస్, అదే కలర్ స్కర్ట్, డిజైనర్ టాప్‌కి బదులుగా వైట్‌షర్ట్, దానిమీద బ్లాక్ కలర్ బ్లేజర్ వేసుకుని వుంది.

అభీకి కాస్త వెనకాలగా నడుస్తూ వుంటే, అతని కన్నా నాలుగైదు, అంగుళాలు మాత్రమే తక్కువ వున్నట్టు తెలుస్తుంది ఆమె ఎత్తు. "మాచింగ్ డ్రస్సులలో, పర్ఫెక్ట్ హైట్స్‌తో చూడడానికి ముచ్చటగా వున్నారు కదూ.." వసుధ మామూలుగా అంది.

రచితకి మనసులో ముల్లు గుచ్చుకున్నట్టయ్యింది.

"అవును"

ఫీలింగ్స్ బయటపడకుండా జాగ్రత్తపడుతూ అంది.

"ఇప్పుడు పి.కె గ్రూప్స్‌కి ఛైర్మన్ అభినవ్.. తెలుసా? C.E.O రాజారావ్‌ని పీకెయ్యడంతో ఈయన హేండ్ వుందనుకుంటున్నారు. రాజారావ్ ప్లేస్‌లో ఒక యంగ్‌ఛాప్‌ని పెట్టాడుట."

వింటున్నట్టు మౌనంగా తలాడించింది రచిత.

"సియానాని ట్రెయిన్ చేసే విషయంలో, కాబోయే భర్తగా అభీనే బాధ్యతలు స్వీకరించాడుట. మన సాఫ్ట్‌వేర్ వింగ్ మీద అతనికి స్పెషల్ ఫోకస్ వుందని చెప్పుకుంటున్నారు.

ఆల్రెడీ వేరే విషయాల్లో ట్రైనింగ్ అయిపోయింది. ఇక బిజినెస్ మాత్రమే మిగిలివుంది.." కొంటెగా నవ్వుతూ అంది.

రచిత గొంతుకేదో అడ్డుపడ్డట్టయ్యింది. కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. వసుధ వైపు చూడకుండా గబగబా నడుచుకుంటూ తన క్యూబికల్‌కి వెళ్ళింది.

లాప్‌టాప్ స్క్రీన్ వంక, నిస్తేజంగా చూస్తూ కూర్చుంది. అలా ఎంతసేపు వుందో తెలియదు.. వెనకాలగా బూట్ల చప్పుడు వినిపించింది. క్షణకాలంపాటు వెనకాల ఎవరో నిలబట్టనిపించి, వెనక్కి తిరిగి చూసింది. రచిత చూసే లోపలే వెళ్ళిపోయినట్టున్నారు. బ్లాక్ కలర్ సూట్ వేసుకున్న వ్యక్తి అని మాత్రం గుర్తించగలిగింది.

లంచ్ టైంలో సారంగ్ కనిపించాడు.

విచారంలో ఉన్న రచిత మరింతగా ముడుచుకుపోయింది.

"ప్లీజ్.. నిన్ను యిబ్బంది పెట్టాలని రాలేదు. కొంచెం మాములుగా వుండు" అభ్యర్ధించాడు.

ఆమె బలవంతంగా నవ్వే ప్రయత్నం చేసింది.

"అప్రయిజల్ రిపోర్ట్స్ పూర్తయ్యాయి. కొత్త మేనేజ్‌మెంట్... బోనస్‌లు, హైక్‌లు ఎంత యిస్తుందో.. చాలా ఎగ్జయిటింగ్‌గా వుంది." ఉత్సాహంగా చెప్పాడు.

"ఇల్లు కొనడానికి, ఆ డబ్బు ఉపయోగించేట్టయితే ఎంతో సంతోషంగా వుండేది. కానీ, ఆ ఆశ లేదు." రచిత బరువుగా నిట్టూర్చింది.

"సారీ.. నువ్వేదో మూడవుట్‌లో ఉన్నట్టున్నావు. మళ్ళీ కలుస్తాను." నీరసంగా ఉన్న రచిత మొహం చూసి, వెళ్ళిపోయాడతను.

క్యూబికల్‌లోకి వస్తూనే, లాప్‌టాప్ పక్కన ఒక వైట్‌పేపర్ రెపరెపలాడుతూ కనిపించింది.

రచిత ఆసక్తిగా దాన్ని చేతిలోకి తీసుకుంది, హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ నుంచి ఆ లెటర్.

"మీ క్యూబికల్‌ని మిగతా వాటిలాగే మామూలుగా వుంచవలసింది. ఆఫీస్ యొక్క యింటీరియర్‌కి భిన్నంగా ఉండరాదు." అని లెటర్ సారాంశం.

ఆ కాగితం చదువుతూనే విస్తుపోయింది రచిత.

"ఇన్నాళ్ళుగా పట్టించుకోనివారు, యిప్పుడు హఠాత్తుగా నోటీస్ యివ్వడం ఏమిటో" అనుకుంటూ.

ఒక్కొక్కటే తీసి సర్దడం మొదలుపెట్టింది.

గణపతి విగ్రహం, ముచ్చటపడి తెచ్చుకున్న ఫ్లవర్ వాజ్‌లు అన్నీ ఒక పేపర్ బ్యాగ్‌లో పెట్టింది. చిన్న చిన్న పూసలదండలు లాంటివి జిప్‌లాక్‌లో వేసి డ్రాలో పడేసింది.

టీం మేట్స్, కొలీగ్స్ రచిత క్యూబికల్ సాదాసీదాగా కనిపించడం చూసి, ఒక్క క్షణం ఆగి, విచిత్రంగా చూసి వెళ్ళారు.

"నీ క్యూబికల్ నీలాగే, ప్రత్యేకంగా వుండేది. ఎందుకిలా చేశావే?" అని అడిగినవారికి సమాధానంగా చిన్నగా నవ్వింది.

"తను పెద్ద స్పెషల్ అని బోడి ఫీలింగ్. తిక్క కుదిరింది" యిద్దరు లేడీ కొలీగ్స్ గుసగుసలాడుకుని నవ్వడం కూడా రచిత చెవిన పడింది. దేనికీ స్పందించలేదామె.

మాలతి ఫోన్ చేసింది.

"సుదీప్ కోచింగ్ సెంటర్లో చేరతానంటున్నాడు. పాతికవేలు సర్దగలవా? " అంటూ..

"చూస్తాను పిన్నీ" చెప్పి ఫోన్ పెట్టేసింది.

"బంధాల్ని అవసరాల కోసం అందంగా అల్లుతారు కొందరు." వద్దనుకున్నా మనసు భారంగా అయ్యింది.

నాలుగ్గంటలకల్లా ఆఫీసులో అందరూ ఎదురుచూస్తున్న అప్రైజల్స్ వచ్చాయి.

రచితకి బోనస్, హైక్‌తో బాటు సీనియర్ సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా ప్రమోషన్ కూడా వచ్చింది.

"రచిత పార్టీ యివ్వవలసిందే" సాత్విక్, వసూ గొడవ చేశారు. సారంగ్ కూడా వాళ్ళతో కలిశాడు.

శుక్రవారం కావడంతో ఆఫీసు కోలాహలంగా వుంది. లాభాలు పొందిన వాళ్ళు నవ్వుతూ తుళ్ళుతూ వుంటే, ఆశించిన రీతిలో అభివృద్ధి రానివాళ్ళు సీరియస్‌గా వున్నారు.

కబుర్లు చెప్పుకుంటూ సరదాగా నవ్వుతూ మెట్లు దిగివస్తున్నారు రచిత, ఆమెతో బాటు వసూ, సాత్విక్, సారంగ్‌లు.

కారు పార్కింగ్ దగ్గర సియానా నిలబడి ఎవరికోసమో ఎదురుచూస్తూ కనిపించింది. సాధారణంగా, అంత పెద్ద స్థాయిలో ఉన్నవాళ్ళు తరుచుగా ఆఫీసుల్లో కనబడరు. ఒకవేళ వచ్చినా చుట్టూ నలుగురైదుగురు మనుష్యులు ఎప్పుడూ వుంటారు.

అలాంటిది సియానా వరుసగా రెండురోజులు ఆఫీసు దగ్గర కనిపించడం విచిత్రమే.

చేతిలో సెల్‌ఫోన్‌లోకి చూస్తూ, ఒక్కసారిగా తల ఎత్తి తనవైపే తీక్షణంగా చూస్తున్నట్టు అనిపించింది రచితకి.

ఆమెను చూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వింది.

సియానా నిర్లక్ష్యంగా రచితవైపు చూసి చూపు మరల్చుకుంది. క్షణం పాటు ఆమె కళ్ళల్లో ద్వేషాన్నీ, అసూయనీ చూడగలిగింది రచిత.

నేను చూసింది నిజమా? భ్రమా? అనుకుంటుండగానే, బ్లాక్ లిమోసిన్ కారు వచ్చి ఆగింది. డ్రైవింగ్ సీటులో అభీ కూర్చుని ఉన్నాడు.

రచితను చూస్తూనే చెయ్యి వూపాడు.

ముందు జరిగిన సంఘటనలు, సియానాతో అభీని చూడగానే బాధపడ్డ విషయం గుర్తొచ్చి రచిత ముడుచుకుపోయింది.

"ఏయ్.. నిన్నే పలకరిస్తున్నాడు. బాస్. మరి మర్యాదగా వుండు" వసూ భుజం మీద గిల్లడంతో రచితలో వివేకం మేల్కొంది. మనసు దహించుకుపోతూనే నెమ్మదిగా అటువైపుకి వెళ్ళింది.

"హా.. సియా. నేను చెప్పానే రచిత అని తనే"

కారు సీటులో నుంచి దిగకుండానే అన్నాడు.

"ఓ... రచితా..."

ఈసారి తప్పనిసరిగా  పలకరించింది. ఆమె నవ్వులో అపహాస్యం.

"హలో" అంటూ మర్యాదగా చేయి ముందుకు చాపింది రచిత.

అది గమనించనట్టే ఫోన్‌లో తలదూర్చింది సియానా.

రచితకి అక్కడ అలాగే నిలబడడం యిబ్బందిగా తోచింది.

ఆ పరిస్థితిని ఎక్కువసేపు కొనసాగించకుండా "లెట్స్..గో అభీ. అర్జంటుగా యింటికి వెళ్ళాలి" అని కారు ఎక్కడం, వెంటనే కారు రయ్యిన దూసుకువెళ్ళిపోవడం. రెప్పపాటులో జరిగాయి.

వెళ్ళిపోతున్న వాళ్ళకి చేతులూపాలా? వంగి, దణ్ణాలు పెట్టాలా? ఒక్క నిముషం మర్యాద కోసం అన్నా అంతస్థు దిగి పలకరించలేకపోయారు. రచితకి తనొక పెద్ద ఫూల్‌లాగా అనిపించింది.

"అంత పెద్దవాళ్ళకి ఆ మాత్రం వుంటుందిలే. నువ్వు రా!" వసుధ చేయిపట్టి లాగడంతో అక్కడనుంచి కదిలింది రచిత.

రాత్రి ఎనిమిది గంటల సమయం. లిమోసిన్ కారు వచ్చి నేరుగా హరిప్రసాద్ యింటిముందు ఆగింది. వాచ్‌మన్ పరిగెత్తుకుంటూ వచ్చి గేటు తీశాడు.

డ్రైవ్‌వేలో నుంచి కారు నేరుగా పోర్టికోలో ఆగింది. ముందు సీటులో కూర్చున్న సియానా, కారు డోరు తీయబోతూ ఒక్క క్షణం ఆగింది.

"థాంక్యూ అభీ. నిజంగా నాకు బిజినెస్ వ్యవహారాలంటే యిప్పుడు యింట్రెస్ట్ కలిగింది. అంతా నీ వల్లే" నాజూకైన చేతిని అతని చేతిమీద తాకిస్తూ అంది.

"యిప్పుడు అంటున్నావ్. యింతకు ముందు లేదా?"

"ఊహూ!" మూతిని అందంగా బిగించి తల అడ్డంగా తిప్పింది. "నీ బలవంతం మీద యివన్నీ నేర్చుకోవడానికి ఒప్పుకున్నాను. యాఁ..కానీ, థింగ్స్ ఆర్ నాట్ యాజ్ బాడ్ యాజ్ దె లుక్! యిదివరకు నా ప్రపంచం, డాడీ ప్రపంచం పూర్తి భిన్నంగా వుండేది. ఇప్పుడు నేనూ, డాడీ బిజినెస్ విషయాలు డిస్కస్ చేసుకుంటున్నాము. ఆయనలో కూడా చాలా మార్పు వచ్చింది. చాలా థాంక్స్ బావా" ఆర్ద్రతతో ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"ప్లీజ్. సియా యిదేమంత పెద్ద విషయం కాదు, రేపు నందగోపాల్‌తో మీటింగ్ వుంది. నైన్‌కల్లా రెడీగా వుండు. ఓ.కే.నా" అంటూ ఆమె చేతి నుంచి చేయి విడిపించుకుని బయలుదేరడానికి సిద్ధంగా స్టీరింగ్ పట్టుకున్నాడు.

"ఈ పూట యిక్కడే డిన్నర్ చేసి వెళ్ళు. ప్లీజ్. అత్తయ్యని కూడా యిక్కడికే రమ్మంటాను." పక్కకి జరిగి రెండు చేతుల్ని అభీ మెడ చుట్టూ పెనవేసి గోముగా అడిగింది.

"ప్లీజ్.. సియా.. యిప్పుడు కాదు" ఆమె చేతుల్ని విడిపించుకుంటూ అన్నాడు.

ఆమె మొహం తిరస్కారంతో చిన్నబోయింది.

"ఈ మధ్య నువ్వు యిదివరకులా వుండడంలేదు. నాకు దూరంగా వుంటున్నావు. మే ఐ నో ద రీజన్? నాన్నకీ, నీకు జరిగిన గొడవ మాత్రమే యిందుకు కారణమా? లేక..?" కనుబొమ్మలు పైకి ఎత్తుతూ అర్థోక్తిగా అడిగింది.

"నీ క్వశ్చన్‌కి ఆన్సర్ త్వరలోనే చెబుతాను. యిప్పుడు మాత్రం కాదు. సారీ" స్థిరంగా చెప్పడంతో, కోపంగా కారు దిగి ధన్‌మని డోర్ వేసింది.

తన వెనకాలే కారు దిగి బతిమాలుకుంటాడని అనుకుంటే, నిర్లక్ష్యంగా తన మానాన వెళ్ళిపోవడంతో, ఆమె మొహంలో రంగులు మారాయి.

తొమ్మిది గంటలకల్లా ఆఫీసుకి వచ్చి, మెయిల్స్ ఓపెన్ చేస్తూనే షాక్ తింది రచిత.

వెంటనే, సారంగ్‌కి మెసేజ్ పెట్టింది. పది నిమిషాలు దాటినా రిప్లై రాలేదు.

"నన్ను సారంగ్ టీంలో నుంచి తీసి మెయిన్‌టెనెన్స్‌లో వేశారు. అప్రైజల్ బాగానే వచ్చింది. అయినా, యిలా ఎందుకు జరిగిందో అర్థం కాలేదు." కాఫీ మెషీన్ దగ్గర వసుధతో అంది.

"ఎందుకంత కంగారు పడుతున్నావు? చిన్నగా మళ్ళీ డెవలప్‌మెంట్‌లోకి రావచ్చులే" కూల్‌గా అంది వసు.

"ఈ టైంలో కెరీర్‌ని బిల్డ్ చేసుకోకపోతే ఎలా చెప్పు? ఆస్తులన్నీ కరిగిపోయాయి. ఉన్నది కెరీర్ ఒక్కటే. సారంగ్ టీంలో వుంటే టెక్నికల్‌గా మంచి వాల్యూ వుంటుంది అని ఆశపడ్డాను.."

"ఒకవేళ, మ్యారేజ్ విషయంగా నువ్వు రెస్పాండ్ అవడం లేదని సారంగే ఏమైనా చేశాడంటావా?"

"ఛ.ఛ. అతను అలాంటివాడు కాడు" నమ్మకంగా చెప్పింది. యింతలో సెల్‌ఫోన్ రింగవ్వడంతో "ఒక్క నిముషం" అంటూ ఫోన్ లిఫ్ట్ చేసింది.

అవతలి నుంచి విషయం తెలుసుకున్న రచిత మొహంలో రంగులు మారాయి.

"ఏమిటి అలా అయ్యావ్? ఎవరు ఫోన్?" ఆతృతగా అడిగింది వసు.

"ఇంటి ఓనర్ యూ.ఎస్ నుంచి. వాళ్ళు వెనక్కి వస్తున్నారట. రెండు నెలల్లో యిల్లు ఖాళీ చేయమంటున్నారు" అంది విచారంగా.

"అవునే నిన్న నాకు ఫోన్ చేసి, నీ నంబర్ అడిగి తీసుకున్నాడు. ఆ విషయం చెబుదామనే వచ్చానిక్కడికి" చెప్పింది వసూ.

"ఎనీహౌ మనం చేయగలిగిందేముందీ?" భారంగా నిట్టూరుస్తూ అంది రచిత.

"రచీ.. ఏమైంది నీకు? ఈ మధ్య బాగా గమనిస్తున్నాను. ప్రతి చిన్న విషయానికీ డీలా పడిపోతున్నావు. యిది వరకులా చురుగ్గా, ఉత్సాహంగా ఉండడంలేదు."

రచితకి అన్ని సంగతులు తిరిగి కళ్ళముందు కదిలాయి. తండ్రి తిరిగి తన లైఫ్‌లోకి రావడం, ఫైనాన్షియల్ రెస్పాన్సిబిలిటీస్, మాలతి ప్రవర్తన, ఆఫీసులో ఎదురు దెబ్బలు, దుర్గాపురంలో యిల్లు అందినట్టే అంది చేజారిపోవడం, అన్నిటికన్నా ముఖ్యంగా అభీ యింకొకరికి కాబోయే భర్త అని తెలిసి కూడా ప్రేమించడం. అతను దాన్ని అలుసుగా తీసుకుని, ఆశలు రేపి, అవతలకి విదిలించేయడం - ఆలోచిస్తూనే రచిత కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

"రచీ.. ఆర్యూ.. ఓ.కె?" భుజాలు కుదుపుతూ అడిగింది వసూ.

ఏమీ లేదన్నట్టు కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"ఊరికే పరధ్యానంగా వుంటున్నావు. ప్రతి చిన్న విషయానికీ డిసప్పాయింట్ అవుతున్నావు. దుర్గాపురం యిల్లు చేజారిపోయినప్పటి నుంచి నీ వాలకం మారిపోయింది. నా మాట విని రెండు రోజులు సెలవు పెట్టి రెస్ట్ తీసుకో" సలహా యిచ్చింది.

"వద్దులే.. యింట్లో అస్సలు కూర్చోలేను. ఆలోచనలతో పిచ్చెత్తి పోతుంది. దానికన్నా, ఆఫీసులో అయితే, పనిచేస్తూ మర్చిపోవడానికి ప్రయత్నించవచ్చు"

"అదీ నిజమే.." ఆమోదిస్తున్నట్టుగా తలాడించింది.

ఆఫీసు ఎంట్రన్స్‌లోకి అడుగుపెడుతుండగా హఠాత్తుగా వినిపించిన పిలుపుకి తలపైకెత్తి చూసింది రచిత.

"హలో.. రచిత అంటే నువ్వే కదూ!?" సియానా నవ్వుతూ అంది.

ఆశ్చర్యంతో రచితకి నోటమాట రాలేదు.

ఆ స్థితినుంచి ఆమె తేరుకునే లోపే "హావ్ ఎ గుడ్ డే !" అని ఓ మాదిరిగా నవ్వి, గబగబా అక్కడనుండి కదిలింది. ఆఫీసులో తెలిసినవాళ్ళు, విచిత్రంగా చూస్తుండడంతో రచితకి అనుమానం వచ్చింది. ఏమైనా తేడాగా వుందేమోనని, బట్టలు, మొహమూ ఒకసారి సరిచూసుకుంది కూడా.

మధ్యాహ్నం లంచ్ టైంలో మేనేజర్ వచ్చి చెప్పాడు.

"సారీ.. రచితా.. ఈ సారి ఫైరింగ్ లిస్ట్‌లో నీ పేరు వుంది. మన టీంలో ఎక్కువ శాలరీ డ్రా చేసే సీనియర్ సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా నిన్నే తొలగించాల్సి వచ్చింది."

రచిత క్షణంపాటు శిలాప్రతిమలా అయిపోయింది.

"సార్.. కానీ నేను సీనియర్ సాఫ్ట్‌వేర్ యింజనీర్‌గా ప్రమోట్ అయ్యి యిరవై రోజులు కూడా కాలేదు. నేను ఒక్క నెల శాలరీ కూడా తీసుకోలేదు. ఇంతకంటే, నాకు ప్రమోషన్ యివ్వకపోయినా నా జాబ్ వుండేది కదా" బాధపడుతూ అడిగింది.

"సారీ.. అమ్మా. యివన్నీ పైనుంచి వచ్చిన డెసిషన్స్. నేనేమీ చేయలేను. కావాలంటే, నీకు మంచి ఫీడ్ బ్యాక్ మాత్రం యివ్వగలను.. అంతే" చెప్పి వెళ్ళిపోయాడు.

రచితకి పర్సనల్ లోన్ పదిలక్షలు కళ్ళముందు కనిపించింది. నిస్సత్తువగా ఛైర్‌లో కూలబడింది.

అప్పుడే, సారంగ్ వచ్చాడు.

"నాకూ తెలిసింది, నీ జాబ్ పోయిందని, బహుశా, యిక రెండు వారాల తర్వాత కనిపించవేమో కదా!" అన్నాడు.

"యా..ఁ అది కూడా ఫార్మాలిటీకే" నీరసంగా అంది.

"నేను చెబితే నువ్వెలా తీసుకుంటావో తెలియదు. అందుకే నీతో ఎప్పుడూ చెప్పలేదు. అభినవ్ మీ యింట్లో కొద్దిరోజులు ఉన్నాడని, ఆ విషయంగా అతని ఫియాన్సీ నీ విషయం పర్సనల్‌గా తీసుకుందని అనుకుంటున్నారు. నేనుగా నీకీ విషయం చెప్పదలచుకోలేదు. కానీ, నీ మీద నీకు కాన్ఫిడెన్స్ తగ్గకూడదని యివాళ చెప్పాల్సి వచ్చింది.

నాకు నీ మీద పూర్తి నమ్మకం వుంది. నువ్వు నా ప్రపోజల్‌కి "యస్" అంటే, నీ ప్రాబ్లమ్స్ అన్ని నా నెత్తిన పెట్టినట్టే అనుకోవచ్చు. 'నో' అన్నా ఫ్రెండ్‌గా ఎంతవరకూ సాయం అందించగలనో అంతవరకూ అందిస్తాను."

మనసులో మాట బయటపెట్టాడు.

"థాంక్యూ! సారంగ్ కానీ నేను యిప్పుడు పెళ్ళికి రెడీగా లేను. అదే నా జవాబు. నిన్ను ఎవరైనా వద్దంటే అది వాళ్ళ మూర్ఖత్వమే అవుతుంది. ప్లీజ్. నా కోసం నువ్వు వెయిట్ చెయ్యొద్దు" చేతిగోళ్ళు చూసుకుంటూ నెమ్మదిగా చెప్పింది.

"ఫర్వాలేదు. కానీ నేను చెప్పింది గుర్తుంచుకో. నీకే హెల్ప్ కావాలన్నా సంకోచం లేకుండా నన్ను అడగొచ్చు" మళ్ళీ చెప్పి, కుర్చీలో నుంచి లేచాడు.

ఒక్క క్షణంలోనే నిర్ణయం ఎలా తీసుకుందో రచితకే ఆశ్చర్యం వేసింది.

"చాలా ఫూలిష్‌గా చేశావు. డిసప్పాయింట్ అయినప్పుడు తొందరపడి నిర్ణయాలు తీసుకోకూడదని నువ్వే చెబుతుంటావుగా. సారంగ్‌ని వదులుకోవడం చాలా పెద్ద తప్పు అనిపిస్తుంది" వసుధ మెత్తగా చివాట్లు వేసింది.

"మనసులో యింకా అభినవ్ ఉండడం వల్లేమో"

రచిత బైటికి అనలేకపోయింది.

"ఇవాళ రాత్రికే నీ రెస్యూమ్ అప్‌డేట్ చేసి పంపించు. సాత్విక్ ఫ్రెండ్స్ విప్రోలో, బ్రాడ్‌కామ్‌లో పనిచేస్తున్నారు. వాళ్ళద్వారా ప్రయత్నిద్దాం. అయినా, మన ఫీల్డులో యిదంతా మామూలేగా, వేరేచోట జాబ్ వస్తే యింతకన్నా ఎక్కువ జీతమే వస్తుంది."

రచిత లాప్‌టాప్‌లో ఇంకా పనిచేస్తూనే వుంది. వసూ గబుక్కున లాప్‌టాప్ మూసేసింది.

"ఉద్యోగం ఊడాక కూడా.. ఓ... అని విరగబడి పనిచేయక్కర్లేదు. లే" అంటూ రచితను రెక్కపట్టుకుని బలవంతంగా లేపి బయలుదేరదీసింది.

"ఇంతకీ, నీ సహజీవనం ఎలా వుంది?" రచిత నడుస్తూ, టాపిక్ మార్చడానికి అన్నట్టుగా అడిగింది.

"మగవాళ్ళు మగవాళ్ళుగా, ఆడవాళ్ళు ఆడవాళ్ళుగా ఉన్నంతకాలం పెళ్ళి చేసుకున్నా, చేసుకోకపోయినా ఒక కప్పుకింద ఉంటే అన్నీ ఒక్కలాగే ఉంటాయి."

"సాత్విక్ వాళ్ళమ్మ వస్తే మర్యాదలు చేయక తప్పడంలేదు. వాడు లేట్‌గా లేస్తాడు కాబట్టి, బ్రేక్‌ఫాస్ట్ కూడా చేయాలి. డిన్నర్ డ్యూటీ క్లీనింగ్ డ్యూటీ సాత్విక్‌దే. నాకేం పెద్ద డిఫరెన్స్ లేదు" అంది విచిత్రంగా మూతి తిప్పుతూ.

రచిత ఫక్కున నవ్వింది.

"ఇంతకు ముందు చాలా కబుర్లు చెప్పావ్?" అడిగింది.

"సాత్విక్ తాగొచ్చి కొడుతుంటేనో, జాబ్ మానేసి నా సంపాదన తగలేస్తుంటేనో యిప్పుడూ అలాగే చెప్పేదాన్ని, లివింగ్ ఇన్ రిలేషన్ కాబట్టే ఈ దుర్మార్గుడి చెరనుండి కోర్టులూ, కేసులూ లేకుండా తప్పించుకున్నాను అని. కానీ వాడు చాలా మంచివాడు. కాబట్టి, యిప్పుడు నాకే వాడిని పెళ్ళి చేసుకుని ఎక్కడికీ పోనీయకుండా కట్టిపడేయాలనుంది" అంది నవ్వుతూ.

"ఏమిటో క్షణానికో మాట నీది."

"అప్పుడు పెళ్ళంటే నిజంగా చాలా టెన్షన్ పడ్డాను. ఇప్పుడు రిహార్సల్ అయిపోయిందిగా. కాబట్టి భయంలేదు" అంది కొంటెగా నవ్వుతూ.

"అంటే త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నావా?"

"అవును. ఇంకా డేట్ ఫిక్స్ చేసుకోలేదు."

"ఇప్పటిదాకా చెప్పనేలేదు" అలిగినట్టుగా అంది.

"నువ్వు మూడవుట్‌లో ఉన్నావని చెప్పలేదు. సారీ" సీరియస్‌గా అంది. "నేనెంత కష్టంలో ఉన్నా నీ సంతోషాన్ని పంచుకోగలను. దట్స్ వాట్ ఫ్రెండ్స్ ఆర్ ఫర్."

"కంగ్రాట్స్" అంటూ వసూని హగ్ చేసుకుంది.

ఇల్లు ఖాళీ చేయాల్సిన గడువు నెలరోజుల్లోకి వచ్చింది. పగలంతా యిళ్ళ వేట, రాత్రిళ్ళు యింటర్వ్యూలకి ప్రిపేరు కావడంతో బిజీగా వుంది రచిత.

రామారావుని కలిసి చాలారోజులు కావడంతో సాయంత్రం బయలుదేరి వెళ్ళింది.

సమయానికి తండ్రి యింట్లో లేడు.

తన్మయి ముందుగదిలో కూర్చుని బొమ్మలతో ఆడుకుంటూ వుంది. రచితని చూస్తూనే, "అక్కా.." అని ఎదురెళ్ళి కావలించుకుంది.

"తనూ బయటకి వెళ్ళి ఆడుకోకూడదూ ఎప్పుడూ యింట్లోనే మగ్గుతుంటావు" మాలతి లోపలి గదిలోనుంచి వచ్చింది అరుస్తూ.

రచితని చూసి కూడా చూడనట్టే, కిందపడి వున్న రంగుపెన్సిళ్ళు, కాగితాలూ సర్దుతూ కూర్చుంది.

"ఓ... నువ్వా అమ్మాయ్.. యిప్పుడేనా రావడం?" రామాయమ్మ వచ్చి దివాను మీద కూర్చుంటూ అంది.

పక్కనే వున్న కుర్చీలో కూర్చుంది రచిత.

"నాన్నగారు లేరా?" అడిగింది.

"యిప్పుడే అలా బజారుకెళ్ళారు" దుపట్టాలో మొహం అద్దుకుంటూ వచ్చి చెప్పింది మాలతి.

"అన్నట్టు నీ ఉద్యోగం పోయిందట కదా! అయినా ఏముందిలే నువ్వు తెలివైనదానివి, యింకో కంపెనీలో యింతకన్నా పెద్ద ఉద్యోగమే దొరుకుతుంది" అంది రామాయమ్మ రెండు కాళ్ళూ పైకి ఎత్తిపెట్టి కుర్చుంటూ.

రచిత మౌనంగా వింది.

"నిన్ననే, ఫ్రెండ్స్ దగ్గర అప్పుచేసి, సుధీష్‌కి కోచింగ్ సెంటర్‌కి ఫీజుకోసం పాతికవేలు తెచ్చారు. కన్నాక తప్పదు కదా!" నిరసనగా అంది మాలతి.

ఈ తిరస్కారానికి కారణం పాతికవేలు యివ్వకపోవడం అని రచితకి అర్థమైంది. నిజానికి డబ్బు యివ్వకూడదనుకోలేదు. తన గొడవల్లో పడి మర్చిపోయిందంతే.

"ప్రస్తుతం ఉద్యోగం లేదు. నాన్నకోసం పర్సనల్ లోన్ తీసుకున్నాను కదా. దాని E.M.I కూడా కట్టాలి. యిల్లు మారితే పదినెలల అడ్వాన్స్ కూడా ముందే యివ్వవలసి రావచ్చు. ఈ టెన్షన్స్‌లో ఉన్నాను. అందువల్లే కోచింగ్ సెంటర్ డబ్బు సంగతి గుర్తుకురాలేదు."

"అవును కదూ. యిన్ని నెలలబట్టి లోనుకి డబ్బు కడుతున్నావు కదూ. ఆ గోల మాకస్సలు తెలియదు. ఆయన రాగానే చెబుతాను" మాలతి సాగదీస్తూ అంది.

"ఇంతకీ యింకో యిల్లు దొరికిందా?" రామాయమ్మ అడిగింది. రచితకి గొంతు తడారిపోయినట్టు అయ్యింది. అయినా, మంచినీళ్ళు కావాలని కూడా అడగలేదు.

"చూస్తున్నామండీ. ఎక్కడా దొరకలేదు యింకా" చిరాకుని అణిచిపెట్టుకుని మర్యాదగా చెప్పింది.

"వెతుక్కోండి తల్లీ. ఈ కొంప చూస్తున్నావుగా, వీళ్ళ సంసారానికే చాలదు. తీరా ఓనర్లు కాస్తా ఖాళీ చేయిస్తే, రోడ్డు మీద ఉన్నా యింటికి తీసుకురాలేదని నలుగురూ అనుకుంటారు. అందుకే, ముందస్తుగా హెచ్చరిస్తున్నాను" ప్రేమ కురిపిస్తున్నట్టు తియ్యగా మాట్లాడింది. అసలే చిరాకుగా ఉన్న రచితకి భగ్గున మండిపోయింది. కోపంగా, కుర్చీలో నుంచి లేచి, మాలతివైపుకి తిరిగింది.

"ఇచ్చిన డబ్బు వెనక్కి తీసుకోవాలనో, నీ సాయం కోసమో నేను రాలేదు. నా తండ్రికి నేను ట్రీట్‌మెంట్ యిప్పించాను అంతే. ఇక నీకు ఖర్చుపెట్టిన డబ్బు. మా అమ్మ పేరుతో ధర్మం చేశావనుకుంటాను. మన మధ్య ఏదో బంధం ఏర్పడిందనుకుని భ్రమపడి ఈ యింటి చుట్టూ తిరుగుతున్నాను... ఛ..ఛ" ఆవేశంగా అంది.

ఆ మాటలు వింటూనే, మాలతి కళ్ళు నిప్పులు చెరిగాయి.

ఆమె యింకేదో అనేలోపే విసవిసా బయటకు నడిచింది రచిత. పది అడుగుల దూరంలో రామారావు కూరల సంచి పట్టుకుని ఎదురొచ్చాడు.

"రచితా.." అని పిలుస్తున్నా వినిపించుకోకుండా గబగబా వచ్చేసింది రచిత.

"అమ్మలూ ఎందుకలా దిగాలుగా కూర్చున్నావ్? మీ సాఫ్టువేర్ వాళ్ళకి ఉద్యోగాలు ఊడడం, రావడం మామూలేగా" పెరటిగుమ్మం దగ్గర కొబ్బరినూనె సీసా పట్టుకుని, కింద చతికిలబడుతూ అంది అనసూయమ్మ.

"దిగులులేదూ.. ఏం లేదూ. ఈ సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో? అని ఆలోచిస్తున్నానంతే. ముందు నిన్నొకసారి డాక్టరు దగ్గరకి తీసుకుని వెళ్ళి అన్ని టెస్టులు చేయిస్తాను. "

కాళ్ళనొప్పులు కాస్త తగ్గితే ఒక్కసారి భద్రాచలం పోయివద్దాం. ఎప్పట్నుంచో చూడాలని అడుగుతున్నావుగా."

"అవునే. వచ్చేటప్పుడు దారిలో దుర్గాపురంలో దిగుదాం. బాబూరావు యిల్లు అమ్మకపోతే పోయాడు, కనీసం మనకు అద్దెకైనా యిస్తాడేమో కనుక్కో" ఒక నెలరోజులు అక్కడ ఉండాలనిపిస్తుంది."

"అలాగే"

అనసూయమ్మ యింకా ఆ యిల్లు బాబూరావు ఆధీనంలోనే ఉందని భ్రమపడుతూ ఉంది. అప్పటికే ఆ యిల్లు అమ్ముడుపోయిన సంగతి యిష్టంలేక రచిత చెప్పలేదు.

"అమ్మమ్మ చెప్పిన ఉపాయం కూడా బాగానే ఉంది" అనుకుంటూ బాబూరావుకి ఫోన్ చేసి మాట్లాడింది.

"ఆ ఇల్లు కనీసం ఒకనెల రోజులపాటు అద్దెకు యివ్వడానికైనా ఒప్పుకుంటారేమో, మీరు కాస్త మాట్లాడి ఒప్పించగలరా?" అంటూ బాబూరావు తన ప్రయత్నం చేస్తానన్నాడు.

రచిత వంట ప్రయత్నంలో ఉండగా, వసుధ, సాత్విక్ జంటగా వచ్చారు, పెళ్ళికి పిలవడానికి.

"మామ్మగారూ వారం రోజుల్లోనే పెళ్ళి. రచిత ఎలాగూ వస్తుంది. రాకపోయినా తన్ని లాక్కుపోతాను. మీరు మాత్రం మోకాళ్ళ నెప్పులకి మాత్రలు వేసుకుని రెడీగా ఉండాలి. పెళ్ళికి రాకపోతే ఊరుకోం చెబుతున్నా." అంటూ కార్డు చేతిలో పెట్టి కాళ్ళకు దండం పెట్టింది.

"యింటర్వ్యూకి కాల్స్ ఏమైనా వచ్చాయా?" సాత్విక్ అడిగాడు, రచితని.

"రేపు విప్రోవాళ్ళ యింటర్వ్యూ ఒకటి ఉంది" చెప్పింది.

"వెరీగుడ్ క్లోజ్‌ఫ్రెండ్ విప్రోలో ఉన్నాడు. నీకు రిఫరెన్స్ యిస్తాను. నేను చెప్పానంటే, వీలైనంత హెల్ప్ చేస్తాడు" అంటూ అప్పటికప్పుడే ఫోన్ చేసి మాట్లాడాడు. లింక్‌డిన్‌లో రచిత చేత రిక్వెస్ట్ పెట్టించి, "ఇక నీకు జాబ్ వచ్చినట్టే" అనిపిస్తుంది నాకు. అన్నాడు నవ్వుతూ.

"ఒక్క నిముషం" మధ్యలో అడ్డుతగిలింది వసుధ.

రచితని పక్కకి లాక్కెళ్ళి, "నువ్వు పర్సనల్ లోన్ పదిలక్షలు తీసుకున్నావు కదూ. ఈ నెల్లోనే E.M.I కట్టాలనుకుంటా! డబ్బేమైనా కావాలా?" అడిగింది.

రచిత స్నేహితురాలివైపు అభిమానంగా చూసింది.

"థాంక్యూ వసూ. కానీ, అవసరంలేదు. అమ్మమ్మకి మెడికల్ ఎమర్జెన్సీకి అవసరం అవుతుందేమోనని, కొంత డబ్బు చేతిలో ఉంటుందెప్పుడూ. అందులోనుంచి తీస్తాను. నువ్వూ పెళ్ళి ఖర్చుల్లో ఉన్నావుగా."

"మరి యిల్లు...?"

"దొరికింది. కానీ, యిలాంటి గాలి, వెలుతురు ఉండే యిల్లు మాత్రం కాదనుకో. అపార్ట్‌మెంట్ ఒకటి చూశాను. డిపాజిట్ కట్టాలి. యిక్కడ ఉంటే, దుర్గాపురంలోలాగా గాలి, వెలుతురు, గార్డెన్ హాయిగా వుంది. నాకేం ప్రాబ్లం లేదు. అమ్మమ్మే అపార్టుమెంట్లో ఎలా ఎడ్జస్ట్ అవుతుందో చూడాలి."

"ఇంకో మార్గం కూడా లేదు. కానీ ఏ అవసరం వచ్చినా అడగడానికి మొహమాటపడకు" మరీ మరీ చెప్పింది.

కాఫీ తాగి, సెలవు తీసుకున్నారు యిద్దరూ.

"అమ్మలూ పెళ్ళనగానే, వసూ మొహం కళకళలాడిపోవడం లేదూ" వసుధ వెళ్ళినవైపే చూస్తూ అంది అనసూయమ్మ.

"అవును." నవ్వుతూ జవాబిచ్చింది.

"నువ్వు కూడా తొందరగా పెళ్ళిచేసుకోమ్మా! మన మంగమ్మ మొన్ననే ఒక సంబంధం చెప్పింది. నీకిష్టమైతే, వివరాలూ, ఫోటో తెచ్చివ్వమంటాను ఏం సరేనా?"

"మంగమ్మ తెచ్చే సంబంధమా? సరేలే" విసుగ్గా అంది.

"మంగమ్మ మాటతీరు అలా వుంటుంది కానీ, మనసు మంచిదే అమ్మలూ" అన్నీ చూసుకుని నీకు నచ్చితేనే మాట్లాడుకుందాం. ఏమంటావు?"

"సరే అమ్మమ్మ నీ యిష్టం. నీకు ఏది మంచిదిగా తోస్తే అదే చెయ్యి" చెప్పింది రచిత.

మధ్యాహ్నం మూడుగంటలప్పుడు, మేడమీద గదులు శుభ్రం చేయడానికి వెళ్ళింది రచిత. ఎండ తీవ్రంగా ఉంది.

నీల్‌కమల్ ఛైర్స్ ఒకదానిమీద ఒకటి పేర్చి మూలగా సర్దుతూ వుంటే అభీ జ్ఞాపకం వచ్చాడు. ఎక్కువగా బాల్కనీలో ఒక కుర్చీలో కూర్చుని, యింకో కుర్చీలో కాళ్ళు పెట్టుకుని, పాటలు వింటూ వుండేవాడు, తీరిక దొరికినప్పుడల్లా.

కొన్నాళ్ళ క్రితం యిక్కడే, 'ఉయ్ ఆర్ ఫ్రెండ్స్" అని అభీతో అన్న మాటలు గుర్తొచ్చాయి.

"కానీ, యిప్పుడు ఒక ఫ్రెండ్‌లాగా స్వచ్ఛంగా ఎందుకు మాట్లాడలేకపోతున్నాను? ముసుగు వేయడం చాతగాకనా?"

రచిత ఆలోచనల్ని భగ్నం చేస్తూ సెల్‌ఫోన్ మోగింది. బాబూరావ్ కాల్ చేశాడు.

"రచితమ్మా! నేను చాలా ప్రయత్నించి చూశాను. కానీ వాళ్ళు ఒప్పుకోవడం లేదు. వెంటనే యిల్లు పడగొట్టి, కొత్త యిల్లు కట్టించుకుంటారట. అంతగా మీకు దుర్గాపురంలోనే యిల్లు కావాలంటే, మన కరణంగారి యింటిపక్కన గోపీరంగు డాబా వుంది గుర్తుందా? వాళ్ళు అద్దెకి యిస్తామంటున్నారు. నాలుగురోజుల్లో వాళ్ళు మెడ్రాసు పోతారంట. అదిగానీ కావాలంటే, మాట్లాడిపెడతాను" చెప్పాడు.

"వాళ్ళు ఒప్పుకోలేదు" అని అర్థమయ్యాక బాబూరావు చెప్పిన మిగతా విషయాలమీద రచితకి ఆసక్తి కలగలేదు.

"చాలా థాంక్సండీ. నేను మళ్ళా చెబుతాను" అని నీరసంగా ఫోన్ కట్ చేసింది.

"నేను చెప్పలేదూ 'నీకు ఠకీమని వచ్చేస్తుందే' ఉద్యోగం అని..." పూజామందిరం ముందు కూర్చుని దేవుడికి ముడుపుకడుతూ అంది అనసూయమ్మ .

"ఇంకో పదిరోజుల్లో జాయిన్ కావాలి. అయిదురోజుల్లో వసూ పెళ్ళి. ఈ లోపునే భద్రాచలం వెళ్ళొద్దాం. తత్కాల్ టికెట్స్ కూడా బుక్ చేశాను. రేపే మన ప్రయాణం. సాయంకాలం కల్లా బ్యాగులు సర్ది, రాత్రికి పెందలాడే పడుకోవాలి." ప్రోగ్రామ్ అంతా అనసూయమ్మకి వివరంగా చెప్పింది.

"నిన్ననే మంగమ్మ చెప్పిన సంబంధం.. తాలూకు ఫోటో, బయోడేటా కవరు, యిచ్చి వెళ్ళింది. టి.వి మీద పెట్టాను. ఒకసారి చూడు అమ్మలూ. అన్నీ సవ్యంగా జరిగిపోతున్నాయ్. ఈ సంబంధం కూడా కుదురుతుంది. చూస్తూ ఉండు త్వరలోనే మన యిల్లు మనచేతికి చిక్కుతుంది."

దేవుడి పటానికి నమస్కారం చేసుకుంటూ అంది.

కట్ చేసిన కూరముక్కల్ని పక్కకి పెట్టి, రచిత వెళ్ళి ఫోటో తీసి చూసింది. కళ్ళు యాంత్రికంగా చూశాయి. అంతే తప్ప, అతని రూపురేఖల్ని గుర్తించే ప్రయత్నం చేయలేదు. దుర్గాపురంలోని యింటికి ఎలాగూ అమ్మమ్మని తీసుకెళ్ళలేదు. కనీసం పెళ్ళికి ఒప్పుకుంటేనన్నా సంతోషపడుతుంది అని మానసికంగా సిద్ధపడి వుంది రచిత.

"ఏమే మాట్లాడవు. ఎలా ఉన్నాడబ్బాయి?" వెనక్కి తిరిగి చూస్తూ అడిగింది.

"బావున్నాడమ్మమ్మా!" అంది ఫోటో తిరిగి కవర్‌లో పెట్టేస్తూ.

"అయితే, మనం భద్రాచలం నుంచి రాగానే, మంచిరోజు చూసి వాళ్ళని రమ్మని చెప్పమంటాను మంగమ్మతో" అంటూ తిరిగి పూజాకార్యక్రమాల్లో పడిపోయింది.

"అమ్మా" గుమ్మం దగ్గర నుంచి పిలుపు వినిపించింది.

సత్తన్న నిలబడి ఉన్నాడక్కడ.

నీకు జీతం యివ్వాలికదూ. లోపలనుంచి హేండ్ బాగ్ తెచ్చి లెక్కచూసి యిచ్చేసింది.

"రేపట్నుంచి మూడురోజుల పాటు ఊళ్ళో ఉండడంలేదు సత్తెన్నా! ఇటువైపు వచ్చినప్పుడు కాస్త యింటిని కనిపెట్టివుండు" చెప్పింది.

"అలాగేనమ్మా" అని వెళ్ళిపోయాడు సత్తెన్న. అతను వెళుతూనే, "సత్తెన్నకు తోటపనిమీద ఎంతో శ్రద్ధ" అనుకుంటూ గార్డెన్ వైపు చూసిందొకసారి.

క్రమశిక్షణతో ఉన్న పిల్లలున్న క్లాస్‌రూంలా ఉంది గార్డెన్ మొత్తం.

పెద్ద పెద్ద క్రోటన్ మొక్కలు క్రమపద్ధతితో కత్తిరించబడి ఉన్నాయి.

"నాలుగురోజులకల్లా అంతా మారిపోతుంది. పక్కల నుంచి కొత్త చివుళ్ళు వస్తాయి. మొక్క తిరిగి పెరుగుతుంది. కానీ, కత్తిరించినచోట మాత్రం అలాగే మొద్దుబారిపోయి ఉంటుంది. పక్కనుంచి వచ్చిన కొమ్మలు, రెమ్మలు దాన్ని కనబడకుండా మాత్రమే చేయగలవు. మనిషి జీవితంలో కూడా అంతే ముందుకు సాగిపోతూనే ఉన్నా మనసులోపల ఏదో మూల ఉండే వెలితి అలాగే నిలిచిపోతుందేమో" రచిత ఒక్క క్షణం ఆ పొదలను చూసి నవ్వుకుంది.

మూడురోజులపాటు పాలపాకెట్ వేయొద్దని ఫోన్ చేసి చెప్పింది.

అనసూయమ్మ మందులు, ప్రయాణానికి కావలసిన సామాన్లు, బట్టలు చుట్టూ పరుచుకుని బ్యాగులు సర్దుకోవడానికి కూర్చున్నారు.

"ఈ ముడుపు రాములవారి హుండీలో వేయాలమ్మలూ. మర్చిపోతానేమో. గుర్తుచెయ్యి" అంటూ పసుపు బట్టలో కట్టిన మూటని బ్యాగులో సర్దింది అనసూయమ్మ.

రాత్రి ఏడుగంటలకల్లా భోజనం ముగించి, అలారం పెట్టుకుని పడుకున్నారు.

అలారం మోతకి నిద్రలేచిన రచిత అనసూయమ్మ యింకా పడుకోవడం చూసి ఆశ్చర్యపోయింది. సాధారణంగా ప్రయాణాలంటే మరీ ముందుగా లేచే అలవాటు అనసూయమ్మకి.

"రాత్రి, మధ్యలో ఒకటి, రెండుసార్లు లేచి బాత్రూంకి వెళ్ళింది. అందువల్ల మెలుకువ రాలేదేమో" అనుకుంటూ, మొహం కడుక్కుని గీజర్ ఆన్ చేసి వచ్చింది.

మంచం మీద, ఒక పక్కకి తిరిగి పడుకుంది అనసూయమ్మ.

తెల్లగా, నొక్కులు తిరిగిన జుట్టు జీవిత అనుభవాన్ని సూచిస్తూ ముడుతలు పడిన మొహం, శాంతం, జాలి ఆభరణాలుగా ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉండే మొహం.

ఆమె మొహంలోకే అలా చూస్తూ ఉండిపోయింది, ఒక నిముషం పాటు.

"అమ్మమ్మలాంటి, ధైర్యశాలి తోడుగా లేకపోతే, నా జీవితం ఎలా ఉండేదో!?" అనుకుంటూ ఆమెను లేపడానికి ఒంటిమీద చెయ్యివేసింది.

రచిత ఒళ్ళు ఒక్కసారిగా ఝల్లుమంది.

"అమ్మమ్మా.. అమ్మమ్మా" అని కుదుపుతున్నా స్పందన లేకుండా, నిర్జీవంగా, చల్లగా మంచుముక్కలా తగిలింది అనసూయమ్మ శరీరం.

రచిత మెదడంతా మొద్దుబారిపోయినట్టైంది.

నిజం అని తెలిసినా దేన్నైతే నమ్మడానికి యిష్టపడడంలేదో, ఆ సత్యం పిడుగుపాటులా కళ్ళముందు నిలిచినట్టయ్యింది.

నిస్తేజంగా, గాజుగోళీల్లా పాలిపోయిన కళ్ళతో అనసూయమ్మ శవం పక్కన కూలబడింది.

వసుధ ఫోన్ చేస్తే, రచిత, మాట్లాడకుండా ఏడుస్తూ ఉండటంతో, భయపడి పరుగెత్తుకుంటూ వచ్చింది.

పరిస్థితి తెలుసుకుని, వస్తూనే రచిత సెల్ నుంచి రామారావుకీ, మంగమ్మగారికీ ఫోన్ చేసి విషయం చెప్పింది. వాళ్ళు హుటాహుటిన బయల్దేరి వచ్చారు. దుర్గాపురంలోని స్నేహితులు, ముఖ్యమైన వాళ్ళకి మంగమ్మే ఫోన్లు చేసింది.

"నీకు నేనొక గుదిబండలా తయారయి పెద్దతనంలో కూడా సుఖంలేకుండా చేశాను. నీ కోరిక ఒక్కటి కూడా తీర్చలేకపోయాను" అని శోకాలు పెట్టి, ఏడుస్తూనే వుంది రచిత.

"మంచితనానికి మారుపేరు. అందుకే పువ్వులా రాలిపోయింది" అంటూ మంగమ్మ రచితని ఓదార్చే ప్రయత్నం చేసింది.

రామారావు తలకొరివి పెట్టాడు.

మాలతి, రామాయమ్మ మాత్రం రాలేదు. అయినా అవేమీ పట్టించుకునే పరిస్థితిలో లేదామె.

కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూనే వుంది.

మంగమ్మే పెద్దరికం వహించి అన్ని వ్యవహారాలూ చూసుకుంది.

"ఏడుస్తూ కూర్చుంటే పోయినవాళ్ళు వస్తారా?" అని కసిరి బలవంతంగా రచిత చేత నాలుగు మెతుకులు తినిపించింది.

కర్మకాండ కూడా రామారావే చేశాడు.

మధ్యలో ఒకసారి మాలతి వచ్చి వెళ్ళింది. ఆవిడ రచితను రమ్మనలేదు. పిలవనందుకు రచితా బాధపడలేదు.

అనసూయమ్మ నేతచీరలు, కళ్ళజోడు, చెప్పులు, వత్తులపెట్టెలాంటి వస్తువులు చూసినప్పుడల్లా రచిత మరింత దుఃఖం వచ్చేది.

"ఇంక నేనీ యింట్లో ఉండలేను పిన్నీ" మంగమ్మతో అంది ఒకరోజు.

"పెద్దకర్మ కాకుండా కదిలితే బావుండదు తల్లీ. ఒక్క రెండురోజులు ఓర్చుకో. ఎలాగూ యిల్లు ఖాళీచెయ్యాలిగా" అంటూ ఓదార్చింది. ఓదార్చటమే కాదు. ఆ పదిరోజులూ రచితకి తోడుగా ఆమెతోనే ఉండి, అన్నీ తానై చూసుకుంది కూడా.

బరిస్టా కాఫీ షాప్‌లో కూర్చుని రచిత కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు సారంగ్.

ఐదు నిముషాల్లోనే ఆమె స్కూటీ పార్క్ చేసి వచ్చింది. అప్పటికే కాఫీలు టేబుల్ మీదకి చేరాయి.

"నిన్ను సాయం చేయమని అడగాలంటే కూడా చాలా ఇబ్బందిగా వుంది. నీ మంచితనాన్ని యూజ్ చేసుకుంటున్నట్టే అని నాకు తెలుసు..." కాఫీ కప్‌ని టేబుల్ మీద అటూ, యిటూ జరుపుతూ, మొహమాటంగా అంది.

"ప్లీజ్ రచితా! ఐ నో యూ! విషయం ఏమిటో చెప్పు.." అడిగాడు.

"మన ఎడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లోగానీ, ఫ్రంట్ డెస్క్‌లో గానీ, జాబ్ ఒకటి తెలిసినావిడకి యిప్పించాలి."

"నీకు బాగా కావలసిన వాళ్ళా?"

"ఏమో నాకు తెలియదు. కానీ ఆవిడ మీద యిద్దరు పిల్లల భవిష్యత్తు ఆధారపడి వుంది."

"తప్పకుండా ఒకసారి నాతో మాట్లాడమను." నమ్మకంగా చెప్పాడు.

"థాంక్యూ.. ఐ యామ్ వెరీసారీ.. ఫర్ టర్నింగ్ యు డౌన్" సిన్సియర్‌గా చెప్పింది.

"సిల్లీగా మాట్లాడకు. ఎవ్రీథింగ్ ఈజ్ పార్ట్ ఆఫ్ లైఫ్.."

"మళ్ళా ఎప్పుడు కనిపించేది..?"

"ప్రస్తుతానికి రెండు నెలల తర్వాత జాబ్‌లో జాయిన్ అవుతానని చెప్పాను. వాళ్ళు సరేనన్నారు. అంతకన్నా ఎక్కువ ఆలోచించలేదు. బహుశా, రెండు నెలల తర్వాతే సిటీలో కనిపిస్తాననుకుంటా.. లెట్స్‌సీ" కాఫీ తాగడం పూర్తిచేసి లేచింది. వెనకాలే అతను కూడా వచ్చాడు.

"థాంక్యూ.." స్కూటీ దగ్గరకు వెళ్ళబోతూ అస్పష్టంగా అంది.

"ఎవ్రీథింగ్ ఈజ్ ఎ పార్ట్ ఆఫ్ లైఫ్.. అదృష్టవంతుడు, అంత ఈజీగా అన్నీ తీసుకోగలిగితే, నా జీవితం పూర్తిగా వేరేలా ఉండేది" అనుకుంటూ.. స్కూటీ స్టార్ట్ చేసింది.

రచిత యింటికి వచ్చేసరికి సామానంతా లారీలోకి ఎక్కిస్తున్నారు. రామారావు కూడా అప్పుడే వచ్చాడు.

"నువ్వు యింకోసారి ఆలోచించమ్మా. మీ పిన్నికి నేను నచ్చచెబుతాను." అడిగాడు అతను ఆఖరి ప్రయత్నంగా.

"మీకు యిబ్బందని కాదు. నేను ఉండలేను" అంది.

రామారావు మళ్ళీ మాట్లాడలేదు.

"యితన్ని ఒకసారి కలిసి మాట్లాడండి, పిన్నికి ఉద్యోగం వేయిస్తాడు. పిల్లల గురించిన దిగులు వుండదు మీకు." చెప్పి విజిటింగ్ కార్డు చేతిలో పెట్టింది.

ఆమె మంచితనం ముందు ఓడిపోయినట్టుగా తలవంచుకుని కార్డు జేబులో పెట్టుకున్నాడు.

మంగమ్మ, ఆమె భర్త కూడా అక్కడే వున్నారు.

"పిన్నీ యివిగో అపార్ట్‌మెంట్ తాళాలు అడ్వాన్స్ కాక రెండు నెలల అద్దెకూడా ముందే యిచ్చేశాను. సామాను సర్దించాక, తాళాలు నీ దగ్గరే వుంచు."

"ఏమిటో హాయిగా వచ్చిన ఉద్యోగం చేసుకుంటూ పడివుండక... మళ్ళా ఆ పల్లెటూరు పోతానంటావు. కానీ, నీ యిష్టం" తాళాలు చీరకొంగుకి ముడివేసుకుంటూ అంది.

"నువ్వు చేసిన సాయానికి థాంక్స్ ఎలా చెప్పుకోవాలో కూడా తెలియడం లేదు." అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుని మంగమ్మను కౌగలించుకుంది.

హరిప్రసాద్ యిల్లు, అతిధులతో సందడిగా వుంది. పార్టీ హాల్‌లో మ్యూజిక్‌తో బాటు, మందుగ్లాసుల చప్పుళ్ళు, నవ్వులు, డాన్సులు కేరింతలతో సందడి చేస్తున్నారు వచ్చినవాళ్ళు.

సియానా స్పెషల్‌గా డిజైన్ చేయించబడిన మోడ్రన్ అవుట్ ఫిట్‌లో సెంటర్ ఆఫ్‌ది ఎట్రాక్షన్‌గా నిలిచింది.

"మెనీ, మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే." అంటూ, సియానాను విష్ చేసి, అభీ కోసం చూస్తున్నారు వచ్చినవాళ్ళు. అది ఒక రకంగా అభినవ్‌కి అభినందనలు తెలిపే పార్టీలా ఉంది.

"షెరోనా టెక్‌ని మొదట పి.కె గ్రూప్స్‌లోకి మెర్జ్ చేస్తానన్నవాడు.... యిప్పుడు వేరే కంపెనీలని షెరోనాకి మెర్జ్ చేశాడు. త్వరలోనే నా మేనల్లుడు పి.కె గ్రూప్స్‌కి పారలల్‌గా యింకో గొప్ప కంపెనీని నిలబెడతాడు" సంతోషంగా, గర్వంగా చెబుతున్నాడు హరిప్రసాద్.

బఫే.. డ్రింక్స్.. మ్యూజిక్.. ఎంజాయ్ మెంట్‌కి కొదవలేదు.

ఆ రోజు శకుంతలాదేవి కూడా చాలా సంతోషంగా వుంది. సాంప్రదాయబద్ధంగా వుండే ఆమెకి ఈ పార్టీలూ, గెట్ టు గెదర్‌ల్లాంటివి యిష్టం వుండవు.



కౌముది

అదంతా గుర్‌ప్రీత్ స్టైల్. హర్‌ప్రసాద్ యింట్లో కనీసం నెలకి ఒక్క పార్టీ అన్నా జరుగుతూ వుండేది గుర్‌ప్రీత్ బ్రతికివున్నప్పుడు.

ఆ తర్వాత ఆ యిల్లు కళావిహీనంగా అయిపోయింది. చాలారోజుల తర్వాత మళ్ళా ఆ యింట్లో సందడి నెలకొంది. ముఖ్యంగా హర్‌ప్రసాద్ నవ్వుతూ, మనుషుల్లో కలిసిపోవడం ఆమెకు ఆనందంగా వుంది.

"ఇదే మంచి సమయం పార్టీ అయిపోతూనే, అన్నయ్యతో పెళ్ళి విషయం కదపాలి" అని నిశ్చయించుకుంది.

"హాయ్..ం " ఆలస్యంగా వచ్చిన చైతన్యని, చేతిలోని షాంపైన్ గ్లాసు ఒరిగిపోకుండా బాలెన్స్ చేస్తూ సుతారంగా హగ్ చేసింది సియానా.

"మై బెస్ట్ విషెస్ టు యూ... యూ లుక్ గార్జియస్..."

"థాంక్యూ.. అదిగో నీ ఫ్రెండ్ అక్కడున్నాడు.." అంటూ అభీ నిలుచున్న వైపు చూపించి, యింతలో మరొకరు పలకరించడంతో బిజీ అయిపోయింది.

డ్రింక్ టేబుల్ దగ్గర నిలబడి ఉన్న అభీ దగ్గరకు వెళ్ళాడు చైతన్య.

"కూల్ డ్రింక్ పట్టుకున్నావ్. విచిత్రంగా.." అని నవ్వుతూ టేబుల్ మీద గ్లాసులోకి వైన్ ఒంపుకున్నాడు.

"జస్ట్ లైక్ దట్.. అంతే" అన్నాడు అతను యిబ్బందిగా నవ్వుతూ.

"అర్ధమైందిలేరా..! ఒక్కసారి వాంతి అయితేనే మందు మానేశావా? లేక వారం రోజులు డ్రింక్ చేయవద్దని రచిత కండిషన్ పెట్టిందని.. దాన్నే కంటిన్యూ చేస్తున్నావా?" కొంటెగా అన్నాడు.

అభినవ్ నవ్వాడు.

"షి ఈజ్.. లక్కీ.." గుర్తుతెచ్చుకుంటున్నట్టుగా అన్నాడు చైతన్య.

అభీ ఆలోచనల్లో పడిపోయినట్టుగా ఒక నిముషం మాట్లాడలేదు.

"పూర్ గర్ల్... వారం క్రితం, నాన్నని ఫిజియోథెరపిస్ట్ దగ్గరకి తీసుకువెళుతున్నప్పుడు కనిపించింది. వాళ్ళ అమ్మమ్మ చనిపోయిందట. దిగులుగా, సర్వం కోల్పోయినట్టే అయిపోయింది.."

"ఓ... మైగాడ్.. ఎన్నాళ్ళైంది ఆవిడ చనిపోయి..?" ఆదుర్దాగా అడిగాడు.

"రెండువారాలపైనే అయ్యింది. యింకా నీకు తెలుసనుకున్నాను.."

"నో...నో...నాకు తెలియదు."

"ఐ..నొ.. నీకు తెలిస్తే ఆమెని తప్పక కలిసేవాడివే, అదే అనుకున్నాను. యిప్పుడామె మన కంపెనీలో జాబ్ చేయడంలేదు.."

"వ్వాట్.. నాకసలు ఏ విషయము తెలియదు.." చైతన్య చెబుతున్న విషయాలన్నీ విన్న తర్వాత అభినవ్ ఒక నిర్ణయానికి వచ్చాడు.

దుర్గాపురంలో, తమ పాత యింటికి కాస్త దూరంలో బాబూరావు చూపించిన యింట్లోనే దిగింది రచిత. వచ్చేటప్పుడు రావలసినవి కొద్ది సామాను మాత్రం వెంట తెచ్చుకుంది.

ఆమె వచ్చిన రెండోరోజే అనసూయమ్మగారి యింటి కాంపౌండ్ వాల్ పడగొట్టేశారు. అది చూసి నిశ్శబ్దంగా నిట్టూర్చిందామె.

అనసూయమ్మ మరణం కన్నా ఎక్కువగా యింకే విషయమూ బాధించలేకపోయిందామెని.

అలవాటైన పరిసరాలు, అందమైన ప్రకృతి, స్వచ్ఛమైన గాలి ఊరట కలిగించాయి మనసుకి.

ప్రొద్దున్న సిద్ధివినాయకుడి గుడికి వెళ్ళి, కోనేటిగట్టున కూర్చుని సూర్యోదయం తిలకించడం, గన్నేరుపూలు కోసి దండగుచ్చి దేవుడికి సమర్పించి, ప్రదక్షిణలు చేసి రావడం ఆమె మొదటి కార్యక్రమం.

మధ్యాహ్నం తెలిసినవాళ్ళు వచ్చి పరామర్శించిపోతూ వుంటారు.

సాయంకాలం పూట, డాబా మీద చుట్టుపక్కల పిల్లలకి సంగీత పాఠాలు నేర్పిస్తూ కాలక్షేపం చేస్తూ వుంటుంది.

పిల్లలు వచ్చే వేళకి మేడమీద శుభ్రం చేసి, చాపలు పరిచి, శృతి బాక్సుని పరిక్షిస్తూ వుంది రచిత.

"రచితమ్మా.." అంటూ బాబూరావు మేడమీదకి వచ్చాడు.

"ఇదివరకు యిల్లు కొన్నవాళ్ళు, ఇంకా కట్టకుండానే వేరే పార్టీకి అమ్మేశారట. ఈసారి మనం ప్రయత్నిస్తే పని జరుగుతుందేమో! అడగమంటావా?" అన్నాడు.

డాబామీద నుంచి తమ పాత యింటివైపుకి చూసిందామె. ముంగిట్లో ఉన్న నందివర్ధనం, జాజితీగెలతో సహా అంతా స్పష్టంగా కనిపిస్తూ వుంది. కాంపౌండ్‌వాల్ నేలమట్టమై యిటుకరాళ్ళు, సిమెంటు పెచ్చులు చిందరవందరగా పడివున్నాయి.

"ఇల్లు పూర్తిగా నేలమట్టం కాకపోవడానికి, బాబూరావు చెప్పినదే అయివుంటుంది" అనుకుంది.

"వద్దు బాబూరావుగారూ.. అమ్మమ్మ కోసం ఆ యిల్లు కొనాలనుకున్నాను. కానీ, యిప్పుడు దేనికోసం ఆరాటపడి, పరిగెత్తే పరిస్థితిలో లేను. నాకోసం మీరు చాలా శ్రమపడ్డారు." అంటూ చేతులు జోడించింది.

చీకటి పడబోతుండగా పిల్లలందరూ వెళ్ళిపోయారు. చాపలు చుట్టి, కిందకు రాబోతుండగా రచిత సెల్‌ఫోన్ మోగింది.

"హలో.. ఎలా వున్నావు?" అవతలి నుంచి వసూ గొంతు.

అమ్మమ్మ చనిపోవడంతో రచిత వసుధ పెళ్ళికి వెళ్ళలేదు. వసూ మాత్రం తప్పకుండా రెండురోజులకోసారి ఫోను చేస్తూనే వుంది.

"బాగానే వున్నాను. సాత్విక్ ఎలా వున్నాడు?"

"ఇంకెలా వుంటాడు. నా చేతిలో పడ్డాక" పకపకా నవ్వింది.

"అన్నట్టు, ఒక విషయం చెప్పాలి నీతో" హఠాత్తుగా వసూ గొంతు సీరియస్‌గా మారిపోయింది.

"చెప్పు.. ఏమిటో"

"నీతో ఈ విషయం యిప్పుడు చెప్పటం వల్ల ఉపయోగంలేదు. కానీ ఉండబట్టలేక చెబుతున్నాను."

"అబ్బా.. సస్పెన్స్‌తో చంపక.. త్వరగా చెప్పు" ముద్దుగా విసుక్కుంది.

"మీ ఊళ్ళో నువ్వు యిల్లు కొనలేకపోవడం, కేవలం యాదృచ్ఛికం అనుకుంటున్నావు కదూ.."

వసుధ చెప్పబోయే విషయానికి రచిత కళ్ళు విస్మయంతో పెద్దవి అయ్యాయి.

"కానేకాదు. కావాలనే నీకు దక్కకూడదని పనిగట్టుకుని చేశారు. అది కూడా ఎవరోకాదు సియానా, వాళ్ళమ్మ గురుప్రీత్. అభీ మీ యింట్లో వారం రోజులపాటు ఉన్నాడని తెలిసి గురుప్రీత్ మీ పుట్టుపూర్వోత్తరాలన్నీ కూపీ లాగిందట. మీ యిద్దరి మధ్య ఏర్పడిన ఫ్రెండ్‌షిప్ ముందు ముందు ఎటువైపుకి దారితీస్తుందో అని ఒక కంట కనిపెడుతూనే ఉన్నారట. బహుశా.. సియానా కూడా తల్లిబాటలోనే అభీని కట్టుదిట్టాల్లో పెట్టుకోవడానికే నీ జాబ్ తీసేయించిందనిపిస్తోంది."

"నేను వింటున్నది నిజమేనా?" రచితకి నమ్మబుద్ధి కాలేదు.

వసూ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టింది.

"మొదట గురుప్రీత్ తన పర్సనల్ సెక్రటరీకి ఈ పనులన్నీ పురమాయించింది అని చెప్పారు. నీ మీద నిఘా వేయడం, నిన్ను ఏడిపించడం, నీకు అభీకి పరిచయం ఎంతవరకు ఉందో కనిపెట్టడం లాంటివి. హఠాత్తుగా ఆవిడ చనిపోయాక కూడా ఆమె డైరెక్షన్స్‌ని బట్టి ఆమె మేనేజర్ పనులన్నీ పూర్తిచేసుకుంటూ పోయాడని చెప్పుకుంటున్నారు.

అభీ మీద ఎవరి నీడపడినా, అతని మనసులో యింకొకరి పట్ల సాఫ్ట్ కార్నర్ ఉన్నా కూడా భరించలేదు సియానా.. చిన్నపామయినా, పెద్ద కర్రతో కొట్టాలనేదే తల్లీ కూతుళ్ళ స్ట్రాటజీ. మీరు సానుభూతితో అభీకి ఆశ్రయం యిచ్చారు. అదే మిమ్మల్ని యిబ్బంది పెట్టింది"

"పిచుక మీద బ్రహ్మాస్త్రం అన్న మాట" రచిత నీరసంగా నవ్వింది.

"అయినా, యిప్పుడు తెలుసుకుని ఏం ప్రయోజనం. ఆ యిల్లు బేరం చేసిన మేనేజర్ సాత్విక్ ఫ్రెండ్ అని, మా పెళ్ళయ్యాక తెలిసింది. మొన్న రియలెస్టేట్ మాటల మధ్య "ఈ మధ్యే ఒక డీల్ క్లోజ్ చేశాను" అంటూ దుర్గాపురం సంగతులు చెప్పుకొచ్చాడు.

నాకు అనుమానం వచ్చి మరిన్ని వివరాలు అడిగాను. కొంత చైతన్యద్వారా, కొంత మన ఆఫీసులో విషయాలు పైకి చేరేసినవాళ్ళద్వారా పార్టులు, పార్టులుగా కథ అర్థమైంది."

"పోనీలే.. యిప్పుడు ఏమైందని.. కొత్త జాబ్ వచ్చింది. అమ్మమ్మ లేదన్న దిగులు తప్ప నాకేమీ లోటులేదు" నిర్వేదంగా అంది.

"ఫూల్‌లా మాట్లాడకు. ఎవరికో భయపడి నీ సంతోషం ఎందుకు వదులుకోవాలి? నీకు అభీ అంటే యిష్టంలేదూ? నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసు. జాగ్రత్తగా విను. అతనికి నువ్వు అంటే యిష్టమైతే వెర్రిమొర్రి ఆలోచనలు చేయక పెళ్ళికి ఒప్పుకో" దాదాపుగా బెదిరిస్తున్నట్టే చెప్పింది.

రచిత పేలవంగా నవ్వింది.

"తనికి యిష్టం అయితే ఆ రోజు సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా ఎందుకు వెళ్ళిపోయాడు?" బాధగా నిట్టూర్చింది.

వద్దన్నా అభీని గురించిన ఆలోచనలు వెంటాడుతూనే ఉన్నాయామెకి.

"అతని గురించి ఆలోచిస్తే జాలివేస్తుంది కూడా. అతి జాగ్రత్త కొద్దీ అతని చుట్టూ అల్లుతున్న వలలు పాపం. ఎవరినైనా కట్టిపడేయాలనుకోవడం ఎంత మూర్ఖత్వం?" ఆ రాత్రంతా ఈ విషయమే మనసులో మెదులుతూ వుంది.

"మెడలోకి ఒక్క నగన్నా కొనుక్కోలేదా? ఏమిటో ఈ కాలం పిల్లలు" మంగమ్మ రచితని ఎగాదిగా చూస్తూ అంది.

ఇదివరకు అయితే, యిలాంటి మాటలకి రచితకి కోపం వచ్చేదే కానీ, మంగమ్మ మనసు అర్థం అయ్యాక కోపం రావడంలేదు.

"ఇలా బాగోలేదా? యిప్పుడేం చేద్దామంటావు పిన్నీ?" అని అడిగింది అమాయకంగా.

"నా పచ్చరాళ్ళ నెక్లెస్ వేసుకో. అది నేను వేసుకుందామని తెచ్చుకున్నాను. కానీ, నీ ఒంటిమీదైతే యింకా బావుంటుంది" అంటూ బ్యాగ్‌లో నుంచి నగలపెట్టె తీసి చూపించింది.

తన పెళ్ళిచూపులకి మంగమ్మ తెచ్చుకున్న నగలు చూసి రచితకి నవ్వొచ్చింది. నెమలి పింఛం రంగు చీరకి ఆకుపచ్చ బోర్డర్ ఉన్న పట్టుచీర, దానిమీదకి అతికినట్టుగా సరిపోయింది మంగమ్మ పెట్టిన రాళ్ళ నెక్లెస్. రెండు చేతులకీ బంగారు గాజులు వేసుకుని, చిక్కగా కట్టిన విరజాజుల దండ నాలుగు వరుసలుగా వాలుజడలో తురుముకుని అందంగా తయారైంది.

"చక్కని చుక్కలాగా వున్నావు. నా దిష్టే తగిలేటట్టుంది" అంటూ కాటుక తీసి, రచిత ఎడమచేతి మీద చుక్క పెట్టింది. రామారావు పళ్ళు, స్వీట్స్ తీసుకుని వచ్చాడు.

అనసూయమ్మకి మంగమ్మ చెప్పిన సంబంధం వాళ్ళు రుచితను చూసుకోవడానికి వస్తున్నారు.

"మీ అమ్మమ్మ నువ్వు పెళ్ళి చేసుకుంటాను అని చెబితేనే బోల్డు సంబరపడిపోయింది. ఆ మూడుముళ్ళు కూడా పడితే, ఏ లోకంలో ఉన్నా ఆమె ఆత్మ శాంతిగా వుంటుంది" అని శతపోరి రచితను ఒప్పించింది. అబ్బాయి పేరు రాఘవేంద్ర. అతనితో బాటు అతని అమ్మా నాన్నా, చెల్లెలు కూడా వచ్చారు.

చదువు, అందంతో బాటు ఉద్యోగం కూడా ఉన్న రచిత నచ్చినట్టుగా అతని మొహమే చెబుతుంది.

"అమ్మాయికి సంగీతం కూడా బ్రహ్మాండంగా వచ్చు. దుర్గాపురం విశ్వనాథ శాస్త్రిగారని గొప్ప విద్వాంసులు. ఆయన దగ్గర నేర్చుకుంది" మంగమ్మ చెప్పింది.

వాళ్ళెవరికీ కర్ణాటక సంగీతం అంటే పెద్దగా ఆసక్తి ఉన్నట్టులేదు. ఊరికే విని "ఊ" కొట్టారు.

**ఇంతలో** యింటి ముందు కారు ఆగిన శబ్దం అయ్యింది.

షూస్ చప్పుడు కూడా వినిపించడంతో గుమ్మానికెదురుగా కూర్చున్నవాళ్ళు తలలు తిప్పి చూశారు.

తెల్లగా, పొడుగ్గా ఉన్న యువకుడు వాకిట్లో నిలబడి ఉన్నాడు.

"రావయ్యా..రా... సమయానికి వచ్చావు.." మంగమ్మ అంది.

చూస్తున్న వాళ్ళ మొహాల్లో క్వశ్చన్ మార్కుని చదివి "ఈ అబ్బాయి అనసూయమ్మగారి బంధువు. మద్రాసులో ఉంటాడు" వివరణ యిచ్చింది.

"నాకు తెలియని బంధువు మద్రాసులో ఎవరబ్బా?" అనుకుంటూ తలెత్తి చూసి ఆశ్చర్యపోయింది రచిత.

ఎదురుగా అభినవ్ నిలబడి వున్నాడు.

చాలా దూరం డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడని, అలసిపోయి వున్న అతని మొహం చూస్తేనే అర్థం అవుతుంది.

మంగమ్మగారితో అప్పట్లో చెప్పిన అబద్ధం గుర్తొచ్చింది. అందుకే, అభీని బంధువు అనుకుంటుంది కాబోలు అనుకుని ఫక్కున నవ్వింది.

మంగమ్మ యింకా ఏదో మాట్లాడుతూనే వుంది.

"నేను చెప్పాననుకోండి. పరాయి మనిషి ఈవిడికేం తెలుసు? అనుకోవచ్చు. వాళ్ళ నాన్న చెప్పాడనుకోండి తండ్రికదా.. అలాగే చెబుతాడు అనుకోవచ్చు. ఈ అబ్బాయి చెబితేనే అన్ని విధాలా కరెక్టుగా వుంటుంది. అనసూయమ్మగారి పెంపకం.. అతిథి మర్యాదలూ" అంటూ అభీకి లోపల నుంచి కుర్చీ తెచ్చి వేసింది.

రాఘవేంద్ర అమ్మా నాన్నా ఖరీదైన బట్టల్లో, పాలిష్డ్‌గా ఉన్న అభినవ్ వంక అనుమానంగా చూశారు.

రామారావుకీ ఈ కొత్త చుట్టం ఎవరో అర్థంకాలేదు. కానీ, సమయం కాదు, కాబట్టి మాట్లాడక ఊరుకున్నాడు.

"నేను రచితగారితో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి" రాఘవేంద్ర అన్నాడు.

పట్టుచీరలో అందంగా అలంకరించుకుని, తలవంచుకుని కూర్చున్న రచిత, ఎదురుగా కూర్చున్న రాఘవేంద్రని చూసేసరికి అభినవ్‌కి విషయం అర్థమైంది.

"రచితా... ఒక్కసారి నీతో మాట్లాడాలి. పద బైటికెళదాం." అభినవ్ దిగ్గున కుర్చీలో నుంచి లేచి అన్నాడు. అతని గొంతులో విసుగు, తొందర ధ్వనించాయి.

ఒకే డైలాగు యిద్దరు చెప్పడంతో బిత్తరపోయి చూస్తున్నారందరూ. రచిత తలయెత్తి అభీ కళ్ళలోకి చూసింది.

"బావుంది... అమ్మాయికో బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడన్నమాట. నయం బాబూ! సినిమాల్లోలాగా పీటల మీద పెళ్ళి చెడగొట్టకుండా, పెళ్ళిచూపులనాడే వచ్చి కళ్ళు తెరిపించావు... సంతోషం" అంటూ రాఘవేంద్ర తల్లి బయటికి నడిచింది.

ఆమె వెనకాలే, అతని తండ్రి, చెల్లెలు కూడా వెళ్ళారు.

రాఘవేంద్ర ఒకసారి నిరాశగా రచిత మొహంలోకి చూసి వెనుదిరిగాడు.

"ఆ అబ్బాయి మాట్లాడతాడేమోనని పెరట్లో మామిడి చెట్టు కింద కుర్చీలు వేసి ఉంచాను. మీరు అక్కడ కూర్చుని మాట్లాడుకోండి" తతంగం అంతా చూస్తున్న మంగమ్మ అభీవైపు, రచిత వైపు మార్చి చూస్తూ అంది.

ఇద్దరూ పెరట్లోకి నడిచారు.

బయట, ఎండగా వున్నా, అక్కడ చాలా చెట్లు ఉండడంతో చల్లగానే వుంది. మామిడిచెట్టు నిండా పూతతో పచ్చటి చీర మీద తెల్లని పిండిముగ్గు పెట్టినట్టు ఉంది.

ప్లాస్టిక్ కుర్చీలో రచిత ఎదురుగా కూర్చున్నాడు అభి.

ఇద్దరూ మౌనవ్రతం పాటిస్తున్నట్టుగా పెరడు నాలుగు మూలలకీ చూస్తూ కూర్చున్నారు.

"అయితే.. చివరికి నా పెళ్ళికూడా చెడగొట్టాలని వచ్చారన్నమాట!" ఏ భావమూ బైటపడకుండా అంది రచిత.

"ముందు నా పెళ్ళి చెడగొట్టుకునే వచ్చాను" చెప్పాడతను.

రచిత మాట్లాడలేదు.

అతను చెప్పడం మొదలుపెట్టాడు. "నా వల్ల నువ్వు యిబ్బందులు పడ్డావు. నాకు తెలుసు. సియానా టూ పొసెసివ్. నేను మీ యింటికి ఆ రాత్రి వచ్చినప్పుడే నువ్వు నా మనసులో నిలిచిపోయావు. నీ మంచితనం నన్ను కట్టిపడేసింది. ఎంతగా దాన్ని తేలిగ్గా తీసేయాలనుకున్నా నావల్ల కాలేదు. అప్పటిదాకా, సియానా గురించి ఉన్న ఆలోచనలు కూడా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి.

నువ్వు "ఐ లవ్‌యూ" అని చెప్పినప్పుడు నేను ఎంత సంతోషపడ్డానో నీకు తెలియదు.

కానీ, అత్తయ్య చనిపోవడం, మామయ్య డిప్రెషన్‌లో వుండడం, అన్నింటికన్నా సియానా యింకా నేను పెళ్ళి చేసుకుంటానన్న వూహల్లో ఉన్నప్పుడు నేను వాళ్ళ మానాన వాళ్ళని వదిలేసి, నా లైఫ్‌లో ముఖ్యమైన నిర్ణయం ఎలా తీసుకోగలను? అందుకే ఏమీ మాట్లాడలేకపోయాను..."

"అవును.. ప్రేమ కూడా ఒక బిజినెస్ డీల్. నిర్ణయాలు తీసుకోవడానికి" ఉక్రోషంగా అంది.

"ఐ డోన్ట్ నో.. వాళ్ళు బాధల్లో ఉండగా యింకా బాధపెట్టడం. ఆ తర్వాత గిల్టీగా ఫీలవ్వడం నాకిష్టం లేదు. మామయ్య కోలుకున్నాక, సియానాని ఒప్పించి ఆ తర్వాతే ఏమైనా చేయాలనుకున్నాను."

"మంచిది.. మధ్య నా పెళ్ళి ఎందుకు చెడగొట్టారు?"

"ప్లీజ్.. రచితా! యిమా అలా మాట్లాడకు. ఐ లవ్ యూ! అమ్మమ్మ చనిపోయిందని తెలిశాక, ఆ సమయంలో నీ పక్కన లేనందుకు నేను ఎంత బాధపడ్డానో నీకు తెలియదు." కుర్చీలోనుంచి రచిత చేతులు పట్టుకుంటూ అన్నాడు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అతను ముందుకు వంగి, ఆమెను దగ్గరకి తీసుకున్నాడు.

"మరి, సియానా?" సందేహంగా అడిగింది.

"షి ఈజ్ ఓ.కె. ఇంట్లో స్ట్రేంజర్స్ వచ్చి వాంతులు చేసుకున్నా, ఓపిగ్గా సేవలు చేసేంత మంచి అమ్మాయి దొరికింది నీకు. వదులుకోకు అంది."

రచిత ఫకాల్న నవ్వింది.

"ఇంకో విషయం.."

ఏమిటన్నట్టుగా అభీ కళ్ళలోకి చూసింది.

"ఆ రోజు స్టెయిర్‌కేస్ మీద సియానే నన్ను ముద్దుపెట్టుకుంది. నేను కాదు. అది తప్పు.. యింకెప్పుడూ మా యిద్దరి మధ్యా అటువంటివేమీ జరగలేదు నమ్ము" అన్నాడు.

సమాధానంగా ఆమె పెదవులు, అతని పెదవుల్ని ముద్దాడాయి. హఠాత్తుగా పెరట్లోకి మంగమ్మ రావడంతో యిద్దరూ దూరంగా జరిగారు.

"ఎంతసేపయినా రాలేదేమిటా అని వచ్చా.! అర్థం అయ్యిందిలే." అని నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

రచిత, అనసూయమ్మ కట్టిన ముడుపు భద్రాచలం హుండీలో వేసి రావాలని ఎప్పటినుంచో అడుగుతూ వుండడంతో, అభీ, ఆమెను భద్రాచలం తీసుకుని వెళ్ళాడు.

తిరిగి వస్తున్నప్పుడు కారు ముందు సీటులో వెనక్కివాలి కళ్ళుమూసింది రచిత. వెంటనే కునుకు పట్టేసింది.

కాస్సేపటికి కారు ఆగినట్టవడంతో లేచి చూసింది. చుట్టూ తనకి తెలిసిన పరిసరాలు.

ఆశ్చర్యంతో అభీ మొహంలోకి చూసింది.

"మీ ఊరే వచ్చాం. దిగు" అన్నాడతను నవ్వుతూ. రచిత కారు దిగింది. ఎదురుగా చిన్నతనంలో తను తిరిగిన యిల్లు.

అభీ ఆమె వైపు చూసి నవ్వుతూ చెప్పాడు.

"యిది నిజమే... కల కాదు.."

రచిత చుట్టూ చూసింది. కాంపౌండ్ వాల్ కొత్తగా కట్టినట్టు ఉంది. లోపల తోట అచ్చంగా యిదివరకు ఉన్నట్టే ఉంది.

అభీ ఆమె చేయి పట్టుకుని లోపలికి తీసుకుని వెళ్ళాడు.

ఒక్కో అడుగుకీ, ఒక్కో జ్ఞాపకం తెరలుగా గుర్తుకి వచ్చి ఉక్కిరిబిక్కిరయ్యింది రచిత.

పాతగోడల స్థానంలో గట్టిగా బలంగా ఉన్న కొత్తగోడలు, అటాచ్డ్ బాత్‌రూంలు యింటి అందాన్ని చెడగొట్టకుండా చక్కగా అమరిపోయాయి.

పడక్కుర్చీ, పందిరిమంచం, ఉయ్యాలబల్ల, నల్లమానుతో చేసిన అలమరలు అలాగే వున్నాయి. కాకపోతే, బాగుచేసి కొత్తవిగా తీర్చిదిద్దారు.

పడక్కుర్చీ వెనకాల పక్కగోడకి, అనసూయమ్మ, రచిత కలిసి తీయించుకున్న ఫోటో పెద్దదిగా చేసి, అందమైన ఫ్రేమ్‌లో బంధింపబడి వుంది.

రచిత ఆనందంగా యిల్లంతా తిరిగి చూసింది.

"అభీ.."

నవ్వుతూ అతని వైపుకి తిరిగింది. "మన పెళ్ళికి ముందరే సియానించి దీన్ని కొన్నాను. నిన్ను సర్‌ప్రైజ్ చేయాలనే యిన్నిరోజులూ చెప్పలేదు. నీ అనుమతి లేకుండానే కొన్ని మార్పులు చేయించాను. నచ్చిందా.. నీ కలల రాజభవనం? యిక నుంచీ యిదే మన హాలిడే హౌస్" చెబుతూ ఉన్నాడతను.

"థాంక్యూ..." సంతోషంగా అతన్ని చుట్టేస్తూ అంది.

"ఎందుకు? నువ్వే నన్ను సర్‌ప్రైజ్ చేశావుగా ఆరునెలల్లో పాపో, బాబో పుడతారని" కొంటెగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"అనసూయమ్మ తిరిగి ఆ యింట్లోనే ఆడుకోబోతుందేమో" అన్న చిన్న వూహ ఆమె కళ్ళలోకి మెరుపుల్ని తెప్పించింది.

ఆ మధురక్షణాలు జారిపోకుండా ఆమెను మరింత దగ్గరగా గుండెలకి హత్తుకున్నాడు.

పిల్లగాలికి తోటలోని జాజితీగ వయ్యారంగా ఊగింది. మంచితనం నిండిన రచిత మనసులాగే, పూలపరిమళంతో పరిసరాలన్నీ గుబాళించాయి. "గాలి తెమ్మెర తోడైతేనే, పూలతోట సుగంధాలు విరజిమ్మగలదు.." అనుకుంటూ అభీ రూపాన్ని మనసులో నింపుకుందామె.

చివరగా ఒక చిన్నమాట..

*అప్పుడప్పుడూ చిన్నా చితకా కథలు రాయడం తప్ప నవల రాయడం యిదే మొదటిసారి. అందులోనూ ప్రముఖ రచయిత(త్రు)లు రాస్తున్న 'కౌముది 'కి సీరియల్ రాయడం నిజంగా ఒక కొత్త అనుభవం.*

*మామూలుగా రాయడం కంటే చదవడం అంటేనే ఎక్కువ ఆసక్తి. తెలుగులో, యింగ్లీషులో చాలా పుస్తకాలూ, నవలలూ చదివినా, మన నేపథ్యానికి దగ్గరగా అనిపించే రచనలే నాకు యిష్టం.*

*యద్దనపూడి సులోచనారాణిగారు, బలభద్రపాత్రుని రమణిగారు నా అభిమాన రచయిత్రులు. దాదాపుగా వారు రాసిన నవలలన్నీ చదివాను. కానీ.. ఎప్పుడూ నాకు నవల రాయాలన్న ఆలోచన రాలేదు.*

*ఒకసారి రమణి గారి 'ఎందుకీ సందెగాలి ' చదివాను. అందులో వారు అందమైన ఊహల్ని, వాస్తవాల్ని, మానసిక సంఘర్షణలను అక్షరబద్ధం చేసిన తీరు అద్భుతం అనిపించింది.*

*పాత్ర స్వభావాన్ని మనం అనుకున్న రీతిలో ఆవిష్కరించడానికి కథానిక కన్నా నవల అయితే సరిగ్గా వుంటుందన్న విషయం అప్పుడు బోధపడింది.*

*ఆ ప్రేరణతోనే నవలని ప్రారంభించాను. "అమ్మో! అన్ని పేజీలు రాయలేనేమో" అని ఎప్పుడూ అనిపించలేదు. ఎంతో యిష్టంతో ప్రారంభించి పూర్తిచేశాను.*

*కిరణ్‌ప్రభగారితో ఫోన్‌లో మాట్లాడినప్పుడు, నవల యితివృత్తం గురించి నాలుగువాక్యాలు వారికి వివరించాను. నవలలోని పాత్రలు, వాటి చిత్రణ ముగింపులాంటివి ఎలా రాయగలనో అని సందేహపడకుండా, వెంటనే రాబోయే నవలగా ప్రకటించారు కిరణ్‌ప్రభగారు.*

*నా మీద వారు వుంచిన నమ్మకానికి నా ధన్యవాదాలు. అలాగే, నవలని చదవగానే నాకు అభినందనలు తెలిపి, అందమైన కవర్ పేజ్ తయారుచేసిన కాంతిగారికి నా కృతజ్ఞతలు.*

*ఇంకా మొదటి నెల సీరియల్ అచ్చవుతూనే చదివి, స్పందించి ప్రోత్సాహపరిచిన బలభద్రపాత్రుని రమణిగారికీ, ఇంకా ప్రతినెలా "ఈ వాక్యం బాగా వ్రాశారు", "ఆ పాత్రని చూసి చాలా కోపమొచ్చింది" అంటూ వ్యాఖ్యలు చేస్తూ సుగంధవనాన్ని ఆస్వాదించిన నా ప్రియపాఠక మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.*

*తడబడుతూ మొదటి అడుగు వేసినా మీ ప్రోత్సాహమే యింధనంగా యింకా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ.....*

**శ్రీకళ అబ్బరాజు.**